
'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 107

సోమవారం 8-7-2019




నెల రోజులలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు

రాబోయే సంవత్సర కాలంలో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు


SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL






జారీ చేసిన వారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



వై.యస్.ఆర్ రైతు దినోత్సవం
రైతే రాజు
వై.యస్.ఆర్ రైతు దినోత్సవం - 8, జులై
రైతే రాజు
రాబోయే సంవత్సర కాలంలో రైతు సంక్షేమం కోసం
ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు
రూ. 2 వేల కోట్లతో
ప్రకృతి విపత్తుల సహాయ నిధి.
ఖరీఫ్‌లో పంట నష్టం కలిగిన రైతులకు
రబీలో నష్ట పరిహారం అందజేస్తాము
అక్టోబర్ 15వ తేదీన కౌలురైతులతో కలిపి దాదాపు 70 లక్షల
రైతు కుటుంబాలకు ఏటా
రూ. 12,500 చొప్పున ఆర్థిక సహాయం
భూ యజమానులకు ఇబ్బంది లేకుండా
కౌలురైతులకు ఉపశమనం కల్పిస్తూ
11 నెలలకు మించకుండా పంటపై మాత్రమే
హక్కు వచ్చేవిధంగా కౌలు రైతుల చట్టం
వై.యస్.ఆర్ జలయజ్ఞం ద్వారా
సకాలంలో ప్రాజెక్టుల పూర్తి / చెరువుల
పునరుద్ధరణ
మొదటి ఏడాదే
సహకార రంగ పునరుద్ధరణ
రైతులకు
ఉచితంగా బోర్లు వేయిస్తాం.
ఇందుకోసం 175 నియోజక వర్గాలలో
200 రిగ్గులు అందుబాటులోకి తెస్తాం
శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
ప్రతి నియోజకవర్గంలో
శీతలీకరణ గోదాములు, అవసరం మేరకు
ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు
గోదావరి జలాలను నాగార్జున సాగర్,
శ్రీశైలంకు తరలించడం ద్వారా కృష్ణ ఆయకట్టును
స్థిరీకరిస్తూ రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రజలకు
తాగునీరు, సాగునీరు అందజేస్తాము
గిట్టుబాటు ధరకు
గ్యారెంటీ కల్పించడానికి
రూ. 3 వేల కోట్లతో ధరల
స్థిరీకరణ నిధి
కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, కల్తీ పురుగు మందులతో
సతమతమవుతున్న రైతులకు తోడుగా
ఉండేందుకు ప్రతి నియోజకవర్గంలో నాణ్యతా ప్రమాణాలు
పరీక్షించడానికి ప్రయోగశాలలు.
ప్రతి గ్రామంలోను నాణ్యమైన విత్తనాలు,
ఎరువులు, పురుగు మందుల విక్రయ కేంద్రాలు
మహానేత మహోన్నత సంకల్పం - రైతే రాజుగా రాజన్న రాజ్యం
జారీ చేసిన వారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 107

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


# రసవత్తరం.. కర్ణాటకం



విదేశీ పర్యటన ముగించుకుని ఆదివారం బెంగళూరు చేరుకున్న ముఖ్యమంత్రి కుమారస్వామి

## బుజ్జగింపుల పర్వం షురూ

- అసంతృప్త ఎమ్మెల్యేలతో కాంగ్రెస్, జేడీఎస్ ముఖ్యనేతల భేటీ
- అమెరికా నుంచి బెంగళూరుకు చేరుకున్న సీఎం కుమారస్వామి
- సిద్దరామయ్యకు సీఎం పదవి ఇస్తే వెనక్కి వస్తామన్న రెబెల్స్
- కాంగ్రెస్ నేతలపై సోనియాకు దేవెగౌడ ఫిర్యాదు

- 7లో



కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పార్టీని అస్తవ్యస్తం చేశారు. ఎమ్మెల్యే రోషన్‌బేగ్‌ను సస్పెండ్ చేయడం, మంత్రి డీకే శివకుమార్–మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళి మధ్య గొడవల లాంటి వన్నీ కాంగ్రెస్ నేతలు సృష్టించిన సమస్యలే. సిద్దరామయ్య సీఎం అభ్యర్థి అయితే మేం మద్దతు ఇవ్వం. – జేడీఎస్ నేత దేవెగౌడ



ప్రభుత్వ ఏర్పాటు విషయంలో హైకమాండ్‌తో చర్చించాకే తుది నిర్ణయం తీసుకుంటాం. రాష్ట్రంలో అధికారం చేపట్టబోం అని చెప్పడానికి మేమేమైనా సన్యాసులమా? రాష్ట్రంలో ఎన్నికలు జరిగి 13 నెలలే అయింది. ఇంతలోనే మరోసారి అసెంబ్లీ ఎన్నికలకు మేము ఒప్పుకోం. – బీజేపీ నేత యడ్యూరప్ప

## కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం.. సిద్దరామయ్య!

7లో



# నాకౌట్ పంచ్ ఎవరిదో?

- ప్రపంచకప్ సెమీఫైనల్స్‌కు రంగం సిద్ధం
- తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ 'ఢీ'
- మనమే ఫేవరెట్..

వన్డే క్రికెట్ ప్రపంచకప్ టోర్నమెంట్ అంతిమ ఘట్టానికి చేరుకుంది. వరుసగా 38 రోజులపాటు సాగిన లీగ్ దశ మ్యాచ్‌లు శనివారంతో ముగిశాయి. ఇక మూడు నాకౌట్ మ్యాచ్‌లు మాత్రమే మిగిలాయి. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన భారత్ మంగళవారం మాంచెస్టర్‌లో జరిగే తొలి సెమీఫైనల్లో నాలుగో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్‌తో తలపడనుంది. బలాబలాలను పరిశీలిస్తే ఈ మ్యాచ్‌లో భారతే ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఈ ప్రపంచకప్‌కంటే ముందు న్యూజిలాండ్ ఏడుసార్లు సెమీఫైనల్ చేరగా... ఒకసారి మాత్రమే సెమీఫైనల్‌ను దాటి ఫైనల్ చేరింది. భారత జట్టు ఆరుసార్లు సెమీఫైనల్ చేరగా... మూడుసార్లు ఫైనల్‌కు చేరి, మరో మూడుసార్లు సెమీఫైనల్లో ఓడిపోయింది. గురువారం బర్మింగ్‌హామ్‌లో జరిగే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు అమీతుమీ తేల్చుకోనుంది.

- వివరాలు స్పోర్ట్స్‌లో



## ఐఏఎస్‌ల సంఘం అధ్యక్షుడిగా బీపీ ఆచార్య

- రాష్ట్ర ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య ఎన్నికయ్యారు. రాష్ట్ర ఐఏఎస్ అధికారుల సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఈ మేరకు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- వివరాలు 2లో

## దేశంలో 5.28 లక్షల పోలీసు ఉద్యోగాలు ఖాళీ

ఒకవైపు ఉద్యోగాలు లేక దేశంలో నిరుద్యోగులు నానా బాధలు పడుతుంటే, ప్రభుత్వాలు మాత్రం ఉన్న ఖాళీల భర్తీలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ వెల్లడించిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. దేశంలో 5.28 లక్షల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వెల్లడించింది.

- 7లో

# అర్బన్ పాలసీ అదరాలి



## ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి, పారదర్శక పాలనే లక్ష్యం

### ఆ మేరకు కొత్త పాలసీలను రూపొందించాలని కేసీఆర్ దిశానిర్దేశం

- అర్బన్ పాలసీలో భాగంగా కొత్త మున్సిపల్, జీహెచ్ఎంసీ చట్టాలు
- కొత్తగా రూరల్, రెవెన్యూ పాలసీల రూపకల్పన కూడా..
- 3 రోజుల్లో ముసాయిదా.. అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం
- చట్టాల ప్రకారమే అధికారులు, ప్రజాప్రతినిధులకు బాధ్యతలు
- గ్రామాల అభివృద్ధికి ఐదేళ్లలో రూ. 35 వేల కోట్ల కేటాయింపు
- నూతన అర్బన్ పాలసీపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష

"తెలంగాణ పల్లెలు పచ్చదనంతో, పరిశుభ్రతతో కళకళలాడాలి. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్లు గ్రామాల వికాసానికి పూనుకోవాలి.

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో అవినీతికి ఆస్కారం లేనివిధంగా ప్రజలకు పారదర్శకమైన సేవలు, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరిగేలా తెలంగాణ నూతన అర్బన్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. అర్బన్ పాలసీతోపాటు కొత్త రూరల్ పాలసీ, కొత్త రెవెన్యూ పాలసీలను కూడా రూపొందించాలన్నారు. నూతన అర్బన్ పాలసీలో భాగంగా నూతన మున్సిపల్ చట్టం, నూతన కార్పొరేషన్ల చట్టం, నూతన హైదరాబాద్ నగర కార్పొరేషన్ చట్టం తీసుకురావాలని, హెచ్ఎండబ్ల్యూఏతో పాటు ఇతర నగరాల అభివృద్ధి సంస్థల పాలనకు సంబంధించి కూడా కొత్త చట్టం రూపొందించాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లోనే ఈ చట్టాల ముసాయిదా తయారు చేయాలన్న కేసీఆర్... త్వరలోనే అసెంబ్లీని సమావేశపరిచి కొత్త చట్టాలు తెస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర నూతన అర్బన్ పాలసీ రూపకల్పనపై సీఎం కేసీఆర్ ఆదివారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

### పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసేలా...

అవినీతికి ఏమాత్రం ఆస్కారం కలిగించని విధంగా, అక్రమ కట్టడాలకు ఏమాత్రం వీలులేని విధంగా, పచ్చదనం–పరిశుభ్రత వెల్లివిరిసేలా నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దడానికి ఉపయోగపడే కొత్త చట్టాలు ఉండాలని సీఎం కేసీఆర్ నిర్దేశించారు. ఈ చట్టాల ప్రకారమే నగర పాలన జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులకు బాధ్యత అప్పగించాలని నిర్ణయించినట్లు సీఎం చెప్పారు. బాధ్యతలను విస్మరించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే అధికారం కూడా చట్టమే కల్పిస్తుందని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పరిస్థితిని చక్కదిద్దే బృహత్తర ప్రయత్నంలో కలెక్టర్లు క్రియాశీల బాధ్యత పోషించేలా చట్టంలో నిబంధనలు పెడతామని చెప్పారు. ఎవరిష్టం వచ్చినట్లు వారు నిధులు ఖర్చు చేయకుండా ఆయా నగరాలు, పట్టణాల ప్రాధాన్యతలు, సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసమే నిధులు వెచ్చించాలన్నారు. మున్సిపాలిటీలకు ఆదాయం రావాలని, వచ్చిన ఆదాయం సద్వినియోగం కావాలని చెప్పారు. రాష్ట్రంలో పద్ధతి ప్రకారం నగర–పట్టణ పాలన సాగేందుకు నూతన పాలసీ, కొత్త చట్టాలు ఉపయోగపడాలని పేర్కొన్నారు. ''తెలంగాణ ఏర్పడిన వెంటనే రాష్ట్ర ప్రాధాన్యతలను గుర్తించాం. సంక్షేమ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. విద్యుత్ సంక్షోభాన్ని పరిష్కరించుకున్నాం. మంచినీటి సమస్యను తీర్చుకున్నాం. సాగునీటి కోసం ప్రాజెక్టులు కడుతున్నాం. పారిశ్రామికాభివృద్ధి కోసం టీఎస్ ఐపాస్ చట్టం చేసుకున్నాం. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం మరో మెట్టు ఎక్కాలి. దీనికోసం మంచి విధానాలు

మిగతా 2వ పేజీలో ▶

# గురుకులాల్లో 667 పోస్టులకు లైన్ క్లియర్



### కొత్త జోనల్ విధానం ప్రకారం నియామకాలు

### త్వరలో గురుకుల సొసైటీల నుంచి బోర్డుకు ప్రతిపాదనలు

### ఆ తర్వాత నోటిఫికేషన్ల విడుదల ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో పోస్టుల విభజన పూర్తి కావడంతో వాటిల్లో ఖాళీల భర్తీకి గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) దృష్టి సారించింది. కొత్త జోనల్ విధానం అమల్లోకి రావడంతో గతంలో మిగిలిపోయిన పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రభుత్వ ఆమోదం లభించిన పోస్టులను కొత్త జోనల్ విధానం ప్రకారం భర్తీ చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం గురుకుల బోర్డు వద్ద 667 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. తాజాగా పోస్టుల విభజన పూర్తి కావడంతో నియామకాలకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలో తాజా పోస్టులకు గురుకుల సొసైటీలు మరోమారు ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. కొత్త జోనల్ విధానం, కొత్త జిల్లాలవారీగా పోస్టులను విభజించిన తర్వాత ప్రతిపాదనలను గురుకుల

మిగతా 2వ పేజీలో ▶

## సంక్షేమ సంతకం.. చెరగని జ్ఞాపకం

జనం గుండె చప్పళ్లలో..

చూశారు.. విన్నారు.. చేశారు

అభివృద్ధికి చిరునామా



నేడు వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనాలు ఫుల్ అవుట్‌లో









# కాళేశ్వరం ఎత్తిపోతలు షురూ

- ప్రాణహితతో పెరుగుతున్న వరద ఉధృతి
- మేడిగడ్డకు లక్ష, కాళేశ్వరానికి 96 వేల క్యూసెక్కుల వరద
- 1వ, 6వ మోటార్ల ద్వారా నీరు ఎత్తిపోత
- రెండు రోజుల్లో అన్నారానికి 1.5 టీఎంసీలు
- కాళేశ్వరంపై సీఎం కేసీఆర్ నిరంతర సమీక్ష
- వారానికో టీఎంసీ తరలింపునకు ఏర్పాట్లు!



ఆదివారం కన్నెపల్లి వద్ద గోదావరి నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం

గోదావరి, ప్రాణహిత నదుల్లో ప్రవాహాలు పెరుగుతుండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుల్లోని మేడిగడ్డ ద్వారా గరిష్ట నీటిని ఎత్తిపోసే ప్రక్రియ వేగం పుంజుకుంది. ఇప్పటికే మేడిగడ్డ పంప్‌హౌజ్ పరిధిలో మూడు మోటార్లకు ట్రయల్‌రన్ పూర్తవగా, రెండు పంపులను నిరంతరాయంగా నడుపుతున్నారు. మూడు రోజులుగా వెట్‌రన్‌లు పూర్తి చేస్తుకున్న 1వ, 6వ మోటార్ల ద్వారా పంపుహౌస్ నుంచి డెలివరీ సిస్టంలో నీటిని ఎత్తిపోస్తున్నారు. ఈ ప్రయత్నం ద్వారా 1.5 టీఎంసీల నీరు అన్నారం బ్యారేజీలో కలిసినట్లు ఇంజనీర్లు పేర్కొంటున్నారు. అలాగే మూడు మోటార్లు నడిస్తే మరింత నీరు అన్నారం బ్యారేజీలో నిల్వ చేయడానికి వీలుగా ఉంటుంది. అక్కడి నుంచి సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్‌మానేరుకు తరలించనున్నారు. మూడో నంబర్ మోటార్‌కు రాత్రి వరకు వెట్‌రన్ నిర్వహించి ఎత్తిపోయనున్నారు. తెలంగాణలో ఆశించినమేర వర్షాలు లేనప్పటికీ మహారాష్ట్రలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో.. గడ్చిరోలి జిల్లా మాలేగావ్ నుంచి భారీగా వరద ప్రాణహిత నదిగుండా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మం డలం కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తోంది. ఆదివారం కాళేశ్వరం, కన్నెపల్లి ప్రాంతాల్లో 96 వేల క్యూసెక్కులు, మేడిగడ్డ బ్యారేజీ వద్ద లక్ష క్యూసెక్కుల వరద కిందికి పోతోంది. సోమవారం తెల్లవారుజాము వరకు ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిసింది. దీంతో 4,600 క్యూసెక్కుల నీరు అన్నారం బ్యారేజీ వైపు పరుగులు తీస్తోంది. ఆదివారం అర్ధరాత్రినుంచి లేక సోమవారం నుంచి మూడు మోటార్లను నడిపేలా అధికారులు ఏర్పాట్లు

మిగతా 2వ పేజీలో ▶






## ఇదండీ సంగతి



... కిడ్నాప్ కాదు! పార్టీలో చేర్చుకుంటున్నారు!

## రిటైర్మెంట్‌కు ఎంత కావాలి?



- ఇందుకోసం ఎన్నో సూత్రీకరణలు
- 60 ఏళ్ల నాటికి జీవన వ్యయాలే కీలకం
- కనీసం వార్షిక ఖర్చులకు 28–30 రెట్లు అవసరం
- సంపాదన ఆరంభించిన నాటి నుంచే ప్రణాళిక
- అప్పుడే దీర్ఘకాలంలో తగినంత నిధి

- బిజినెస్‌లో

## బాలాకోట్ నుంచి బిచాణా ఎత్తేశారు!



- పాక్–అఫ్గాన్ సరిహద్దులకు తరలిన ఉగ్ర శిక్షణ శిబిరాలు
- భారత దౌత్య కార్యాలయాలకు పొంచి ఉన్న ముప్పు
- నిఘా విభాగాలు అప్రమత్తం

- వివరాలు 7లో

## రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: బిహార్ పశ్చిమ ప్రాంతం, దానిని ఆనుకుని ఉన్న తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## ఐఏఎస్‌ల సంఘం అధ్యక్షుడిగా బీపీ ఆచార్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య ఎన్నికయ్యారు. రాష్ట్ర ఐఏఎస్ అధికారుల సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఈ మేరకు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం కార్యదర్శిగా పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, ఉపాధ్యక్షురాలిగా వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సంయుక్త కార్యదర్శిగా సీఎంఓ కార్యదర్శి సందీప్ సుల్తానియా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, జీఏడీ అదనపు కార్యదర్శి అర్విందర్ సింగ్, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్లు ఆమ్రపాలి, ఎండీ ముషర్రఫ్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కొర్ర లక్ష్మీ ఎన్నికయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రిటైర్డు ఐఏఎస్‌లు రేమండ్ పీటర్, వినోద్ అగర్వాల్ నియమితులయ్యారు.

## వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోండి

- ఎంసెట్ వెబ్ ఆప్షన్లకు నేడే ఆఖరు..: నవీన్ మిట్టల్

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 8వ తేదీతో ముగుస్తుందని ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ఇప్పటివరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోని వారంతా ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఎంసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా 53,890 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైతే అందులో 45,435 మంది విద్యార్థులు పాస్‌వర్డ్‌ను జనరేట్ చేసుకున్నారని తెలిపారు. వారిలో 38,495 మంది మాత్రమే ఆదివారం వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారని వెల్లడించారు. ఆప్షన్లు ఇచ్చుకోని వారు చివరి రోజైన(8వతేదీ) వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఆప్షన్లు ఇచ్చుకున్న వారిలో ఒక విద్యార్థి గరిష్టంగా 783 ఆప్షన్లు ఇచ్చారని వివరించారు. తమ ప్రాధాన్య క్రమంలో విద్యార్థులు వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. అప్పుడే వారి ర్యాంకు ఆధారంగా సీట్లు లభిస్తాయని వివరించారు. విద్యార్థులకు ఈ నెల 10న సీట్లను కేటాయిస్తామని, ఆ వివరాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని వెల్లడించారు.

## 11 నుంచి ఈసెట్ చివరి దశ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో (ల్యాటరల్ ఎంట్రీ) ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ చివరి దశ ప్రవేశాల కౌన్సెలింగ్‌ను ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఈనెల 11న ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, స్లాట్ బుక్ చేసుకుని 12వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. మొదటి దశలో సీట్లు రానివారితోపాటు కొత్తగా వెరిఫికేషన్ చేయించుకున్న వారు ఈనెల 12, 13 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని పేర్కొన్నారు. వారికి 15వ తేదీన సీట్లను కేటాయిస్తామని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 15 నుంచి 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, అలాగే కాలేజీల్లోనూ రిపోర్టు చేయాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను ఈనెల 16వ తేదీన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు.

## నేటి నుంచి పీజీ ప్రవేశ పరీక్షలు

హైదరాబాద్: పీజీ ప్రవేశ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉస్మానియాతోపాటు కాకతీయ, తెలంగాణ, శాతావాహన, పాలమూరు, మహాత్మా గాంధీ, జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీజీ డిప్లొమా, ఐదేళ్ల పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20 వరకు ప్రవేశ పరీక్షలు జరగనున్నట్లు సీపీజీఈటీ–2019 కన్వీనర్ కిషన్ తెలిపారు. నేడు డిప్లొమా కోర్సులు, ఎంఏ అరబిక్, థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 12 రోజులు జరిగే సీపీజీసెట్ ఎంట్రన్స్‌లకు 92వేల మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94921 08385 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## కౌన్సెలింగ్ కన్వీనర్‌గా ప్రొ. రమేశ్‌బాబు

హైదరాబాద్: రాష్ట్ర ఉన్నత విద్యామండలి వివిధ సెట్ల కౌన్సెలింగ్ కన్వీనర్‌గా ఉస్మానియా క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రమేశ్‌బాబును నియమించింది. ప్రస్తుతం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతిగా కొనసాగుతున్న ఆయన గతంలో ఓయూ పరీక్షల విభాగంలో అడిషనల్ కంట్రోలర్‌గా, పీజీఈసెట్ కో–ఆర్డినేటర్‌గా 10 సంవత్సరాలు పని చేశారు. ఈ విద్యా సంవత్సరానికి పీజీఈసెట్, ఐసెట్, ఎంసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీజీలాసెట్, పీఈసెట్ తదితర సెట్ల కౌన్సెలింగ్ నిర్వహణ బాధ్యతలను రమేశ్‌బాబుకు అప్పగించారు. పూర్తి వివరాలకు 9492108385 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

# నేనే రాజు నేనే మంత్రి

ఏ అనుమతులు తీసుకోలేదని బౌరంపేటలో కూల్చివేస్తున్న విల్లాలు



అనుమతులు లేకుండానే వందల కోట్ల వ్యాపారం

లెక్క కుదరకపోతే కూల్చివేత.. ఓకే అయ్యాక చకచకా

పంచాయతీ పర్మిషన్లతో విల్లాలు, వందల ఎకరాల్లో వెంచర్లు

జోన్ ఏదైనా పట్టింపుల్లేవు... చెరువులు, అసైన్డ్ భూముల్లోనూ..

'రియల్'లో ఆయన ఎంత చెబితే.. అంతా.

హెచ్‌ఎండీఏకు పంగనామాలు.. చోద్యం చూస్తున్న అధికారులు

అన్నీ సెట్ అయ్యాక బౌరంపేటలో పూర్తయిన విల్లాలు..





## నగర శివారులో అన్నీ తానే అంటూ యువ'రాజు' హల్‌చల్

సాక్షి, హైదరాబాద్

ఆయన కిరీటం లేని 'రాజు. శాఖలేని మంత్రి. ఆయన మాట అధికారులకు ఓ ఫర్మానా... ఆయన ఆదేశం వ్యాపారులకు శిలాశాసనం... ఆయన ఆజ్ఞ సొంతపార్టీ నేతలకు ఓ ఉత్తర్వు. ఇంతకీ ఎవరీయన అనుకుంటున్నారా? రాష్ట్ర రాజధానిలో అందరినీ హడలెత్తిస్తున్న ఈ యువరాజు ఐదేళ్ల క్రితం వరకూ ఏ రకమైన గుర్తింపు లేని సాధారణ కార్యకర్త. ఐదేళ్ల తర్వాత సీన్ కట్ చేసి చూస్తే.. నగర శివారులోని ఎకరం స్థలంలో నివాసం, నాలుగెకరాల్లో విలాసవంతమైన విశ్రాంతి భవనం.. తెల్లవారక ముందే తాము చేపట్టే వ్యాపారంలో పైసా పెట్టుబడి లేకుండా భాగస్వామికండంటూ క్యూకట్టే వ్యాపా రులు, మందీమార్బలం ఈయన సొంతం. నగరంలో ఓ నియోజకవర్గంలో వ్యాపారులను, అధికారులను శాసిస్తూ అన్నీ తానై చక్రం తిప్పుతున్న శివారు యువ'రాజు'ఆగడాలు విస్మయం కలిగిస్తున్నాయి. ఆయన ఆదేశాలు, సిఫారసులు ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల రాబడికి గండి కొట్టేస్తున్నాయి. నిబంధనకు తూట్లు పొడుస్తూ ఆయన కనుసన్నల్లో సాగుతున్న అడ్డదారి వ్యవహారం అధికార యంత్రాంగాన్ని విస్మయానికి గురిచేస్తోంది.

నగరం, శివారు ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అన్ని అనుమతులున్నా సవాలక్ష ప్రశ్నలతో ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువులు నీళ్లు తాగించే కొందరు అధికారులు ఈ యువ'రాజు'విషయంలో మాత్రం జీ హుజూర్ అంటున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట, బాచుపల్లి, నిజాంపేట, బీరంగూడ తదితర ప్రాంతాల్లో కేవలం పంచాయతీ అనుమతులతో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్ల వెనక ఆ యువనాయకుడి భరోసా ఉండటంతో కనీస అనుమతులు తీసుకోకుండా, ఫీజులు

### ఇక్కడ ఏ చట్టమైనా.. చెల్లదు..

చెల్లించకుండా విల్లాలు, డూప్లెక్స్‌లు, లగ్జరీ అపార్ట్‌మెంట్ల అమ్మకాలు చేపడుతున్నారు. వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు వినియోగించే సమయంలో నాలా ఫీజులు చెల్లించి అనుమతులు తీసుకోవటం తప్పనిసరి. కానీ, బాచుపల్లి, నిజాంపేట, బౌరంపేట, బీరంగూడ, మల్లంపేట తదితర ప్రాంతాల్లోని కన్జర్వేషన్ జోన్‌లోనూ వెంచర్లు వేసి బాహాటంగా విక్రయించటం, భూమిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకముందే అగ్రిమెంట్ డీడ్‌లతో ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌కు దరఖాస్తుచేసి ప్లాట్లను, విల్లాను విక్రయించటం అంతా ఈ నాయకుడి కనుసన్నల్లో సాగిపోతోంది. మల్లంపేట, బాచుపల్లి, నిజాంపేట, బీరంగూడ ప్రాంతాల్లో ఒక సంస్థ మెగాటౌన్‌షిప్స్, డూప్లెక్స్ విల్లాలు, లగ్జరీ అపార్ట్‌మెంట్ల కోసం 9 చోట్ల సుమారు వెయ్యి ఎకరాల్లో వెంచర్లు చేయగా ఇందులో సక్రమంగా ఉన్నవి కేవలం మూడు ప్రాజెక్ట్‌లేనని సమాచారం. ఈ విషయం హెచ్‌ఎండీఏ అధికారులకు తెలిసినా కన్నెత్తి చూసే సాహసం చేయటం లేదని విమర్శలున్నాయి.

### ముందు అలా.. తర్వాత ఇలా..

బౌరంపేటలో 14 ఎకరాల్లో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ సుమారు 194 విల్లాల నిర్మాణం చేపట్టగా, అవి నాలా పక్కనే ఉన్నాయని ఎన్‌వోసీ లేదని, ఈ భూమి కొంత కన్జర్వేషన్ జోన్‌లో ఉండటంతో సంబంధిత యువ నాయకుడి ఫిర్యాదు మేరకు 2017లో అధికార యంత్రాంగం ఆగమేఘాల మీద పన్నెండు విల్లాలను కూల్చేసింది. ఈ వ్యవహారం కోర్టుకు వెళ్లగా కోర్టు సైతం రెండు కోట్ల రూపాయలను డిపాజిట్ చేయమని ఆదేశించింది. ఈ డిపాజిట్ల అంశం ముందుకు సాగకుండానే యువనేత ప్లేటు ఫిరాయించి రియల్ ఎస్టేట్ సంస్థ వైపు ఎవరూ వెళ్లొద్దని హుకూం జారీ చేయటంతో ఈ విల్లాల పనులన్నీ చకచకా పూర్తయిపోయాయి. తాజాగా మల్లంపేట చెరువుకత్వా ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న భారీ వెంచర్ ఈ నాయకుడి కనుసన్నల్లోనూ సాగుతుం డగా, మరో వైపు ఓ వెంచర్‌లో ఐతే నాలుగు వరద కాల్వలను ఏకంగా మూసేశారు. స్వయంగా ఆ యువనేతే 4 ఎకరాల్లో నిర్మించుకున్న గెస్ట్‌హౌస్‌లోనూ ఎకరం భూమి వరకు అసైన్డ్ భూములుం డటం విశేషం. ఈ యువనాయకుడి సిఫారసుతో వెళ్లే రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌ల ఫిజికల్ వెరిఫికేషన్ లేకుండానే ఫైళ్లకు హాఫ్‌లైన్‌లో అనుమతులు వస్తుండటం కొసమెరుపు.

మల్లంపేట చెరువుకు అడ్డంగా కట్టవేసి.. నిర్మిస్తున్న భారీ వెంచర్..



# పారిశ్రామికవేత్త హత్య

- దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా రాంప్రసాద్‌పై దుండగుల దాడి
- హైదరాబాద్‌లో ఘటన

సాక్షి, హైదరాబాద్/అమరావతి/సాక్షి, అమరావతి బ్యూరో: పారిశ్రామికవేత్త తేలప్రోలు రాంప్రసాద్ (49) హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురయ్యారు. శనివారం ఆయన దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా పంజగుట్ట వద్ద దుండగులు కత్తులతో పొడిచారు. తీవ్రగాయాల పాలైన ఆయన చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని భట్టిప్రోలుకు చెందిన రాంప్రసాద్ హైదరాబాద్ ఖాజాగూడలో నివాసం ఉంటూ పరిగిలో అభిరాం స్టీల్స్ పేరుతో వ్యాపారం చేస్తున్నారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయాన్ని పంజగుట్ట దుర్గానగర్‌లో ఏర్పాటు చేశారు. ప్రతీ శనివారం కార్యాలయం మూసే సమయంలో దాని పక్కనే ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లడం ఆయనకు అలవాటు. ఎప్పటిలాగానే ఈ శనివారం రాత్రి 8:20 సమయంలో దైవ దర్శనం అనంతరం బయటకు వచ్చిన సమయంలో అక్కడే కాపుకాసి ఉన్న ముగ్గురు వ్యక్తులు కత్తులతో ఆయనపై దాడి చేసి విచక్షణారహితంగా పొడిచారు. దీంతో రాంప్రసాద్ అక్కడే కుప్పకూలిపోయారు. ఆయన చనిపోయాడని భావించిన దుండగులు కారులో పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు కొన ఊపిరితో ఉన్న రాంప్రసాద్‌ను సోమాజిగూడ యశోదా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున ఆయన కన్నుమూశారు.




### భార్య ఫిర్యాదుతో కేసు..

రాంప్రసాద్ భార్య వైదేహి ఫిర్యాదు మేరకు విజయవాడకు చెందిన కోగంటి సత్యం అనే వ్యక్తిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కోగంటి సత్యంతో ఆర్థిక వివాదాల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు వైదేహి ఫిర్యాదులో పేర్కొన్నారు.

### బొండా ఉమా భాగస్వామి..

కోగంటి సత్యం ఎండీగా ఉంటూ కామాక్షి స్టీల్ ట్రేడర్స్ పేరుతో విజయవాడలో వ్యాపారం నిర్వహిస్తున్నారు. 2008లో ఈ సంస్థలో రాంప్రసాద్‌తో పాటు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కూడా భాగస్వామిగా ఉండేవారు. 2013లో వ్యాపార లావాదేవీల్లో తేడాలు రావడంతో రాంప్రసాద్, బొండా ఉమ బయటకు వెళ్లిపోయారు. బొండా ఉమా, రాంప్రసాద్ తనను మోసం చేశారని కోగంటి సత్యం అప్పట్లో ఆరోపించారు. అనంతరం రాంప్రసాద్, సత్యం విజయవాడలోని కృష్ణలంకలో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

### పథకం ప్రకారం నన్ను ఇరికిస్తున్నారు

రాంప్రసాద్ హత్యతో తనకు సంబంధం లేదని కోగంటి సత్యం పేర్కొన్నారు. పథకం ప్రకారం తనను ఈకేసులో ఇరికిస్తున్నారన్నారు. తనపై రాంప్రసాద్ కుటుంబం ఆరోపణలు చేయడం వెనుక టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమ ఉన్నారని ఆరోపించారు. రాంప్రసాద్ తనకు రూ. 26 కోట్లు ఇవ్వాలని, ఆయన్ను చంపితే తనకు డబ్బులు ఎవరు ఇస్తారని ప్రశ్నించారు.

# అర్బన్ పాలసీ అదరాలి

▶ మొదటి పేజీ తరువాయి

రావాలి. కొత్తగా పంచాయతీరాజ్ చట్టం చేసుకున్నాం. ఇదే విధంగా రెవెన్యూ, మున్సిపల్ చట్టాలు కూడా రావాలి. పరిపాలన పారదర్శకంగా, వేగంగా, అవినీతికి ఆస్కారంలేని విధంగా సాగాలి'' అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

### రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ సమ్మేళనాలు...

తెలంగాణ పల్లెలు పచ్చదనంతో, పరిశుభ్రతతో కళకళలాడాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు గ్రామాల వికాసానికి పూనుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించడంతోపాటు గ్రామాల వికాసానికి, ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించడానికి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ సమ్మేళనాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని నాలుగు చోట్ల సమ్మేళనాలు నిర్వహిస్తామని, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జడ్పీ చైర్‌పర్సన్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలు, ఎంపీడీవోలు, డీఎల్పీవోలు, సీఈఓలను ఈ సమ్మేళనాలకు ఆహ్వానిస్తామని చెప్పారు. జిల్లా పరిషత్తులను, గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఏటా దాదాపు రూ. 7 వేల కోట్లను, ఐదేళ్లలో రూ. 35 వేల కోట్లను ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నిధులను సమర్థంగా వినియోగించుకొనే విధంగా స్థానిక సంస్థలు తయారు కావాలని చెప్పారు. గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా తయారు కావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి బాధ్యతలు నిర్వహించాలనే విషయంపైనా సమ్మేళనాల్లో చర్చించనున్నట్లు కేసీఆర్ తెలిపారు. సమ్మేళనాల తరువాత అధికారులతో కూడిన 100 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తామని, అవి గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు జరుపుతాయన్నారు. పచ్చదనం, పరిశుభ్రత విషయంలో అలసత్వం ప్రదర్శించినట్లు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మూడు నెలల్లో మార్పు కనిపించాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఇందుకోసం త్వరలోనే హైదరాబాద్‌లో కలెక్టర్లకు అవగాహన సదస్సు నిర్వహించాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, పురపాలకశాఖ డైరెక్టర్ శ్రీదేవి, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం ప్రగతి భవన్‌లో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ ఎస్‌కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ తదితరులు

# కాళేశ్వరం ఎత్తిపోతలు షురూ

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకున్నారు. మరో వారంలో 6 మోటార్లను నడుపుతూ ఒక టీఎంసీకి పైగా నీటిని.. ప్రతిరోజూ, వరద కొనసాగే అన్ని దినాలు నడిపేలా రంగం సిద్ధం చేస్తున్నారు.

### వచ్చిన వరద వచ్చినట్లుగా..

గోదావరిలో జూన్‌లో ఎక్కడా నీటి ప్రవాహాలు లేకున్నా ప్రస్తుతం క్రమంగా అవి పుంజుకుంటున్నాయి. మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నదిలో ప్రవాహాలు పుంజుకున్నాయి. రెండ్రోజుల కిందట మేడిగడ్డ వద్ద గోదావరి ప్రవాహం 8వేల క్యూసెక్కులుండగా, అది శనివారం 14వేల క్యూసెక్కులకు పెరిగింది. అది మరింత పుంజుకొని ఆదివారం మధ్యాహ్నానికి 26వేల క్యూసెక్కులకు చేరింది. మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం 85 గేట్లు ఉండగా.. ఆదివారం సాయంత్రం వరకు 52 గేట్లను కిందికి దించినట్లు ఇంజనీర్లు తెలిపారు. మిగితా గేట్లను సైతం మరో రెండు రోజుల్లో దించి ఉంచనున్నారు. దీంతో వరద ప్రవాహం నిలిచి నీటి నిల్వ పెరుగుతుంది. ఆ నీటిని కన్నెపల్లి వద్ద మోటార్లతో ఎత్తిపోయనున్నారు. మేడిగడ్డ పంప్‌హౌస్ (కన్నెపల్లి) వద్ద ప్రస్తుతం నీటి మట్టం 96.6 మీటర్లలో ఉంది. మోటార్లు నడిపేంత నీటి మట్టాలు ఉండటంతో ఇక్కడ రెండు మోటార్లను ప్రారంభించారు. మేడిగడ్డ పంపుహౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యముండే 11 పంపులను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటికే 9 పంపుల బిగింపు పూర్తయింది. మరో రెండో పురోగతిలో ఉన్నాయి. ఇందులో రెండు మోటార్ల ద్వారా ప్రస్తుతం 4,600 క్యూసెక్కుల నీటిని గ్రావిటీ కాల్వ ద్వారా అన్నారం బ్యారేజీకి వదులుతున్నారు. మరో మోటార్‌ను ఆరంభించే అవకాశం ఉంది. ఈ మూడు పంపులు ఒకే మారు నడిస్తే సుమారు అర టీఎంసీ మేర నీరు అన్నారంలోకి చేరుతుంది.



ఆదివారం కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి డెలివరీ సిస్టర్న్‌లోకి వస్తున్న గోదవరి నీరు

### ఆరు మోటార్ల ద్వారా..

ఇక గోదావరిలో ప్రవాహాలు మరింత పెరిగే అవకాశాల నేపథ్యంలో ఈ వారంలోనే మరో మోటార్‌కు ట్రయల్‌రన్ నిర్వహించి నీటిని ఎత్తిపోసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, మేఘ ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు అక్కడే ఉండి ట్రయల్‌రన్ పనులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఆరు రోజులుగా పంపుహౌస్ వద్దే మకాం వేసి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోని పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ 6 మోటార్ల ద్వారా 1.2 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని నీటి పారుదల వర్గాలు చెబుతున్నాయి. నీటి మట్టం 100 మీటర్లకు పైన చేరితే.. జూలై చివరి నుంచి అన్ని మోటార్లను నడిపించనున్నారు. పంపుహౌస్‌లో 11 మోటార్లకుగానూ 6 మోటార్లు డెలివరీ సిస్టంలో ఎత్తిపోసే వరకు ఇక్కడే ఉంటానని ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇక గ్రావిటీ కెనాల్ నుంచి నీరంతా అన్నారం బ్యారేజీకి చేరడంతో అక్కడ నీటి మట్టం పెరుగుతోంది. 11 టీఎంసీల సామర్థ్యమున్న అన్నారం బ్యారేజీలో 4.50 టీఎంసీల మేర నిల్వలు చేరితే అన్నారం పంప్‌హౌజ్‌లోని మోటార్లను నడిపించే వీలుంది. అన్నారం పంపుహౌస్‌లో 8 మోటార్లకుగాను 7 పంపులు, మోటార్ల బిగింపు పూర్తవగా, మరొకటి పురోగతిలో ఉంది. వచ్చే నెల మొదటి వారం నుంచి ఇక్కడి నుంచి సుందిళ్ల బ్యారేజీకి నీటి ఎత్తిపోతలు ఆరంభమయ్యే వకాశం ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. అనుకున్నట్లుగా వరద కొనసాగి మోటార్లన్నీ నడిస్తే వచ్చే నెల 15 నాటికి ఎల్లంపల్లి నింపే అవకాశం ఉంది. ఆగస్టు చివరికి ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంటుందని నీటి పారుదల వర్గాలు వెల్లడిస్తున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌస్‌ల్లో నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యాలను క్యాంపు కార్యాలయం నుంచి సీఎం కేసీఆర్ ప్రతిగంటకూ వీక్షిస్తున్నట్లు ఇంజనీర్లు వెల్లడించారు.

### సీసీటీవీలతో సీఎం సమీక్ష

వరద ఉధృతి, ఎన్ని మోటార్లు నడుస్తున్నాయి? ఇప్పటి వరకు ఎన్ని టీఎంసీల నీరు గోదావరి గుండా పోయింది? ఎన్ని టీఎంసీలు ఎత్తిపోశారనే వివరాలను తెలుసుకుంటున్నారు. అన్నారం బ్యారేజీ వద్ద గల అండల్ టన్నెల్‌లో సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని సీఎం కార్యాలయం నుంచి సూచించినట్లు తెలిసింది.

## గురుకులాల్లో 667 పోస్టులకు లైన్ క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

నియామకాల బోర్డుకు సమర్పిస్తే అప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చే వీలుంటుంది. ఈ మేరకు గురుకుల నియామకాల బోర్డు ఆయా సొసైటీలకు సూచనలు చేసింది. అతిత్వరలో సొసైటీల నుంచి ప్రతిపాదనలను తెప్పించుకొని నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు గురుకుల నియామకాల బోర్డు అధికారి ఒకరు 'సాక్షి'తో అన్నారు.

**కేటగిరీలవారీగా పోస్టుల వివరాలు**

| కేటగిరీ | పోస్టులు |
|---|---|
| ప్రిన్సిపాల్ | 18 |
| లైబ్రేరియన్ | 148 |
| పీడీ (డిగ్రీ), పీడీ | 206 |
| మెస్ మేనేజర్ | 31 |
| స్టాఫ్‌నర్స్ | 31 |
| కేర్ టేకర్ | 15 |
| ల్యాబ్ అసిస్టెంట్ | 62 |
| కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్ | 31 |
| అసిస్టెంట్ లైబ్రేరియన్ | 23 |
| జూనియర్ అసిస్టెంట్ కం డీఈఓ | 30 |
| స్టోర్ కీపర్ | 15 |
| క్రాఫ్ట్‌టీచర్ | 10 |
| ఆర్ట్ టీచర్ | 5 |
| మ్యూజిక్ టీచర్ | 5 |
| స్టాఫ్ నర్స్(డిగ్రీ) | 12 |
| పీఈటీ | 25 |



ఢిల్లీలోని ఏపీ భవన్‌లో చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న సంపత్‌కుమార్

## ఏపీ భవన్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి

సాక్షి, న్యూఢిల్లీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోమవారం వర్కింగ్ డే కావడంతో ముందుగానే ఏపీ భవన్‌లో వేడుకలు నిర్వహించినట్లు భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. జూలై 8న వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని ఆ రోజును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు దినోత్సవంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైఎస్సార్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'యాత్ర'చిత్రాన్ని భవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం మాజీ చీఫ్ కమిషనర్, వైఎస్సార్ హయాంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసిన సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం చిత్ర విరామం సమయంలో చిన్నారులతో కలసి ఆయన కేక్ కట్ చేశారు. నిబద్ధత, అంకితభావానికి వైఎస్సార్ మారు పేరని కొనియాడారు.

## రైతు బకాయిలు రూ. 150 కోట్లు విడుదల

### మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధర కింద సేకరించిన పలు పంటలకు సంబంధించిన బకాయిలు మొత్తం రూ. 150.17 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శనగలు, మినుములు, జొన్న, పొద్దుతిరుగుడు రైతుల బ్యాంకు ఖాతాల్లో ఆ నిధులను జమ చేస్తామన్నారు. పంటలకు మద్దతు ధరల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలలో స్పష్టత లేదని, పరిమిత పంటలకే కేంద్రం మద్దతు ధరకు అనుమతి ఇస్తోందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మిగిలిన పంటల విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. మద్దతు ధర కింద కేంద్రం అనుమతించే దానికి, క్షేత్రస్థాయిలో వస్తున్న దిగుబడికి పొంతన ఉండడం లేదన్నారు.

## సాంస్కృతిక వారసత్వం 'బోనాలు': కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల సాంస్కృతిక వారసత్వం బోనాల పండుగ అని మాజీ ఎంపీ కవిత అన్నారు. స్త్రీని ఆదిశక్తిగా కొలిచే మహోన్నత పండుగ అంటూ కీర్తించారు. ఆదివారం నుంచి ప్రారంభంకానున్న బోనాల వేడుక సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆమె ట్వీట్ చేశారు. అమ్మవారి దయ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

## డ్రిప్ యూనిట్లు పాత పద్ధతిలోనే ఇవ్వాలి

### కిసాన్ కాంగ్రెస్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: బిందు, తుంపర సేద్యాల కోసం రైతులకు డ్రిప్ యూనిట్లను పాత విధానంలోనే మంజూరు చేయాలని కిసాన్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. డ్రిప్ యూనిట్లకు అయ్యే ఖర్చు ముందు రైతులు భరిస్తే ఆ తర్వాత డీబీటీ విధానంలో రైతులకు మళ్లీ ఆ నగదును బదిలీ చేస్తామనడం డ్రిప్‌పై సబ్సిడీని ఎత్తివేయడంలో భాగమేనని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి ఆదివారం విమర్శించారు. ఈ విధానం ద్వారా రైతులకు డ్రిప్ అందేది కష్టమేనని, గతంలో ఉన్న విధానం ద్వారానే డ్రిప్ యూనిట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే డ్రిప్ యూనిట్లు పాత పద్ధతిలో ఇవ్వాలని అన్వేశ్‌రెడ్డి కోరారు.

## మూకదాడుల నియంత్రణకు చర్యలేవి?

### సీపీఐ నేత అజీజ్‌పాషా



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా మైనారిటీలు, దళితులపై దాడులు కొనసాగుతున్నా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు అజీజ్ పాషా విమర్శించారు. వీటిని అరికట్టడానికి వెంటనే చట్టం తీసుకురావాలని పార్లమెంటుకు సుప్రీంకోర్టు సూచించినా, కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తోందని ఒక ప్రకటనలో మండిపడ్డారు. గత ఐదేళ్లలో 266 మంది మూకదాడుల్లో చనిపోయారని, దేశవ్యాప్తంగా మూక దాడులకు వ్యతిరేకంగా పోరాడుతామని అజీజ్ పాషా స్పష్టం చేశారు.

## బీసీల సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్దాం

### బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: జాతీయ బీసీ కమిషన్ ఈ నెల 8న హైదరాబాద్‌కు రానుందని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీల సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు బీసీ నాయకులు కృషి చేయాలని సూచించారు. ఆదివారం బీసీ భవన్‌లో బీసీ కుల సంఘాలు, బీసీ సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ అధికారాలపై బీసీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ నెల 8న రవీంద్రభారతిలో బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులు సమావేశం కానున్నారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మాదిరిగానే ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు వంద శాతం ఫీజులను ప్రభుత్వమే భరించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకుడు జి.అంజి, గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్ పాల్గొన్నారు.

## హక్కులు అడుక్కుంటే రావు: జాజుల



హైదరాబాద్: హక్కులు అడుక్కుంటే రావని, సామాజిక చైతన్యంతో రాజ్యాధికారం సాధించుకుంటేనే వస్తాయని పలువురు వక్తలు అన్నారు. రుణాలు మంజూరు చేయాలని కోరుతూ చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద రజకులు మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతు ప్రకటించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రజకుల డిమాండ్ల పరిష్కారంలో సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రూ.లక్షా 20 వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో రజకుల సంక్షేమం కోసం రూ.235 కోట్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. హక్కులు అడుక్కుంటే రావని.. పోరాడి సాధించుకుంటామని ఉద్ఘాటించారు. రజకుల డిమాండ్లు న్యాయమైనవని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. వాషర్‌మెన్ ఫెడరేషన్‌ను కొనసాగిస్తూ బడ్జెట్‌లో రూ.450 కోట్లు మంజూరు చేసి దరఖాస్తుదారులందరికీ రుణాలు ఇవ్వకపోతే ప్రగతి భవన్ ముందు చాకిరేవు పెట్టి బట్టలు ఉతుకుతామని శ్రీలక్ష్మి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎ. శ్రీనివాస్, ఆర్.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటన్‌లో ఘనంగా బోనాల పండుగ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎన్నారై ఫోరం ఆధ్వర్యంలో బ్రిటన్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. దీనికి లండన్ ఎంపీలు వీరేంద్ర శర్మ, సీమా మల్హోత్ర, తెలంగాణ ఎన్నారై ఫోరం ఫౌండర్ చైర్మన్ గంప వేణుగోపాల్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, వెంకట్ తదితరులు హాజరయ్యారు. మహిళా సభ్యుల ఆధ్వర్యంలో లండన్ వీధుల్లో తొట్టెలు, బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం దుర్గా మాతకు బోనం సమర్పించారు. విదేశాల్లో పుట్టి పెరిగినప్పటికీ సంప్రదాయాలను మర్చిపోకుండా పండుగలు, ఉత్సవాలు నిర్వహించడం ఆనందకరమని వక్తలు పేర్కొన్నారు.

# కొత్త అసెంబ్లీ, సచివాలయం వద్దు

- ప్రభుత్వానికి అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- సచివాలయ భవనాల కూల్చివేత ప్రజాధనం దుర్వినియోగమే: ఉత్తమ్
- కూల్చివేతను గవర్నర్ అడ్డుకోకుంటే రాజ్‌భవన్ ముట్టడి: రేవంత్
- కేసీఆర్ తుగ్లక్‌లా వ్యవహరిస్తున్నారు: వివేక్




ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో కోదండరాం, వివేక్, కె. లక్ష్మణ్, ఎల్. రమణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత సచివాలయాన్ని కూల్చేసి కొత్త సెక్రటేరియట్‌ను, నూతన అసెంబ్లీని నిర్మించాలనుకోవడాన్ని అఖిలపక్ష సమావేశం తప్పుబట్టింది. ఈ చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా అవసరమైతే ఆందోళనకు దిగాలని నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్‌లో వెంకటస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కొత్త అసెంబ్లీ, సచివాలయ భవనాలు ప్రజలకు అవసరం లేదని, భవనాల కూల్చివేతను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ చర్య ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోబోమని హైకోర్టు పేర్కొనడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామన్నారు. మెట్రో నిర్మాణ సమయంలో అసెంబ్లీ పురాతన భవనమని, దాని ముందు నుంచి మెట్రో వెళ్లొద్దని వాదించిన కేసీఆర్... ఇప్పుడు నూతన అసెంబ్లీ కట్టాల్సిన అవసరం ఏమిటో ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు. సచివాలయ భవనాలన్నీ దాదాపు కొత్తవేనని, అవి ఇంకా 70 ఏళ్ల దాకా పటిష్టంగా ఉంటాయన్నారు. అసెంబ్లీ భవనంలో తెలంగాణ, ఆంధ్ర రెండు అసెంబ్లీలు నడిచాయని, పార్లమెంట్ భవన్ కంటే కూడా బాగుంటుందన్నారు. కొత్త భవనాల కట్టడాలకు వ్యతిరేకంగా చేపట్టే ఎలాంటి ఉద్యమ కార్యాచరణకైనా కాంగ్రెస్ మద్దతిస్తుందని ప్రకటించారు.

**2015లోనే రూ.20 కోట్లతో ఆధునీకరణ**

ముఖ్యమంత్రి కేసీఆర్ తన మూఢ నమ్మకాలను ప్రజలపై రుద్దాలని చూస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 1985లో అన్ని వసతులతో నిర్మించిన అసెంబ్లీని 2015లో కేసీఆర్ రూ. 20 కోట్లతో ఆధునీకరించారని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రజల అవసరాల కోసం కట్టే భవనాలన్నీ వందేళ్ల పాటు మన్నికగా ఉంటాయని, అందువల్ల సచివాలయ భవనాలను వందేళ్లు వాడాల్సిందేనన్నారు. సీ-బ్లాక్ పక్కన ఉన్న మసీదు, పోచమ్మ గుడిని ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. సచివాలయంలో ఉన్న నిజాం కట్టిన ఒక్క భవనాన్ని చూపి మొత్తం పది భవనాలను కూల్చాలని కేసీఆర్ చూస్తున్నారని ఆరోపించారు. ఈ భవనాలను కాపాడాల్సింది గవర్నరేనని, ఆయన కాపాడకపోతే రాజ్‌భవన్‌ను ముట్టడిస్తామని రేవంత్ హెచ్చరించారు.

**ఆ నిధులను డబుల్ బెడ్రూంల కోసం వాడాలి: ఆర్. కృష్ణయ్య**

సీఎం కేసీఆర్ తన పేరు ప్రతిష్టల కోసం కొత్త అసెంబ్లీ, సచివాలయ భవనాల నిర్మాణాలకు పూనుకున్నారని బీసీ సంఘం నేత, మాజీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. నూతన సచివాలయం, అసెంబ్లీని కట్టే బదులు ఆ నిధులను పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు, స్కూల్ భవనాలకు వాడాలన్నారు. టీటీడీపీ అధ్యక్షుడు ఎల్. రమణ మాట్లాడుతూ దేశంలోకెల్లా సచివాలయానికి రాని ఏకైక సీఎం కేసీఆరేనని ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ సచివాలయానికి రాని కేసీఆర్‌కు నూతన సచివాలయం ఎందుకన్నారు. వాస్తు దోషం ఉంటే మార్పులు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని పురాతన కట్టడాల అస్తిత్వాన్ని కాపాడుకోవాలని టీజేఎస్ అధ్యక్షుడు కొదండరాం పేర్కొనగా కేసీఆర్ తుగ్లక్‌లా వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపీ వివేక్ దుయ్యబట్టారు. నూతన సచివాలయం, అసెంబ్లీ నిర్మాణాలను పార్టీలన్నీ వ్యతిరేకిస్తున్నా కేసీఆర్ పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి విమర్శించారు.

## ఐక్య ఉద్యమాలకు దళితులు సిద్ధం కావాలి

### మాలమహానాడు అధ్యక్షుడు చెన్నయ్య



హైదరాబాద్: త్వరలో ఎస్సీ వర్గీకరణ కార్యరూపం దాల్చబోతోందని, దీనికి ప్రత్యక్షంగా బీజేపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొనడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర దాగుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆరోపించారు. ఆదివారం మాల మహానాడు రాష్ట్ర సభ్యుల సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ అగ్రవర్గాల నేతల ఎత్తుగడలో దళితులను విభజించి, పాలించి రాజ్యాధికారాన్ని దళితులకు దూరం చేయాలనే కుట్రదాగుందని పేర్కొన్నారు.ఈ కుట్రలో దళితులు పడకుండా తమ హక్కుల సాధనకోసం ఐక్య ఉద్యమాలకు నడుం కట్టాలని కోరారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక వర్గ ప్రజలకు మద్దతు ఇవ్వకుండా దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని హుందాగా వ్యవహరించాలని కోరారు. కాలం చెల్లిన, అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను పక్కన బెట్టి ఎస్సీ రిజర్వేషన్లు ఇతరత్రా సమస్యలపై ఐక్య ఉద్యమాలకు ఎంఆర్‌పీఎస్ తోడ్పాటు అందించాలని చెన్నయ్య కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మహిళా అధ్యక్షురాలు సరసాదేవి, జాతీయ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉంది

- ఈ అంశంపై ప్రధానితో స్వయంగా మాట్లాడుతా
- మాదిగల ఆత్మగౌరవ సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. వేదికపై మంద కృష్ణ, విమలక్క, జెల్లి విల్సన్ తదితరులు

నాగులుప్పలపాడు: మాదిగల చిరకాల వాంఛ అయిన ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉంటుందని, దీనిని సాధించే క్రమంలో కేంద్రస్థాయిలో తమ పనిని ప్రారంభించామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఏర్పడి 25 ఏళ్లయిన సందర్భంగా సంస్థ పురుటిగడ్డ అయిన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి లో మాదిగల ఆత్మగౌరవ జాతర సభను ఆదివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఏపీ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అధ్యక్షత వహించిన సభలో కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీలలో ఉమ్మడి రిజర్వేషన్ల వలన నష్టపోతున్న మాదిగ, ఉప కులాలకు న్యాయం చేయాలని పాతికేళ్ల కిందట ప్రారంభమైన ఉద్యమం.. ఎస్సీల వర్గీకరణ లక్ష్యం నెరవేర్చుకునేందుకు అనేక పోరాటాలు చేసిందన్నారు. కృష్ణ మాదిగ చేసిన పోరాటాల్లో చిన్న పిల్లల గుండె జబ్బుల ఉద్యమం స్ఫూర్తినిచ్చిందని.. 2 లక్షల మంది చిన్నారుల ప్రాణాలను కాపాడటంలో ఎమ్మార్పీఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ సభకు తాను ఎంపీ హోదాలోనో, కేంద్రమంత్రి హోదాలోనో రాలేదని.. కృష్ణ మాదిగతో ఉన్న ప్రత్యేక అనుబంధంవల్ల వచ్చానన్నారు. ఇప్పటికే దేశంలో బీసీల వర్గీకరణపై ప్రధాని మోదీ ఓ కమిటీ వేశారని.. అలాగే, ఎస్సీ వర్గీకరణపై తానే స్వయంగా ప్రధానితో మాట్లాడనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.

**ఆ ఆకాంక్షను నెరవేర్చాలి: మంద కృష్ణ**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. మాదిగల చిరకాల వాంఛ అయిన వర్గీకరణను కేంద్ర సహకారంతో సాధించి మాదిగల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. ఇప్పటికే ఈ ఉద్యమంలో ఎన్నో అవమానాలు, బాధలు అనుభవించామన్నారు. ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీలలో వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాహుల్‌గాంధీ అనేక సందర్భాల్లో తెలిపారన్నారు. మాల మహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. ఎస్సీల వర్గీకరణకు మాల మహానాడు పూర్తి మద్దతు ఉందన్నారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కుమారుడు హర్ష, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మాదిగాని గురునాథం, అరుణోదయ సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, సీపీఐ నేత జెల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో త్వరలో రాజకీయ ప్రకంపనలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- విజయవాడలో బీజేపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం
- దుర్గమ్మ దర్శనం.. తెలుగు రాష్ట్రాలు బాగుండాలని ప్రార్థన

సాక్షి, అమరావతి బ్యూరో/అమరావతి/విజయవాడ/ఇంద్రకీలాద్రి: రానున్న రెండేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎవరూ ఊహించని రాజకీయ ప్రకంపనలు చోటుచేసుకుంటాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం విజయవాడలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం పార్టీ అభిమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధ్యక్షుడు ఎవరో చెప్పలేని స్థితిలో ఉందని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఫ్రంట్ ఫ్రంట్ అంటూ తిరిగిన 40 ఏళ్ల అనుభవం ఉన్న వ్యక్తి టెంటే ఊడిపోయిందని పరోక్షంగా చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏపీలో మాజీ సీఎం కుమారుడు, తెలంగాణలో సీఎం కుమార్తె ఓటమి చెందారన్నారు. ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. అంతకుముందు కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణ భారతి ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభకు పురస్కారం కార్యక్రమంలో పాల్గొన్న కిషన్‌రెడ్డి... వచ్చే ఐదేళ్లలో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని, దేశంలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, ఈ కార్యక్రమం సందర్భంగా కిషన్‌రెడ్డితో గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ భేటీ అయ్యారు. గత కొంత కాలంగా ఆయన బీజేపీలోకి వెళ్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గంటపాటు ఈ భేటీ జరగడం గమనార్హం. మరోవైపు విజయవాడలో దుర్గమ్మను దర్శించుకున్న కిషన్‌రెడ్డి... తెలుగు రాష్ట్రాలు దేశంలో అగ్రరాష్ట్రాలుగా సమన్వయంతో ముందుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఆటంకాలు ఉండకూడదని అమ్మవారిని కోరుకున్నట్లు మీడియాకు తెలిపారు.

# కేంద్రానిది సవతి తల్లి ప్రేమ

- బడ్జెట్‌పై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడం శోచనీయం
- టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపించినా రాష్ట్రంలోని ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడం శోచనీయమని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపినా తెలంగాణ ప్రతిపక్ష నేతలు నోరు మెదపడం లేదని, కేంద్రం వివక్షపై గొంతెత్తింది తమ పార్టీ మాత్రమేనని అన్నారు. నలుగురు బీజేపీ ఎంపీలు రాష్ట్రం నుంచి ఉన్నా బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని అమిత్ షా దృష్టికి తీసుకెళ్లలేకపోయారని విమర్శించారు. తెలంగాణ ప్రతిష్టాత్మక పథకాలు, ప్రాజెక్టులకు ఒక్క పైసా కేటాయించకున్నా నోరు మెదపని నేతలు రౌండ్ టేబుల్ సమావేశం పేరిట కొత్త అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాలను వ్యతిరేకించడమేంటని విస్మయం వ్యక్తం చేశారు. తమ పార్టీలో ఉండి బయటకెళ్లిన ఓ నేత తిన్నింటి వాసాలు లెక్క పెడుతున్నారంటూ పరోక్షంగా మాజీ ఎంపీ వివేక్‌ను ఉద్దేశించి విమర్శించారు.

**అవసరాలు తీర్చేందుకే..**

వందేళ్లకు సరిపడా అవసరాలు తీర్చేందుకే సీఎం కేసీఆర్ కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలను ప్రతిపాదించారని పేర్కొన్నారు. అసెంబ్లీ కూడా కూలగొడతారని కొందరు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఇప్పుడున్న పార్లమెంటు స్థానంలో కొత్తది కట్టాలని అప్పటి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రతిపాదించారని గుర్తు చేశారు. గుజరాత్ అసెంబ్లీ భవనాన్ని కూడా ఫిబ్రవరి 2018లో రూ.131 కోట్లతో ఆధునీకరించారని తెలిపారు. గుజరాత్ అసెంబ్లీ విషయంలో మాట్లాడని బీజేపీ నేతలు తెలంగాణ అసెంబ్లీ విషయంలో మాట్లాడటం రెండు నాల్కల ధోరణి కాదా? అని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి కాబట్టే.. ఇప్పుడు బడ్జెట్‌పై ఇద్దరూ కిమ్మనకుండా ఉన్నారన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్‌ఎస్ నేతలెవరూ బీజేపీతో టచ్‌లో లేరని, అమిత్‌షా పర్యటనలో ఎవరూ చేరకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

# టీఆర్‌ఎస్ నేతలకు ఇక కాళరాత్రులే

- రాష్ట్రంలో ప్రతి నెలా అమిత్‌షా పర్యటన
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా కేటీఆర్ ట్వీట్లు
- కేటీఆర్ ట్వీట్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ కౌంటర్



మీడియాతో మాట్లాడుతున్న కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ప్రతినెలా రాష్ట్రంలో పర్యటిస్తారని, దీంతో టీఆర్‌ఎస్ నాయకులు నిద్రలేని రాత్రుల్ని గడపాల్సి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. తాజాగా అమిత్ షా హైదరాబాద్ పర్యటన, పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభంతో టీఆర్‌ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. మిషన్ భగీరథను చూసే కేంద్ర ప్రభుత్వం జల పథకాన్ని ప్రవేశపెట్టిందని చేసిన కేటీఆర్ ట్వీట్‌పై ఆయన మండిపడ్డారు. గుజరాత్ వాటర్ గ్రిడ్ కార్యక్రమాన్ని కేటీఆర్ మంత్రి హోదాలో 2014 అక్టోబరు 18, 19 తేదీల్లో అక్కడకు వెళ్లి అధ్యయనం చేసింది వాస్తవం అవునో కాదో చెప్పాలన్నారు. గుజరాత్‌లో చూసే మిషన్ భగీరథను కాపీ కొట్టింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కేటీఆర్ ట్వీట్లు చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అన్ని అనుమతులిచ్చింది కేంద్రమేనని, ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా కావాలని టీఆర్‌ఎస్ ఏ రోజు కేంద్రాన్ని అడగలేదని, ఈ విషయాన్ని స్వయంగా నాటి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి పార్లమెంట్‌లోనే వెల్లడించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా రావాలని టీఆర్‌ఎస్‌కే లేదని, అదే లభిస్తే కమీషన్లు దండుకోవడానికి తెలంగాణ ప్రభుత్వానికి అవకాశం ఉండదని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించి ప్రజలను పక్కదారి పట్టించాలని కేటీఆర్ అనుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎందుకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

**ప్రజల తరఫున ఉద్యమం**

ప్రజల పక్షాన ప్రభుత్వంపై ఉద్యమిస్తామని లక్ష్మణ్ స్పష్టం చేశారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి చేరేలా చర్యలు చేపడతామన్నారు. బీజేపీ ఐదు బృందాలుగా ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తుందన్నారు. ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భారీగా దోపిడీ చేస్తోందని ఆరోపించారు. సెక్షన్ 8 ద్వారా సచివాలయాన్ని కూల్చివేతను, అసెంబ్లీ తరలింపును అడ్డుకోవాలని గవర్నర్‌కు, కేంద్రానికి ఫిర్యాదు చేస్తామన్నారు. 2023లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 18 లక్షలు అదనంగా సభ్యత్వం చేయించాలని సూచించారు. ప్రతి నెల ఒకరిద్దరు మంత్రులు కూడా రాష్ట్రంలో పర్యటిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, అధికార ప్రతినిధి సుభాష్, మీడియా కన్వీనర్ సుధాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర సాయంతోనే అనుసంధానం

**కృష్ణాకు గోదావరి నీళ్లపై నిపుణుల అభిప్రాయం**

- రిటైర్డ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- రాష్ట్ర బేసిన్ అవసరాలు తీరాకే తరలించాలని కొందరి సూచన




ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశంలో అభిప్రాయాలు పంచుకుంటున్న ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ప్రతిపాదించిన నదుల అనుసంధానంలో భాగంగానే, వారి సహకారంతోనే గోదావరి నీటిని కృష్ణాకు తరలించే ప్రక్రియను చేపట్టాలని రిటైర్డ్ ఇంజనీర్లు అభిప్రాయపడ్డారు. ఈ అనుసంధాన ప్రక్రియను జాతీయ ప్రాజెక్టుగా చేపడితేనే రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. బేసిన్‌లోని అవసరాలు, రాష్ట్ర అవసరాలు పూర్తిగా తీరాకే గోదావరి నీటిని ఇతర రాష్ట్రాలకు తరలించాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇంజనీర్స్ భవన్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ఇంజనీర్లు, రిటైర్డు ఇంజనీర్లు పాల్గొని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ అభిప్రాయాల ఆధారంగా తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ విభాగం ఒక నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సూచనలు చేస్తుందని సంస్థ చైర్మన్ డాక్టర్ రామేశ్వర్‌రావు తెలిపారు.

**జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలి**

రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, మాజీ ఎమ్మెల్యే సానా మారుతి మాట్లాడుతూ ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ట్రానికి నీటి తరలింపు ఎన్నో సంక్లిష్ట వ్యవహారాలతో ముడిపడి ఉందన్నారు. నేడు ఉన్న వరదజలాలు భవిష్యత్తులో ఉంటాయన్న గ్యారెంటీ ఉంటుందా.. ఒకవేళ వరద గణనీయంగా తగ్గితే ఈ ప్రాజెక్టులు, అనుసంధానం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. భవిష్యత్తులో రాష్ట్ర అవసరాలను కూడా అంచనా వేసి అంతకు మించి ఉన్న నీటినే తరలించాలని సూచించారు. రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వరదజలాల తరలింపుపై అధ్యయనం చేశామని, ఇందులో 450 కిలోమీటర్ల మేర నీటిని రివర్స్‌లో తీసుకురావాల్సి ఉంటుందని, ఇందులో 150 కిలోమీటర్ల మేర సొరంగాలు తవ్వాల్సి ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య జరిగే ఒప్పందం ఎల్లకాలం నిలిచేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. శ్రీశైలం నుంచి జూరాల ఆయకట్టు స్థిరీకరణ గురించి సైతం ఆలోచించాలన్నారు. మరోవైపు ఆల్మట్టి ఎత్తు పెంపు తర్వాత పరిణామాల్లో కృష్ణా జలాల వినియోగాన్ని శ్రీశైలం కూడా పరిమితం చేసే అవకాశం ఉందని శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకంతటా గోదావరి నీటిని వినియోగించుకునే సౌలభ్యం ఉందన్నారు. పోలవరం నుంచి రెండు టీఎంసీల నీటిని నాగార్జునసాగర్‌కు తీసుకురావడం సులభంగా ఉంటుందని, ఇదే విధంగా తెలంగాణ నుంచి శ్రీశైలం వరకు రెండు టీఎంసీలను తీసుకువెళ్లవచ్చని వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్రం ప్రతిపాదించిన నదుల అనుసంధానంలో భాగంగా చేపట్టి, కావేరికి 57 టీఎంసీల నీరివ్వడానికి అంగీకరిస్తూనే, జాతీయ ప్రాజెక్టుగా చేపడితే బాగుంటుందని ఎస్‌పి రెడ్డి ప్రతిపాదించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఓఎస్‌డీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటిని కూడా వినియోగించుకున్నాక, పక్కరాష్ట్రానికి తరలించాలన్నారు. పోలవరం నుంచి శ్రీశైలం వరకు జాతీయ ప్రాజెక్టుగా చేపడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వరకు గోదావరి నీటిని తీసుకెళితే శ్రీశైలం, జూరాలతోసహా ఎటువైపైనా తరలించే సౌలభ్యం ఉంటుందని తెలిపారు. మాజీ చీఫ్ ఇంజనీర్ అనంతరాములు మాట్లాడుతూ బేసిన్ అవసరాలు తీరాక, మిగులు జలాలు ఉంటే పక్క బేసిన్‌కు తరలించాలని అన్నారు. వరదజలాలు, వరద వచ్చే రోజులను శాస్త్రీయంగా అంచనా వేయాలని సూచించారు. నదీ జలాల వినియోగంపై ఒప్పందాన్ని పటిష్టంగా తయారు చేయాలని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ రోజు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమన్వయం, స్నేహం, ఇచ్చిపుచ్చుకునే ధోరణి రేపు ఉంటుందా అని ఆలోచించాలన్నారు. రమణనాయక్ మాట్లాడుతూ కేంద్రం ప్రాజెక్టుగా నిర్మిస్తే రాష్ట్రంపై ఆర్థిక భారం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. రిటైర్డ్ ఈఈ వెంకటరమణ మాట్లాడుతూ గోదావరి నదీ జలాల ఒప్పందంపై తొలుత ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎంలు ఒప్పందం చేసుకుని 954 టీఎంసీలకు చట్టబద్ధత కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఈఎన్‌సీ నరేందర్‌రెడ్డి, ఇంజనీర్ల జేఏసీ కార్యదర్శి విజయ్‌కుమార్, రిటైర్డ్ ఎస్ఈలు రామలింగారెడ్డి, దామోదర్‌రెడ్డి, ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

SAKSHI
MEDIA GROUP
www.sakshi.com

# సాక్షి సెలబ్రేషన్ ఆఫర్

## కో అంటే కోటి....బహుమతులు



Activa scooter MRP: 65,000/- | Maruti Suzuki Swift MRP: 5,50,000/- | Washing Machine MRP: 17,500/- | 1.5 Ton 3 Star Inverter Split AC MRP: 40,000/- | Refrigerator MRP: 15,000/- | Maruti Suzuki Swift MRP: 5,50,000/- | Activa scooter MRP: 65,000/-

**అర కేజీ బంగారం, 2 కార్లు, 10 బైకులు, 15 ఏసీలు, 15 వాషింగ్ మెషీన్లు, 30 రిఫ్రిజిరేటర్లు ఇంకా భలే భలే బహుమతులు అన్నీ మీకోసమే.**

**బహుమతుల్ని గెలవడానికి – చదువుతూనే ఉండండి సాక్షి, కొత్తగా చందాదారులవ్వడానికి ఏజెంట్, హాకర్, పేపర్ బాయ్ ని సంప్రదించండి లేదా కాల్ చేయండి 1800-270-1083**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| మీ కూపన్ ని ఈ ఫార్మాట్ పై అతికించండి. | సాక్షి సెలబ్రేషన్ ఆఫర్ | 1 కూపన్ | 2 కూపన్ | 3 కూపన్ | 4 కూపన్ | 5 కూపన్ | 6 కూపన్ | 7 కూపన్ |
| 8 కూపన్ | 9 కూపన్ | 10 కూపన్ | 11 కూపన్ | 12 కూపన్ | 13 కూపన్ | 14 కూపన్ | 15 కూపన్ | 16 కూపన్ |
| 17 కూపన్ | 18 కూపన్ | 19 కూపన్ | 20 కూపన్ | 21 కూపన్ | 22 కూపన్ | 23 కూపన్ | 24 కూపన్ | 25 కూపన్ |
| 26 కూపన్ | 27 కూపన్ | 28 కూపన్ | 29 కూపన్ | 30 కూపన్ | 31 కూపన్ | 32 కూపన్ | 33 కూపన్ | 34 కూపన్ |
| 35 కూపన్ | 36 కూపన్ | 37 కూపన్ | 38 కూపన్ | 39 కూపన్ | 40 కూపన్ | 41 కూపన్ | 42 కూపన్ | 43 కూపన్ |
| 44 కూపన్ | 45 కూపన్ | 1 మాస్టర్ కూపన్ | 2 మాస్టర్ కూపన్ | 3 మాస్టర్ కూపన్ | 4 మాస్టర్ కూపన్ | 5 మాస్టర్ కూపన్ | పేరు............ అడ్రస్............ పట్టణం............ రాష్ట్రం............ మొబైల్............ | |

**ఈ విధంగా పాల్గొనండి** • లక్షల బహుమతులు గెలిచి పెట్టే కూపన్ల ఫార్మాట్ ను కత్తిరించి మీ దగ్గర భద్రంగా దాచుకోండి. • 10 జూలై - 11 అక్టోబర్ వరకు 60 స్టాండర్డ్ కూపన్లు మరియు 10 మాస్టర్ కూపన్లు సాక్షి పత్రికలో ప్రచురించబడును. • ఇందులో నుండి పాఠకులు కేవలం 45 స్టాండర్డ్ కూపన్లను మరియు 5 మాస్టర్ కూపన్లను తీసి భద్రంగా దాచిన కూపన్ల ఫార్మాట్ లో అతికించాలి. • కూపన్ల ఫార్మాట్ లో మొత్తంగా 50 కూపన్లు అతికించాలి, అందులో ఏ ఒక్కటీ రిపీట్ అవ్వకూడదు మరియు కూపన్లను ఫోటో కాపీ చేసి అతికించరాదు. • అతికించిన కూపన్ల ఫార్మాట్ ను దగ్గరలోని సాక్షి కార్యాలయంలో కానీ సాక్షి పేపర్ అందించే ఏజెన్సీలో గానీ సమర్పించాలి. • కూపన్ల ఫార్మాట్ ను సమర్పించాల్సిన చివరి తేదీని సాక్షి పత్రికలోనే చూడగలరు. • విజేతలను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయబడును.



నల్లగొండ | సోమవారం
జూలై | 8 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు. ఆషాఢమాసం. తిథి శు.షష్ఠి ఉ.11.43 వరకు, తదుపరి సప్తమి. నక్షత్రం ఉత్తర రా.11.01 వరకు, తదుపరి హస్త. వర్జ్యం ఉ.7.20 నుంచి 8.50 వరకు. దుర్ముహూర్తం ప.12.27 నుంచి 1.19 వరకు, తదుపరి ప.3.04 నుంచి 3.55 వరకు. అమృత ఘడియలు సా.4.20 నుంచి 5.54 వరకు

సూర్యోదయం : 5.34 సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

**నమాజ్ వేళలు**
ఫజర్ : 4.26
జొహార్ : 12.21
అసర్ : 4.57
మగ్రీబ్ : 6.55
ఇషా : 8.16

## ఈవారం పుస్తకాలు

**నూనెసుక్క**
(ఇంకిన్ని కథలు)



రచన: కొట్టం రామకృష్ణారెడ్డి; పేజీలు: 144; వెల: 120; ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 33–22–2, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ–4; రచయిత ఫోన్: 9246565824

**స్మృతి చప్పుడు**
(కవిత్వం)



రచన: పరుచూరి కృష్ణప్రసాద్; పేజీలు: 112; వెల: 120; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలతోపాటు కవి ఫోన్: 7382349119

**సమరకవి సమయం**
(అజ్ఞాత కవిత్వ విశ్లేషణ)



రచన: వరవరరావు; పేజీలు: 190; వెల: 150; ప్రచురణ: విరసం; ప్రతులకు: డి.వి. రామకృష్ణారావు, ఎంఐజి–14, ఎపిఐఐసి కాలనీ, మౌలాలి, హైదరాబాద్–40. ఫోన్: 9989189250

**మీల్స్ టికెట్**
(కథలు)



రచన: డాక్టర్ ప్రభాకర్ జైని; పేజీలు: 186; వెల: 200; ప్రచురణ: జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్; ప్రతులకు: రచయిత, ఫ్లాట్ నం. 111, సి బ్లాక్, విష్ణు రెసిడెన్సీ, గాంధీనగర్, హైదరాబాద్–80. ఫోన్: 7989825420

**ఆర్.విద్యాసాగర్‌రావు జలవిజ్ఞాన నిధి**



సంపాదకులు: జూలూరు గౌరీ శంకర్, శ్రీధర్‌రావు దేశ్‌పాండే; పేజీలు: 110; వెల: 100; ప్రచురణ: అడుగు జాడలు పబ్లికేషన్స్, ఎం.ఎస్.కె. టవర్స్, ఫోర్త్ ఫ్లోర్, ఫ్లాట్ నం. 410, రోడ్ నం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్.

## అమ్మో ప్రపంచం

నా దగ్గర తీసుకున్న హండ్రెడ్ రూపీస్ ఎగ్గొట్టాలంటే ఏమైనా చెప్పు కానీ, కాకమ్మ కథలు మాత్రం చెప్పకు. అసలే మా మమ్మీ డాడీ ఇద్దరూ కూడా అకాడమీ అవార్డ్ రేంజ్ రచయితలు!



కథాసారం

# ఉత్తరమే దీపం



**వా**ళ్లిద్దరినీ చిదివి దీపం పెట్టవచ్చు. అంతముద్దు వస్తున్నారు. తలంటు పోసుకుని కొత్త చొక్కాలు తొడుక్కున్నారు.

''నేనే– నేనే'' ఏదో తమ్ముడు చెప్పబోతున్నాడు.

''ఊ''

''ఊ అంటే కాదే. వినవే–''

''వింటున్నాగా చెప్పు.''

''తలెత్తి వినాలి''

అక్క నవ్వింది. పెద్దాడబడుచు తను ఆ యింటికి. తనకు కోపం రారాదు. అమ్మ చెప్పింది ఆ మాట. అప్పటినుంచీ 'జానకి'కి కోపం రాదు. కోపం వచ్చినా నవ్వేస్తుంది.

''తలెత్తాను చెప్పు''

''మనం మామయ్యగారింటికి వెళ్దామే''

''దీనికేనా యింత చేశావ్?'' నవ్వింది జానకి.

తమ్ముడికి కోపం వచ్చింది. తమ్ముడు ఎలాగైనా మగబిడ్డ. మగబిడ్డలు కోపాన్నీ ప్రేమనూ అణుచుకోలేరు. 'నే చెప్పను ఫో' అన్నాడు.

''మానాన్నే– చెప్పమ్మా. అల్లాగే వెళదాంలే,'' అంది జానకి. తమ్ముడి బుగ్గలు పట్టుకు నిమిరింది. అంత కోపం వచ్చిన తమ్ముడూ ఫక్కున నవ్వాడు.

''ఉత్తరమండోయ్'' అంటూ పోస్టు జవాను వచ్చాడు. జానకి ఉత్తరం పుచ్చుకుంది. 'నాన్నగారికి నేనే యిస్తా. ఉత్తరమండోయ్ అంటా. నాన్న నవ్వుతాడు' అనుకుంది.

పక్కయింటి పిల్లవాడు టపాకాయలు కాల్చడం మొదలెట్టాడు. జానకి నేరుగా తల్లి దగ్గిరికి వచ్చింది.

''ఏం అమ్మా ఇల్లా వచ్చావు'' అంది తల్లి. తల్లికి జానకి అంటే ఎంతో ఆపేక్ష.

''టపాకాయలు ఇవ్వవూ'' అంది జానకి.

యింట్లో టపాకాయలు లేవు. దీపావళికి కొన్నవన్నీ జానకీ, తమ్ముడూ కాల్చేశారు. యివాళ అమ్మాయి పుట్టినరోజు. వచ్చేప్పుడు కాసిని పువ్వొత్తులూ టపాకాయలూ తెండని చెప్పింది భర్తతో.

''వచ్చేప్పుడు తెస్తాలే'' అని వెళ్లాడు ఆయన, ఆఫీసుకు పోతూ.

''అమ్మా, అమ్మా'' అంటూ వచ్చాడు బాబు. ''టపాకాయలేవీ'' అన్నాడు.

తల్లి క్షణం ఊరుకుంది. బాబు దుడుకువాడు. జానకిలాగా చెప్తే వినడు.

''అప్పచ్చులా?'' అంది తల్లి.

''కావే. టపాకాయలే. ఏవీ?'' అన్నాడు బాబు.

''సాయంత్రం కాందే.''

''సాయంత్రం కావాలేమిటీ?''

''చీకటి పడవద్దూ, కాల్చుకోడానికి?''

''అన్నీ అబద్ధాలే–''

''కావమ్మా. అక్కయ్య పుట్టినరోజు కదా యివాళ అబద్ధాలు చెప్తామ్మా?''

''వాళ్లబ్బాయి కాల్చడంలా మరీ?'' అన్నాడు బాబు.

''అమ్మా, అమ్మా, ఉత్తరం వచ్చిందే–'' అంది జానకి.

''ఇలాతే. చూస్తా,'' అంది తల్లి.

''ఊహూ. నీకివ్వను. నాన్నగారేమన్నారు? ఇంకోళ్ల ఉత్తరాలు చూడకూడదనలా?'' అంది జానకి.

''మా అమ్మే'' అని కూతుర్ని ఎత్తుకుని ముద్దెట్టుకుంది తల్లి. జేబులోంచి ఎక్కడ ఉత్తరం లాగుతుందో అని జాగ్రత్తగా జేబు దగ్గర చెయ్యి పెట్టుకుంది జానకి.

''నన్నెత్తుకోమరి'' అన్నాడు బాబు.

తల్లి జానకిని దించింది. యింతలో పక్కయింట్లో టపాకాయల మోత బాగా వినబడటం మొదలెట్టింది. బాబు బిక్కమొహం వేశాడు. తల్లికి ఇదయింది. ''నాన్నా, పరమాన్నం తిందాం...'' అంది.

''టపాకాయలు'' అన్నాడు బాబు.

''నాన్నగారు వచ్చాక, అక్కయ్యా, నువ్వూ కొనుక్కుందురు గాని'' అంది.

''మామయ్యో''

హఠాత్తుగా మామయ్య ఏమిటో అర్థం కాలేదు ఆమెకు. మామయ్యగారింటికి పోదాం అంటూ తమ్ముడు అన్నమాటను జానకి తల్లికి చెప్పింది.

''వెళ్దాంలే అమ్మా, వెళ్దాంలే'' అంది తల్లి.

''మామయ్య, మామయ్య'' అంటూ బాబు కిందికి దిగాడు.

టపాకాయల మాట కాస్త మరిచిపోయాడుగదా అని తల్లి సంతోషించింది. పిల్లలిద్దర్నీ పడమటింట్లోకి తీసుకుపోయింది. పరమాన్నం పెట్టింది.

సాయంత్రం అయింది. వీధిలో దీపాలు వెలిగించారు.

''నాన్న రాలా?'' అడిగాడు బాబు. యింతసేపూ ఆగాడు. ఇక ఆగడు. పనిమనిషి చేత కొద్దిగా టపాకాయలూ అవీ తెప్పించింది.

''ఎప్పుడొస్తాడే నాన్న'' అంటూ మళ్లీ వచ్చాడు బాబు.

> **''మా అమ్మే'' అని కూతుర్ని ఎత్తుకుని ముద్దెట్టుకుంది తల్లి. జేబులోంచి ఎక్కడ ఉత్తరం లాగుతుందో అని జాగ్రత్తగా జేబు దగ్గర చెయ్యి పెట్టుకుంది జానకి.**

తల్లి ఆకాశదీపం వెలిగిస్తోంది. ''దణ్ణంపెట్టు బాబూ.''

ఇంతట్లో జానకి చక్కా వచ్చింది.

అందరూ దణ్ణం పెట్టాక, దీపాన్ని తాటికి కట్టి ఆకాశానికి ఎత్తింది. దీపారాధన కాంగానే జానకి, తనలో తాననుకున్నట్లు 'నాన్నా రాలా' అంది.

తల్లి నెమ్మదిగా దీపాలు వెలిగించింది. ఒక్కొక్కటీ వీధి వాకిలి దగ్గర గూళ్లల్లో పెట్టింది.

ఆయన యింకా యింటికి రాలేదు.

''టపాకాయలు కాల్చుకోరూ'' అంది.

టపాకాయలు టపాకాయలు అంటూ బాబు గబగబా వస్తూ పడ్డాడు. దెబ్బ తగల్లేదు. వీపు రాచింది. నేలను కొట్టింది. బాబు ఏడుపు మానాడు.

తెప్పించిన టపాకాయలు కాసినీ యిద్దరికీ యిచ్చింది. తనుగూడా గుమ్మంలో నుంచుంది. ఐపోయినై.

''ఇంకా కాసిని'' అన్నాడు బాబు.

''పోనీ, నావి తీసుకోరా'' అంది జానకి. జానకి పెద్దాడబడుచు. పెద్దాడబడుచు అంటే తల్లి అంత.

''తే'' అని, అవీ కాల్చేశాడు.

''అన్నాలు తినరూ''అంది ఆమె.

''పువ్వొత్తులు కావాలి'' అన్నాడు బాబు. జానకి తమ్ముణ్ణి సముదాయించింది.

పిల్లలు అన్నాలు తిన్నారు. ఆయన యింకా రాలేదు.

పిల్లలకు నిద్దరవొస్తోంది. జోగుతున్నారు. ''ఇంతాలిస్యం చేశారేమి చెప్మా'' అనుకుందామె. ''అక్కడికీ వెళ్లేప్పుడు చెప్పాను గూడానూ'' అనుకుంది మళ్లీ. వీధిలోకి చూసింది. రావడం లేదు.

''ఎప్పుడొస్తారో ఏమో'' అనుకుని పిల్లవాడి దగ్గిర పడుకుంది. నాన్నగారికి వుత్తరం యిస్తా అని నిద్ర మానుక్కూర్చున్న జానకి కూడా నిద్రపోయింది.

వీధిలో పిల్లల మోత గూడా ఆగిపోయింది. అప్పుడు వచ్చాడు ఆయన. వస్తూనే ఉస్సూరుమన్నాడు.

''పొద్దోయి వచ్చారేం?'' అంది. అతను మాట్లాడలేదు.

''సినీమాకు పోయారా?'' అంది. తనూ, పిల్లలూ రాందే ఆయన పోడని తెలుసు. ఐనా అనాలని అంది.

''అబ్బా లేదే'' అన్నాడు ఆయన. చిరు చలికాలంలో గూడా ఆయనకు గొంతిక పాడి ఆరిపోయింది అప్పుడు.

''మీరొస్తారు వస్తారని చూసి చూసి పిల్లలు యిప్పుడే పడుకున్నారు'' అంది.

''పాపం'' అన్నాడు భర్త.

''ఏం అల్లా వున్నారు?''

ఏదో జరుగుతోందని తెలుసు. యింట్లో చెప్పడం దేనికని చెప్పలేదు.

''నన్ను యివాళ పనిలోనుంచి తీసేశారు'' అన్నాడు ఆయన.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

''కాళ్లు కడుక్కోండి, భోజనం చేద్దురుగాని'' అంది.

అతడు కాళ్లు కడుక్కుంటున్నాడు. జానకి చప్పుడు విని లేచింది.

''లెక్కంతా చూచి చెక్కు ఇచ్చారు'' అన్నాడాయన.

''నీకు ఉత్తరం వచ్చింది నాన్నా'' అంటూ పక్కమీంచి లేచింది జానకి.

''మీకేదో ఉత్తరం వచ్చిందిట. తనే ఇస్తానని నాకు చూపించనన్నా లేదు అది'' అంది తల్లి.

''ఏదమ్మా'' అని తీసుకున్నాడు. దీపం దగ్గిరికి వచ్చి కవరు చింపి ఉత్తరం చదువుకున్నాడు.

''ఎక్కణ్ణుంచండీ'' అందామె.

''మీ తమ్ముడు వ్రాసేడే, ఇదిగో వినూ''

''బావకు నమస్కారాలు. అక్కయ్యను అడిగానని చెప్పండి. జానకికీ బాబుకూ నా ముద్దులు.

ఇక్కడ నీకు మంచి ఉద్యోగం చూశాను బావా. అక్కడపడి ఎన్నాళ్లని బాధపడతావు? సెలవు పెట్టి రా. ఓ వేళ సెలవు ఇవ్వకపోతే– ఆ ఉద్యోగాన్ని తన్నేసి మరిరా. అన్నీ ఆలోచించే రాస్తున్నానిది. అందరం కలిసివుందాము. ఎక్కువ జీతం గూడాను. నా మాటవిని, ఒకసారి రా బావా.''

''నేననుకుంటూనే ఉన్నా. అమ్మాయి పుట్టిన రోజు ఇది. చెడు జరగలేదీరోజున. పోతే పోయింది లెండి పాడు వుద్యోగం. రాత్రింబవళ్లూ రెక్కలు విరుచుకున్నా మెప్పు లేదు''

''మామయ్య దగ్గిరికి పోదాం నాన్నా'' అంది జానకి.

''మాతల్లే'' అని జానకిని ముద్దాడాడు తండ్రి. ''మా తల్లి వుండగా చీకటా. నేను, మా అమ్మ, మా యింటికి. శరత్ పూర్ణిమ'' అన్నాడు తండ్రి.

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి (7 సెప్టెంబర్ 1914 – 20 జూలై 1968) కథ శరత్ పూర్ణిమ సంక్షిప్త రూపం ఇది. పూర్తి సానుకూల కథ. ఘర్షణ ఉన్నప్పటికీ ముగింపు దాన్ని కొట్టేస్తుంది. 1940లో ఆకాశవాణిలో ప్రసారమైంది. జలసూత్రం, జరుక్ శాస్త్రిగా ప్రసిద్ధుడు. పేరడీలకు పెట్టింది పేరు. ఆయన కథల సంపుటి పేరు కూడా 'శరత్ పూర్ణిమ'.



జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

# స్త్రీత్వం కనబడని లోకం

కొత్త బంగారం



వుల్ఫ్‌గోంగ్ హిల్బీస్

**వు**ల్ఫ్‌గోంగ్ హిల్బీస్ రాసిన 'ద ఫిమేల్స్' జర్మన్ నవలిక– తూర్పు జర్మనీలో చిన్న పారిశ్రామిక సంఘపు నేపథ్యంతో ఉన్నది. పేరుండని కథకుడి మాటల్లో, అతను 'అపరిశుభ్రమైన, అప్రయోజకుడైన, సమాజంలో ఇమడని మధ్యవయస్కుడు'. తల్లితో కలిసుంటాడు. 'పదో తరగతి దాటని నీకు రాతలెందుకు?' అని తల్లి కోపగించుకున్నా, సాహిత్యం రాస్తాడు. స్త్రీల పట్ల పరిపక్వత చెందని కిశోర ప్రాయపు అభిప్రాయాలుంటాయి.

పుస్తకపు ప్రారంభంలో– కథకుడి నుంచి వచ్చే దుర్వాసనా, అతని చేతగానితనంవల్లా, ఒక కర్మాగారంలో నేలమాళిగలో పనికి పెడతారు. అతని తలపై నున్న ఇనుపచట్రాల్లోంచి పైన పని చేసే స్త్రీలు కనబడతారు. వారతనికి భౌతికంగా అందుబాటులో ఉండనప్పటికీ, వారిని చూడ్డానికి శతవిధాలా ప్రయత్నిస్తాడు. 'నాపైన స్థిరమైన శక్తితో, పొగ కక్కుతున్న ఆ వేడి కింద– సగం చీకట్లో, కుర్చీలో కూర్చున్నాను. నా చుట్టూతా అనేకమైన ఖాళీ బీరు సీసాలు దొర్లుతున్నాయి. స్త్రీలను చూడ్డానికి తల పైకైనాఎత్తాలి లేకపోతే కుర్చీలోనైనా నిలబడాలి.'

బస్సుల్లో యువతులను ఒక పర్యవేక్షకుడు వేధించాడని తెలిసిన కథకుడు, అతన్ని బెదిరిస్తాడు. ఉద్యోగం పోతుంది. తన జీవితం గురించీ, తప్పెక్కడ జరిగిందో ఆలోచిస్తూ, మతిభ్రమతో– 'స్త్రీలు, స్త్రీత్వపు జాడలూ కూడా ఊరినుండి మాయమైపోయాయన్న నా అనుమానాన్ని నిర్ధారించుకునేందుకు రాత్రిళ్ళు వీధివీధికీ తిరిగాను' అంటాడు. 'లైంగిక కోరికలు అస్వాభావికమైనవన్న వికలోద్వేగ వైద్యుల నియమాలను పాటిస్తూ పెరిగాను' అనే కథకుడు, స్త్రీల పట్ల ఆకర్షితుడూ అవుతాడు, వారతనికి చీదరా పుట్టిస్తారు. ప్రేమించబడాలనుకొని, మానవ సాహచర్యం కోసం తహతహలాడతాడు. తన ఆత్రుత తనను ఇతరులకి దూరం చేస్తుందేమోనని భయపడతాడు. అతని నిరాశ హెచ్చవుతుండగా, అతనంటే పాఠకులకు చిరాకు ఎక్కువవుతుంది.

ఏకభాషణతో సాగే నవలికలో–నిర్బంధ శిబిరంలో అతను గడిపిన కాలం, రచయితయే ప్రయత్నాలు, ఒక ఉద్యోగంలో నిలకడగా ఉండలేకపోవడానికి ఉండే కారణాలతో– ఒక క్రమంలేకుండా సాగుతుంది కథనం. 'ప్రభుత్వం నా చేతిలో ఉన్న ప్రతి ఉపకరణాన్నీ లాక్కుంది' అనే అతను, తన సమస్యల మూల కారణాలను వెతుకుతాడు. చివరకు బెర్లిన్ చేరుకుని, జైల్లో ఉద్యోగం చేపడతాడు. జైలు ఆవరణలో ఆడ ఖైదీలను చూసినప్పుడు, 'ఇప్పుడు స్త్రీలెక్కడ కనిపిస్తారో తెలిసింది. వారిని తిరిగి చూసి, నా హృదయంలో పదిలపరచుకున్నాను' అంటాడు.

తనపట్ల తనకు సిగ్గు, అసహ్యం ఉండే వ్యక్తి చిత్రం ఇది. సృజనాత్మకతనూ, లైంగికతనూ, కోరికలనూ అణచివేసే ప్రభుత్వం పట్ల కోపాన్ని చూపే కథ. ఆ పరిధీకృత సమాజంలో– పాత్రలు, మగతనం గురించుండే కఠినమైన నిర్వచనాలతో సతమతమవుతాయి. దీన్లో ఉన్న స్త్రీలు పశుప్రాయులు, పురుషులకన్నా మెరుగైనవారు. మగవారు మానసిక నపుంసకులు. కథనంలో భాష– ముతకగా, అసభ్యంగా ఉన్నప్పటికీ, చివరకు గుర్తింపు కోసం కథకుని శోధన– సానుభూతి కలుగజేసి, బలవంతంగానైనా సరే, చదివిస్తుంది. అధ్యాయాల విభజన కనపడదు. హిల్బీస్ 1987లో రాసిన 'డీ వీబర్' పేరుతో వచ్చిన యీ నవలికను ఇంగ్లిష్‌లోకి అనువదించినది ఈసబెల్ ఫార్గో కోల్. 136 పేజీలున్న పుస్తకాన్ని 'టూ లైన్స్ ప్రెస్' 2018లో ప్రచురించింది.

హిల్బీస్ (1941–2007) యుద్ధానంతర యుగంలో పేరు తెచ్చుకున్న జర్మన్ రచయితల్లో ఒకరు. ఆయన తరంలో చాలామందికిలాగానే హిల్బీస్‌కు కూడా తండ్రి లేకుండా పోయారు. ఆయన తూర్పు జర్మనీలో పెరుగుతున్నప్పుడు– అధికారులకు ఇబ్బందికరంగా మారడంతో, బెర్లిన్ గోడ పడగొట్టడానికి ముందే 1985లో ఆయన్ను పశ్చిమ జర్మనీకి వలసపోయేందుకు అనుమతించింది ప్రభుత్వం. జర్మన్ ప్రధాన సాహిత్య బహుమతుల్లో ఇంచుమించు అన్నిటినీ హిల్బీస్ పొందారు.

◆ కృష్ణ వేణి

గ్రేట్ రైటర్

# వోహ్‌లె షొయింకా



**ఉ**క్కుబూట్లను ఏ రంగు పాదాలు తొడుక్కుంటేనేమి అంటాడు వోహ్‌లే షొయింకా. నైజీరియాలో 1934లో జన్మించాడు. బ్రిటన్‌తో జరిగిన స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్నాడు. రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. స్వాతంత్య్రానంతరం (1960) అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలను విమర్శించడం మానలేదు. నియంత శని అబాచా మరణశిక్ష విధించడంతో దేశం నుంచి తప్పించుకుని పారిపోయాడు. మళ్లీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటైనాక ఐదేళ్ల తర్వాత స్వదేశానికి తిరిగొచ్చాడు. ధార్మిక విశ్వాసాలున్న సంప్రదాయ కుటుంబంలో జన్మించిన షొయింకా తర్వాతికాలంలో నాస్తికుడిగా మారాడు. ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. నాటక రచయితగా ప్రసిద్ధుడు. పురాణం, నృత్యం, గానం మిళితం చేసిన తత్వం, వ్యంగ్యం ఆయన నాటకాల్లో కనబడుతాయి. సుమారు ముప్పై నాటకాలు, రెండు నవలలు, మూడు కథాసంపుటాలు, ఎనిమిది కవితాసంపుటాలు, ఓ పది వ్యాస సంపుటాలు వెలువరించాడు. 1986లో నోబెల్ బహుమతి పురస్కారం పొందాడు. ఆఫ్రికా నుంచి ఈ పురస్కారం పొందిన తొలి రచయిత. షొయింకా ఇంగ్లిష్‌లో రాస్తాడు. అయితే ఆయన పుట్టిపెరిగిన యోరుబా తెగకు చెందిన భాషా వారసత్వపు పరిమళాన్ని తన ఆంగ్లభాషకు అద్దుతాడు. డెత్ అండ్ ద కింగ్స్ హార్స్‌మాన్, కోంగీస్ హార్వెస్ట్ (ఇది సినిమాగా కూడా వచ్చింది; రంగస్థల నటుడు అయిన షొయింకా ఇందులో ప్రధాన పాత్ర పోషించాడు.), అకే: ద ఇయర్స్ ఆఫ్ చైల్డ్‌హుడ్ ఆయన రచనల్లో కొన్ని. మరో ప్రసిద్ధ నైజీరియా రచయిత చీన్వా అచెబే యూనివర్సిటీ కాలేజ్‌లో షొయింకా క్లాస్‌మేట్ కావడం గమనార్హం.

ప్రతిధ్వనించే పుస్తకం

# ఉనికి సైతం ఉత్త భ్రమే



మసనోబు ఫుకుఓకా

**'నా** ఉనికి సైతం ఉత్త భ్రమే' అని తెలుసుకున్నాడు మసనోబు ఫుకుఓకా (1913–2008). 'ఈ జనన మరణ చక్రాలలో పాల్గొని, అనుభూతి పొంది, ఆనందించగలిగితే అంతకు మించి సాధించాల్సిన అవసరం లేదు' అనుకున్నాడు. తన ఆలోచనను ఆచరణలో రుజువు చేసుకోవడానికిగానూ నగరంలో చేస్తున్న ఉద్యోగం వదిలి సొంతవూరికి వెళ్లిపోయాడు. భూమిని దున్నకుండా, రసాయనిక ఎరువులు వేయకుండా ప్రకృతి వ్యవసాయాన్ని సాధన చేశాడు. ప్రకృతి దానికదే అన్నీ అమర్చి పెట్టిందని నమ్మి, దానిమీద 'గెలిచి' ఆ అమరిక చెదరగొట్టకుండా, దానితో సమన్వయంతో బతికేందుకు ప్రయత్నించాడు. 'నేను కనుగొన్న విషయం చాలా విలువైనదయినంత మాత్రాన నాకేదో ప్రత్యేక విలువ ఉన్నట్లు కాదు' అని ప్రకటించుకున్నాడు. ఆ ఆలోచనా ప్రయాణాన్ని వివరించే పుస్తకం జపనీస్ నుంచి ఇంగ్లిష్‌లోకి వన్ స్ట్రా రెవల్యూషన్‌గా 1978లో వచ్చింది. అది తెలుగులోకి గడ్డిపరకతో విప్లవంగా అనువాదమైంది.

ఆ పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువదించిన ఫుకుఓకా విద్యార్థి, సాధకుడు ల్యారీ కార్న్ ఇలా అంటారు: 'తన సిద్ధాంతం ఏ మతంపైనా ఆధారపడి లేదని ఫుకుఓకా చెపుతారు. కానీ అతని బోధనా పద్ధతిపైనా, ఉపయోగించే పదజాలంపైనా జెన్, బౌద్ధం, టావోయిజమ్‌ల ప్రభావం బాగా ఉంది. అప్పుడప్పుడు అతను చెపుతున్న దానిని మరింత బాగా వివరించటానికో, చర్చను ప్రేరేపించటానికో బైబిల్ నుంచీ, క్రైస్తవ మతం నుంచీ ఉదాహరణలు ఇస్తుంటాడు.

'వ్యక్తి ఆధ్యాత్మిక ఆరోగ్యం నుంచి ప్రకృతి సేద్యం పుట్టుకొస్తుందని ఫుకుఓకా నమ్మకం. భూమిని బాగుపరచటం, మానవ ఆత్మను ప్రక్షాళన చేయటం ఒకటేనని అతని అభిప్రాయం. ఆధ్యాత్మికంగా సంతృప్తికరమయిన జీవితానికి దారితీసే రోజువారీ పనులు ప్రపంచాన్ని సుందరంగా, అర్థవంతంగా మారుస్తాయని నిరూపించటమే అతను మనకిచ్చిన కానుక.'

దీనికే రాసిన ముందుమాటలో అమెరికా రచయిత, పర్యావరణ కార్యకర్త వెండెల్ బెర్రీ ఇలా వ్యాఖ్యానిస్తారు: 'కేవలం వ్యవసాయం గురించే ఈ పుస్తకంలో ఉంటుందనుకొనే పాఠకులు ఆహారం గురించీ, ఆరోగ్యం గురించీ, సాంస్కృతిక విలువల గురించీ, మానవ జ్ఞాన పరిమితుల గురించీ కూడా ఇందులో ఉండటం చూసి ఆశ్చర్యపోతారు. ఈ పుస్తకంలోని తత్వసిద్ధాంతాల గురించి ఆ నోటా ఈ నోటా విన్న పాఠకులు దీంట్లో వరి, శీతాకాలపు పంటలు, పండ్లు, కూరగాయలు ఎలా పండించాలో ఉండటం చూసి ఆశ్చర్యపోతారు.'

'ప్రగతి, పురోగమనం ఎందుకు సాధించాలి? సాధారణమయిన జీవితం గడుపుతూ అన్నిటినీ తేలికగా తీసుకోగలగటం కంటే మించినది మరేదయినా ఉందా?' అని ప్రశ్నించే ఫుకుఓకా తత్వం ఈ హడావుడి లోకరీతికి పూర్తి భిన్నమైనది. పూర్తిగా కావాల్సినది కూడానేమో!

పదం పలికింది - పాట నిలిచింది

# ఇరుగింటిలోన ఖేదం పొరుగింటిలో ప్రమోదం

**మా**రిపోయే జీవితానికి సరిపోయే తత్వం. 'రంగుల రాట్నం' కోసం భుజంగరాయ శర్మ పాట. సంగీతం రాజేశ్వరరావు, గోపాలం. పాడింది ఘంటసాల. 1966లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు బి.ఎన్.రెడ్డి.

**రంగులరాట్నం**

కలిమి నిలవదు లేమి మిగలదు
కలకాలం ఒక రీతి గడవదు
నవ్విన కళ్ళే చెమ్మగిల్లవా
వాడిన బ్రతుకే పచ్చగిల్లదా
ఇంతేరా ఈ జీవితం తిరిగే రంగులరాట్నము
ఏనుగుపైని నవాబు పల్లకిలోని షరాబు
గుర్రము మీది జనాబు గాడిదపైని గరీబు
నడిచే దారుల గమ్యమొక్కటే
నడిపే వానికి అందరొక్కటే
కోరిక ఒకటి జనించు తీరక ఎడద దహించు
కోరనిదేదో వచ్చు శాంతి సుఖాలను తెచ్చు
ఏది శాపమో ఏది వరమ్మో
తెలిసీ తెలియక అలమటించుటే
త్యాగమొకరిది ఫలితమొకరిది
అమ్మప్రాణమా ఇద్దరిదీ
వ్యథలూ బాధలు కష్టగాథలు
చివరికి కంచికి వెళ్ళే కథలే
ఆగదు వలపు ఆగదు వగపు
ఆరదు జీవనమాగదు
ఎవరు కులికినా ఎవరు కుమిలినా
ఆగదు కాలం ఆగదు
ఇరుగింటిలోన ఖేదం పొరుగింటిలో ప్రమోదం
రాలినపువ్వులు రెండు పూచే గుత్తులు మూడు
ఒకరి కనులలో చీకటి రేయి
ఇరువురి మనసుల వెన్నెల హాయి

# రచయిత గడియారం

సాహిత్య మరమరాలు



**రా**జమండ్రి గౌతమీ గ్రంథాలయంలోని బాబాయమ్మ హాలులో ఒక సభ జరుగుతోంది. ప్రధానంగా మాట్లాడాల్సిన వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి వంటి వారు సభలో ఉన్నారు. పిలవని పేరంటంలా ఒకాయన మాట్లాడతానని వచ్చారు. ఎనభై ఏళ్ళుంటాయి. సభాధ్యక్షులు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి కాదనలేక పోయారు. ఆ పెద్ద మనిషి సంబంధం ఉన్నవీ లేనివీ మాట్లాడేస్తున్నాడు. ప్రేక్షకుల్లో అసహనం పెరిగిపోతోంది. గట్టిగా ముఖం ముందు చెప్పలేని సాత్వికుడు మధునాపంతుల. అటూ ఇటూ చూశారు. సైగ చేసి సన్నిధానం నరసింహశర్మను పిలిచారు. చెవి దగ్గరగా వచ్చిన ఆయనతో గుసగుసగా ''కొంచెం ఆయన దగ్గరకెళ్ళి శివభారత కర్త ఇంటి పేరు జ్ఞాపకం చేసుకోమను'' అన్నారు. సన్నిధానం పెద్దాయన దగ్గరకెళ్ళి నోటికి అరచేయి అడ్డం పెట్టుకుని ఆ మాటను యథాతథంగా చెప్పారు. ఆ చమత్కార సౌందర్యం అర్థమైనట్టుంది, వెంటనే ప్రసంగం ముగించేసి నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు. శివభారతం కర్త గడియారం వెంకట శేషశాస్త్రి. కాలాన్ని గుర్తు చేయడానికి మధునాపంతుల ఉపయోగించిన చమత్కారం ఇది.

◆ దాట్ల దేవదానం రాజు

## రారండోయ్

- తెలంగాణ సాహిత్య అకాడమీ 'నవలా స్రవంతి'లో భాగంగా జూలై 12న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలులో బి.ఎన్.శాస్త్రి చారిత్రక నవల 'వాకాటక మహాదేవి'పై శ్రీరామోజు హరగోపాల్ ప్రసంగిస్తారు.
- తెలంగాణ చైతన్య సాహితి ఆవిర్భావ సభ జూలై 13న సాయంత్రం 4 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరగనుంది. మూడు వేదికలుగా జరిగే ఈ సభకు ముఖ్య అతిథి: దేశపతి శ్రీనివాస్. వక్తలు: పి.వేణుగోపాల స్వామి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి. కవి సమ్మేళనం ఉంటుంది.
- బొంత లచ్చారెడ్డి కావ్య కుసుమాలు, బాలబోధ, సులభ వ్యాకరణాల ఆవిష్కరణ జూలై 14న ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనుంది. నిర్వహణ: పాలపిట్ట బుక్స్
- కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత బెలగం భీమేశ్వరరావు అభినందనసభ జూలై 14న సాయంత్రం 6 గంటలకు విజయనగరంలోని గురజాడ గృహంలో జరగనుంది. నిర్వహణ: సహజ.
- చంద్రశేఖర్ ఇండ్ల కథల సంపుటి రంగుల చీకటి పరిచయ సభ జూలై 14న ఉదయం పదింటికి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరగనుంది.
- తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా (తెల్సా) 21వ వార్షికోత్సవ సందర్భంగా కథ, నాటక పోటీ నిర్వహిస్తోంది. కథల మూడు బహుమతులు రూ.30 వేలు, 20 వేలు, 15 వేలు. నాటకాల రెండు బహుమతులు రూ.40 వేలు, 25 వేలు. రచనలను డిజిటల్ రూపంలో జూలై 31లోగా పంపాలి. మెయిల్: telsa.competitions@gmail.com. వివరాలకు: telsaworld.org
- జాగృతి వార పత్రిక వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీ నిర్వహిస్తోంది. 1500 పదాల లోపు రాసిన కథలను ఆగస్టు 18 లోపు పంపాలి. మూడు బహుమతులు వరుసగా 12 వేలు, 7 వేలు, 5 వేలు. పత్రిక చిరునామాకు పోస్టులోగానీ jagriticometition@ gmail.comకు గానీ పంపొచ్చు. వివరాలకు: 9959997204

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

# బుజ్జగింపుల పర్వం షురూ

## రసకందాయంలో కర్ణాటకం

- అసంతృప్త ఎమ్మెల్యేలతో కాంగ్రెస్, జేడీఎస్ ముఖ్యనేతల భేటీ
- అమెరికా నుంచి బెంగళూరుకు చేరుకున్న సీఎం కుమారస్వామి
- సిద్దరామయ్యకు సీఎం పదవి ఇస్తే వెనక్కి వస్తామన్న రెబెల్స్



అమెరికా నుంచి వచ్చిన సీఎం కుమారస్వామిని బెంగళూరు ఎయిర్‌పోర్టులో కలిసిన మంత్రులు

**సాక్షి, బెంగళూరు/యశవంతపుర/న్యూఢిల్లీ/ముంబై:** కర్ణాటకం రసకందాయంలో పడింది. కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి 13 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన నేపథ్యంలో ఇరుపార్టీలకు చెందిన ముఖ్య నేతలు నష్టనివారణ చర్యలకు దిగారు. జేడీఎస్ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా సమర్పించిన నేపథ్యంలో ఆ పార్టీ అధినేత హెచ్‌డీ దేవెగౌడ ఆదివారం తన నివాసంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అలాగే బెంగళూరులోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ ముఖ్యనేతలు సమావేశమై ప్రభుత్వాన్ని కాపాడుకోవడంపై చర్చలు జరిపారు. మరోవైపు కేపీసీసీ ఇన్‌చార్జ్ కేసీ వేణుగోపాల్, మాజీ సీఎం, కాంగ్రెస్ నేత సిద్దరామయ్య, మల్లికార్జున ఖర్గే, డిప్యూటీ సీఎం పరమేశ్వర, మంత్రి డికె శివకుమార్ తదితరులు అసంతృప్తితో రగిలిపోతున్న ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఒక్కో జిల్లా మంత్రికి ఆ జిల్లాలోని అసంతృప్త ఎమ్మెల్యేలను బుజ్జగించే బాధ్యతలను అప్పగించారు. ఈ విషయమై మంత్రి శివకుమార్ మాట్లాడుతూ..'ఈ సమస్యకు ఓ పరిష్కారాన్ని కనుగొనేందుకు మేం ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వాన్ని, పార్టీని కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగాలు చేసేందుకైనా నేను సిద్ధం' అని ప్రకటించారు. దేవెగౌడతో సమావేశమైన శివకుమార్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మరోవైపు ఈ వివాదంపై కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్ కుమార్ స్పందించారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉంటుందా? లేక కూలిపోతుందా? అన్న విషయం అసెంబ్లీలోనే తేలుతుందన్నారు. కర్ణాటక అసెంబ్లీ సమావేశాలు జూలై 12న ప్రారంభం కానున్నాయి.

### సోనియాజీ.. చూస్తున్నారా?: దేవెగౌడ

కర్ణాటకలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై జేడీఎస్ అధినేత దేవెగౌడ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పార్టీని అస్తవ్యస్తం చేశారనీ, దానివల్లే ఈ దుస్థితి దాపురించిందని యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీకి ఫిర్యాదు చేశారు.'శివాజీనగర కాంగ్రెస్ ఎమ్మెల్యే రోషన్‌బేగ్‌ను సస్పెండ్ చేయడం, మరో ఎమ్మెల్యే భీమానాయక్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, ఎమ్మెల్యే బీసీ పాటిల్‌కు మంత్రి పదవి ఇస్తామని 2–3 సార్లు హామీలిచ్చి విస్మరించడం, మంత్రి డీకే శివకుమార్–మాజీ మంత్రి రమేశ్ జార్కిహోళి మధ్య గొడవలు.. ఇవన్నీ కాంగ్రెస్ నేతలు సృష్టించిన సమస్యలే' అని విమర్శించారు. మరోవైపు సిద్దరామయ్యకు సీఎం పదవి అప్పగిస్తే రాజీనామా ఉపసంహరించుకుంటామని కొందరు రెబెల్ ఎమ్మెల్యేలు ప్రకటించడం గమనార్హం. దీంతో సిద్దరామయ్య సీఎం అభ్యర్థి అయితే తాము మద్దతు ఇవ్వబోమని, సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చేస్తామని దేవెగౌడ కుండబద్ధలు కొట్టారు.

### మేం సన్యాసులం కాదు: యడ్యూరప్ప

కర్ణాటకలో రాజకీయ పరిస్థితులను సునిశితంగా పరిశీలిస్తున్నామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప తెలిపారు. రాష్ట్రంలో అధికారం చేపట్టబోం అని చెప్పడానికి తాము సన్యాసులం కాదని వ్యాఖ్యానించారు. బెంగళూరులో ఆదివారం యడ్యూరప్ప మీడియాతో మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యేల రాజీనామాపై స్పీకర్ ఓ నిర్ణయం తీసుకున్నాక ఏం చేయాలన్న విషయమై మా పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మాది జాతీయపార్టీ. కాబట్టి ప్రభుత్వ విషయంలో హైకమాండ్‌తో చర్చించాకే తుదినిర్ణయం తీసుకుంటాం. రాష్ట్రంలో అధికారం చేపట్టబోం అని చెప్పడానికి మేమేమైనా సన్యాసులమా? రాష్ట్రంలో ఎన్నికలు జరిగి 13 నెలలు మాత్రమే అయింది. ఇంతలోనే మరోసారి అసెంబ్లీ ఎన్నికలకు మేము ఒప్పుకోం. ఏదేమైనా తుది నిర్ణయం కోసం వేచిచూడండి' అని చెప్పారు. ఒకవేళ సమర్థవంతమైన పాలన అందించడంలో కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం విఫలమైతే, 105 మంది ఎమ్మెల్యేలతో తాము ఉన్నామని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల రాజీనామాలు సిద్దరామయ్య గేమ్‌ప్లాన్‌లో భాగమని బీజేపీ నేత, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ ఆరోపించారు.

### ప్రజల విశ్వాసం కోల్పోయారు: మురళీధరరావు

**సాక్షి, న్యూఢిల్లీ:** అవగాహనారాహిత్యంతోనే కాంగ్రెస్–జేడీఎస్ నేతలు బీజేపీని విమర్శిస్తున్నారని కర్ణాటక బీజేపీ ఇన్‌చార్జి మురళీధరరావు అన్నారు. 'కర్ణాటకలో కాంగ్రెస్– జేడీఎస్ ఎమ్మెల్యేల వరుస రాజీనామాల వెనుక బీజేపీ ఉందన్న ఆరోపణలను ఖండిస్తున్నాం. అసలు అధ్యక్షుడే లేని కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చక, ప్రజల విశ్వాసం కోల్పోవడం తోనే పార్టీని వీడుతున్నారు' అని ఆయన సాక్షితో అన్నారు.

## రెబెల్స్ కోసం బీజేపీ నేత విమానం..



ముంబైలోని హోటల్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న రెబెల్ ఎమ్మెల్యేలు

ప్రస్తుతం 10 మంది కాంగ్రెస్–జేడీఎస్ రెబెల్ ఎమ్మెల్యేలు ముంబైలోని ఓ హోటల్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీరు ఆదివారం హోటల్ వద్ద మీడియాతో మాట్లాడారు. తమ రాజీనామాలను ఉపసంహరించుకునేది లేదని వారు స్పష్టం చేశారు. అయితే వీరంతా బీజేపీ నేతకు చెందిన చార్టెడ్ విమానంలో బెంగళూరు నుంచి ముంబై వెళ్లినట్లు వెలుగులోకివచ్చింది. బీజేపీ రాజ్యసభ ఎంపీ రాజీవ్ చంద్రశేఖర్ జూపిటర్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు చైర్మన్‌గా ఉన్నారు. రెబెల్ ఎమ్మెల్యేలు తమ విమానంలోనే బెంగళూరు నుంచి ముంబై వెళ్లారని జూపిటర్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వర్గాలు తెలిపాయి. అయితే ఈ చార్టెడ్ విమానాన్ని ఎవరు, ఎవరికోసం అద్దెకు తీసుకున్నారు.. అనే వివరాలను చెప్పేందుకు నిరాకరించాయి. తాము చార్టెడ్ విమాన సర్వీసులను నడుపుతున్నామనీ, వాటిని ఎవరైనా బుక్ చేసుకోవచ్చని స్పష్టం చేశాయి. మరోవైపు రెబెల్ ఎమ్మెల్యేలు ముంబైలో ఉన్న విషయమై తమకు ఎలాంటి సమాచారం లేదని మహారాష్ట్ర బీజేపీ విభాగం ప్రకటించింది.

## కాంగ్రెస్ పార్టీకి సీఎం కుర్చీ!

2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఐదేళ్ల పాటు కుమారస్వామే ముఖ్యమంత్రిగా ఉంటారని కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కుమారస్వామి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలనీ, మిగిలిన మూడేళ్ల కాలానికి సీఎం కుర్చీని తమకు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా ఇరుపార్టీల నుంచి ఐదుగురు చొప్పున మంత్రులు రాజీనామాలు చేసి ఆ పదవులను రెబల్ ఎమ్మెల్యేలకు అప్పగించడం ద్వారా ఈ సంక్షోభాన్ని నివారించవచ్చని కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించినట్లు సమాచారం. సీఎం కుమారస్వామి ఆదివారం రాత్రి అమెరికా నుంచి బెంగళూరుకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో జేడీఎస్ నేతలతో ఆయన సమావేశమైన తర్వాతే కాంగ్రెస్ డిమాండ్‌పై స్పష్టత రానుంది. మరోవైపు సిద్దరామయ్యకు సన్నిహితులైన బైరతి బసవరాజ్, ఎస్టీ సోమశేఖర్, మునిరత్నలు రాజీనామా చేయడంపై ఈ మాజీ సీఎంను కాంగ్రెస్ హైకమాండ్ నిలదీసినట్లు సన్నిహితవర్గాలు తెలిపాయి. సొంతవర్గం ఎమ్మెల్యేలు పార్టీ మారుతుంటే ఏం చేస్తున్నారని సిద్దరామయ్యపై అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తనను ముఖ్యమంత్రిగా ప్రతిపాదించినట్లు వస్తున్న వార్తలను కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఖండించారు.



దేవెగౌడ



సిద్దరామయ్య



యడ్యూరప్ప

## కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం సిద్దు!

### కర్ణాటకం వెనక మాజీ సీఎం పాత్రపై అనుమానాలు

కర్ణాటక రాజకీయాలు సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. 13మంది కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు రాజీనామాతో కన్నడ డ్రామా ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం నిలబడుతుందా? లేదా? అనే అంశంపై స్పష్టత రానప్పటికీ.. కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణంలో మాత్రం లుకలుకలు బహిర్గతమయ్యాయి. మాజీ సీఎం, కాంగ్రెస్ నేత సిద్దరామయ్య కావాలనే తమ ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేస్తున్నారని.. ఆయన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సీఎంగా ఒప్పుకోమంటూ మాజీ ప్రధాని, జేడీఎస్ చీఫ్ హెచ్‌డీ దేవెగౌడ చేసిన వ్యాఖ్యలు కర్ణాటక ప్రభుత్వం ఎక్కువ రోజులు కొనసాగే అవకాశం లేదనే సంకేతాలనిచ్చాయి. అయితే మధ్యంతర ఎన్నికలు వచ్చే అవకాశం లేనప్పటికీ.. పిల్లి పోరు – పిల్లి పోరు కోతి తీర్చినట్లు.. కాంగ్రెస్–జేడీఎస్ విభేదాలను సద్వినియోగం చేసుకునేందుకు బీజేపీ కాచుకుని కూర్చొంది. తాజా పరిణామాలను ఆ పార్టీ నిశితంగా గమనిస్తోంది. అవసరమైతే రాష్ట్రపతిపాలన పెట్టయినా పరిస్థితిని తన నియంత్రణలోకి తెచ్చుకునే ప్రయత్నం కూడా చేసే అవకాశం లేకపోలేదు.

**సిద్దరామయ్యే అంతా చేస్తున్నారా?**

అయితే ఉన్నపళంగా ప్రభుత్వం పడిపోయే అవకాశాల్లేవని.. ఒక్కొక్క ఇటుక రాలిపోతున్నట్లుగా కుమారస్వామి ప్రభుత్వం మెల్లిగా కూలిపోతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంకీర్ణ సర్కారు ఏర్పాటైనప్పటినుంచీ సున్నితమైన బంధాలపైనే నడుస్తోంది. అయితే పార్లమెంటు ఎన్నికల తర్వాత నెలకొన్న పరిస్థితుల వెనక మాజీ సీఎం సిద్దరామయ్య పాత్ర ఉందని జేడీఎస్ ఆరోపిస్తోంది. రాజీనామాలు చేసిన కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలకు సిద్దు మద్దతుందని కుమారస్వామి సన్నిహితులు ఆరోపిస్తున్నారు. సిద్దు ప్రోద్బలంతోనే వీరంతా రాజీనామాలకు పాల్పడ్డారంటున్నారు. ఆయన్ను సీఎం చేస్తేనే రాజీనామాలు వెనక్కు తీసుకుంటామంటూ రెబల్ ఎమ్మెల్యేలు చెప్పడం కూడా ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. అటు కాంగ్రెస్ కూడా ఎమ్మెల్యేలను బుజ్జగించే ప్రయత్నం చేస్తూనే.. సిద్దరామయ్యను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రతిపాదించే అవకాశాలున్నాయి. అయితే దీనికి జేడీఎస్ కచ్చితంగా ఒప్పుకునే అవకాశం లేదు. అయితే.. ఇదంతా మంగళవారం సభకు రానున్న స్పీకర్.. ఈ 13 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదిస్తారా? లేదా అన్నదానిపైనే ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో సిద్దు అభ్యర్థిత్వానికే కాంగ్రెస్ జై కొడితే.. జేడీఎస్ ఏకపక్షంగా బీజేపీకి మద్దతిచ్చే అవకాశాలూ లేకపోలేదు.

**ఆపరేషన్ 'లోటస్'**

పార్లమెంటు ఎన్నికల వరకు నిశ్శబ్దంగా ఉన్న బీజేపీ తాజా పరిణామాల నేపథ్యంలో సాధ్యాసాధ్యాలపై దృష్టిసారించింది. మరింత మంది సంకీర్ణ కూటమి ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే పరిస్థితులను ప్రోత్సహిస్తే.. కమలం పార్టీ గద్దెనెక్కేందుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తోంది. ఇలా జరిగితే రాజీనామా చేసిన ఎమ్మెల్యేలకు ఫిరాయింపుల చట్టం వర్తించదు. విప్ ధిక్కరించారనే వివాదమూ ఉండదు. తద్వారా ఎలాంటి వివాదం లేకుండా బీజేపీ సర్కారు ఏర్పాటు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక్కసారి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మిగిలిన ఎమ్మెల్యేలను బీజేపీ టికెట్లపై బరిలో దింపి గెలిపించుకోవాలనే ఆలోచనలో బీజేపీ ఉందనే చర్చ జరుగుతోంది.



### ఎవరి బలమెంత?

కర్ణాటక అసెంబ్లీలో మొత్తం 224 మంది ఎమ్మెల్యేలుంటారు. ఇందులో ప్రభుత్వ ఏర్పాటుకు 113 మంది బలం ఉండాల్సిందే. ప్రస్తుత జేడీఎస్–కాంగ్రెస్ సంకీర్ణ బలం 118. ఒకవేళ ఈ 13 మంది ఎమ్మెల్యేల రాజీనామాలు ఆమోదం పొందితే కూటమి ఎమ్మెల్యేల సంఖ్య 105 (కాంగ్రెస్ 69, జేడీఎస్ 34, బీఎస్పీ 1, స్వతంత్రులు 1)కు చేరుతుంది. బీజేపీ సొంత బలం కూడా 105. రాజీనామాల ఆమోదంతో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 106 (స్పీకర్‌ను మినహాయిస్తే). ఇది బీజేపీ, సంకీర్ణ సర్కారు మధ్య నువ్వా–నేనా అనే పరిస్థితి నెలకొంటుంది. ఏకైక బీఎస్పీ ఎమ్మెల్యేను లాక్కుంటే బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుచేయవచ్చు.



నేరస్తులను హాంకాంగ్ నుంచి చైనాకు పంపే బిల్లును పక్కనబెట్టినా నిరసనలు ఆగడం లేదు. చైనా భూభాగానికి వెళ్లే రైళ్లుండే స్టేషన్‌కు ఆదివారం హాంకాంగ్ వాసులు భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. చైనా ప్రజలకు నిజాలు తెలిపేందుకే తాము అక్కడికి వచ్చామని వారు తెలిపారు. తాత్కాలికంగా పక్కనబెట్టిన బిల్లును పూర్తిగా రద్దు చేయాలని, చైనా అనుకూల నేత క్యారీ లామ్ వైదొలగాలని వారు డిమాండ్ చేశారు.

## సభా సమయాన్ని పెంచాలి: ఓం బిర్లా



**జైపూర్:** పార్లమెంట్, అసెంబ్లీల సభా సమయాన్ని పెంచాలని, అలాగే ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో ప్రశ్నలను సంధించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. తద్వారా ప్రభుత్వాల్లో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. రాజస్తాన్ అసెంబ్లీ సభ్యుల కోసం ఆదివారం ఇక్కడ ప్రారంభించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభ్యులు పార్టీలకు అతీతంగా సమస్యలను లేవనెత్తాలని, రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం చట్టసభల్లో జరిగే చర్చల్లో పాల్గొనాలని సూచించారు. సభ్యులు వెల్‌లోకి దూసుకురావడం మంచి సాంప్రదాయం కాదని, దీని వల్ల సభ వాయిదా పడటం తప్ప మరే ఉపయోగం ఉండదన్నారు. వెల్‌లోకి దూసుకొచ్చినంత మాత్రానా ఏ సభ్యుడు కూడా నాయకుడు కాలేడని, ఇదే విషయాన్ని లోక్‌సభలో స్పష్టంగా చెప్పానని తెలిపారు.

## బ్రహ్మోస్ @ 500 ప్రయోగానికి సిద్ధం

**న్యూఢిల్లీ:** దేశీయంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ క్షిపణి ఇప్పుడు 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ఈ మేరకు మెరుగుపరిచిన ఈ క్షిపణి ప్రయోగానికి సిద్ధంగా ఉందని బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవో సుధీర్ కుమార్ తెలిపారు. మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రెజిమ్ (ఎంటీసీఆర్)లో సభ్యత్వం ఉన్న భారత్‌కు ఈ క్షిపణి సామర్థ్యాన్ని మరింతగా అభివృద్ధి చేసుకునే వెసులుబాటు కూడా ఉందన్నారు. ఇప్పటికే భారత్ ప్రపంచంలోనే అతివేగంగా ప్రయాణించగలిగే సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్‌ను ప్రయోగించిందని ఆయన తెలిపారు. ఈ 'వెర్టికల్ డీప్ డైవ్ వర్షన్' క్షిపణికి సంప్రదాయ యుద్ధతంత్రాన్నే మార్చివేసే సత్తా ఉందన్నారు. దీనిని సామర్థ్యాన్ని 500 కిలోమీటర్ల మేరకు పెంచి అభివృద్ధి చేసిన మరో క్షిపణి ఇప్పుడు ప్రయోగానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## ఎస్సీల స్కాలర్‌షిప్‌కు 'ఫండ్ షేరింగ్'

**న్యూఢిల్లీ:** షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్ పథకంపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం 'నూతన ఫండ్ షేరింగ్ విధానాన్ని' ప్రతిపాదించింది. ఈ మేరకు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీకి ప్రతిపాదనను పంపింది. దీని ప్రకారం ఎస్సీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం ఆర్థిక భారాన్ని భరిస్తాయి. 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలే ఈ పథకం కింద ఎక్కువ భారాన్ని భరించాయి. నూతన విధానం ద్వారా రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని తగ్గించినట్లవుతుందని అధికారి వెల్లడించారు.

# రాజీనామా బాటలో రాహుల్ టీం

- తప్పుకున్న సింధియా, మిలింద్ దేవ్‌రా
- భవిష్యత్తుపై అనిశ్చితే కారణం
- మళ్లీ తెరపైకొస్తున్న సీనియర్లు



సింధియా



మిలింద్ దేవ్‌రా

**న్యూఢిల్లీ:** పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేయడంతో ఆయన బృందం (టీం రాహుల్) కూడా అదే బాట పడుతోంది.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోతిరాదిత్య సింధియా, ముంబై రీజనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిలింద్ దేవ్‌రాలు ఆదివారం తమ పదవులకు రాజీనామా చేశారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవ్ చాంద్ శనివారం రాజనామా చేయగా, ఏఐసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నితిన్ రాత్ అంతకు ముందే పదవి నుంచి వైదొలిగారు. యువశక్తితో పార్టీని పునరుత్తేజితం చేయాలన్న కోరితో రాహుల్ గాంధీ వీరిని ఏరి కోరి మరీ వీరికి కీలక పదవులు అప్పగించారు. రాహుల్ మార్గదర్శకత్వంలో నడిచి పార్టీకి పూర్వ వైభవం తేవాలన్న తపనతో వారు పెద్ద బాధ్యతల్ని తలకెత్తుకున్నారు. అయితే, ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవమైన పనితీరు కనబరచడం, ఎన్నికల ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాహుల్ గాంధీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో ఈ యువనేతల పని అగమ్యగోచరమయింది. అందుకే రాహుల్‌కు సంఘీభావంగా, పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ వీరు కూడా రాజీనామాలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు గిరీష్ చొదాంకర్, ఢిల్లీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేశ్ లిలోతియా కూడా పదవులకు రాజీనామా చేశారు. వీరంతా రాహుల్ బృందం సభ్యులే కావడం గమనార్హం. 'రాహుల్ ఆశయ సాధన కోసమే మేం కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు చేపట్టాం. ఇప్పుడు ఆయన తప్పుకోవడంతో చుక్కాని లేని నావలయ్యాం. పార్టీలో మా భవిష్యత్తు ఏమిటో అర్థం కాక రాజీనామా చేశాం'అన్నారు ఓ యువ నాయకుడు. రాహుల్ హయాంలో నిశ్శబ్దంగా ఉన్న సీనియర్లు ఇప్పుడు పార్టీలో కీలక పాత్ర పోషించేందుకు ముందుకొస్తున్నారు. రాహుల్ రాజీనామా విషయం, పార్టీ భవిష్యత్తుపై ఇటీవల జరిగిన చర్చల్లో అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్, మోతీలాల్ ఓరా, ఆనంద్ శర్మ,, భూపీందర్ సింగ్ హుడా వంటి తలనెరిసిన పెద్దలే పాల్గొన్నారు. ఇందులో యువ నాయకులెవరికీ అవకాశం కల్పించలేదు. కొత్త అధ్యక్షుడి ఎంపిక విషయంలో తాము జోక్యం చేసుకోబోమని రాహుల్ గాంధీ ఇప్పటికే స్పష్టం చేశారు. పార్టీ వర్కింగ్ కమిటీలో కూడా అంతా పెద్దలే ఉన్నారు. దీన్ని బట్టి పార్టీలో ముందుముందు వారిదే పైచేయిగా కనబడుతోంది. రాహుల్ బృందం రాజీనామాలకు ఇదీ ఒక కారణమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## రాంగ్ పార్కింగ్‌కు రూ. 23 వేల జరిమానా



**ముంబై:** రాంగ్ పార్కింగ్ చేస్తే భారీ జరిమానా విధించేలా బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ), ముంబై ట్రాఫిక్ పోలీసులు కలిసి కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. నో పార్కింగ్ జోన్లలో వాహనాలను పార్క్ చేస్తే రూ. 5 వేల నుంచి 23 వేల వరకూ జరిమానా విధించనున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ద్విచక్ర వాహనాలకు రూ. 5 వేల నుంచి రూ. 8,300 వరకు, నాలుగు చక్రాల వాహనాలకు రూ. 10 వేల నుంచి రూ. 23,500 వరకు జరిమానా విధిస్తారు. అలాగే మధ్య స్థాయి వాహనదారులకు రూ. 11 వేల నుంచి 17,600 వరకు, లైట్ మోటార్ వాహనాలకు రూ. 10 వేల నుంచి రూ. 15,100 వరకు, మూడు చక్రాల వాహనాలకు రూ. 8 వేల నుంచి రూ. 12,200 వరకు పెనాల్టీ పడనుంది. వాహనదారులు ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్క్ చేస్తున్నారని, దాని వల్లే ట్రాఫిక్ జామ్ అవుతోందని బీఎంసీ అధికారులు తెలిపారు. తాజా నిబంధనలతో ట్రాఫిక్ జామ్ తగ్గుతుందన్నారు. జరిమానా వెంటనే చెల్లించకపోతే, రోజురోజుకూ అది పెరుగుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసులకు తోడుగా విశ్రాంత సిబ్బందిని, ప్రైవేటు సిబ్బందిని కూడా తీసుకున్నట్లు బీఎంసీ అధికారులు తెలిపారు. పార్కింగ్ వసతి ఉన్న ప్రాంతాల్లో మొదట ఈ నిబంధనలు అమలవుతాయని తెలిపారు. ముంబైలో 30 లక్షల వాహనాలున్నట్లు ఓ అంచనా.

## దేశంలో 5.28 లక్షల పోలీసు ఉద్యోగాలు ఖాళీ

### ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 1.29 లక్షలు

**న్యూఢిల్లీ:** ఒకవైపు ఉద్యోగాలు లేక దేశంలో నిరుద్యోగులు నానా బాధలు పడుతుంటే, ప్రభుత్వాలు మాత్రం ఉన్న ఖాళీల భర్తీలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ వెల్లడించిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. దేశంలో 5.28 లక్షల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. వీటిలో దాదాపు 1.29 లక్షల ఖాళీలు ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఉన్నాయి. అన్ని రాష్ట్రాలకు మంజూరైన 23,79,728 పోలీసు ఉద్యోగాల్లో 2018 జనవరి 1 నాటికి 18,51,332 ఉద్యోగాలు మాత్రమే భర్తీ అయ్యాయని వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌కు 4,14,492 పోస్టుల మంజూరు కాగా 2,85,540 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు. బిహార్‌కు మంజూరైన 1,28,286 పోస్టుల్లో 50,291, పశ్చిమ బెంగాల్‌కు మంజూరైన 1,40,904 ఉద్యోగాల్లో 48,981 ఖాళీగా ఉన్నాయి. తెలంగాణలో 76,407 పోస్టులకు గానూ 30,345 పోస్టుల్లో నియామకాలు చేపట్టలేదు. ఆంధ్రప్రదేశ్‌కు 72,176 పోస్టులు మంజూరు కాగా 17,933 ఖాళీగా ఉన్నాయి. దేశంలో ఒక్క నాగాలాండ్ రాష్ట్రంలోనే మంజూరైన పోస్టుల కంటే ఎక్కువ మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ రాష్ట్రానికి మంజూరు చేసిన 21,292 పోస్టుల కంటే అదనంగా 941 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. నియామక ప్రక్రియలు నత్తనడకన సాగడం, ఉద్యోగుల పదవీ విరమణ, ఆకస్మిక మరణాలు వంటి కారణాల వల్ల అధిక సంఖ్యలో పోస్టులు ఖాళీ అవుతున్నాయని సీనియర్ అధికారులు పేర్కొంటున్నారు.



# బాలాకోట్ నుంచి బిచాణా ఎత్తేశారు!

### పాక్-అఫ్గాన్ సరిహద్దులకు తరలిన ఉగ్ర శిక్షణ శిబిరాలు

- భారత దౌత్య కార్యాలయాలకు పొంచి ఉన్న ముప్పు
- నిఘా విభాగాలు అప్రమత్తం

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌లో ఉగ్రవాద సంస్థలు ప్రస్తుతం అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లోకి మకాం మార్చాయి. పాక్‌లోని బాలాకోట్ ఉగ్ర శిక్షణ శిబిరంపై ఫిబ్రవరిలో భారత వైమానిక దళం దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఈ దాడుల అనంతరం ఉగ్రసంస్థలు తమ మకాంను అఫ్గానిస్తాన్‌లోకి మార్చేశాయి. జైషే మొహమ్మద్, లష్కరే తోయిబా సంస్థలు కునార్, నంగర్‌హార్, నూరిస్తాన్, కాందహార్‌లలో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశాయి. దీంతో భారత నిఘా వర్గాలు కాబూల్, కాందహార్‌లలో ఉన్న దౌత్య కార్యాలయాలను అప్రమత్తం చేశాయి. అఫ్గాన్ తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌తో చేతులు కలిపిన జైషే మొహమ్మద్, లష్కరే తోయిబాలు పాక్–అఫ్గాన్ సరిహద్దు డ్యూరాండ్ రేఖ వెంబడి శిక్షణ శిబిరాలను నెలకొల్పి, ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం.

ఫిబ్రవరి 14వ తేదీన కశ్మీర్‌లోని పుల్వామాలో జైషే మొహమ్మద్ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి ప్రతీకారంగా అదే నెలలో భారత వైమానిక దళం బాలాకోట్‌పై బాంబు దాడులు జరిపింది. అంతర్జాతీయ ఒత్తిడులకు లొంగిన పాక్ ప్రభుత్వం ఈ నెల మొదటి వారంలో లష్కరే తోయిబాకు చెందిన 15 మంది నేతలను అదుపులోకి తీసుకుంది. అయితే, ఇవన్నీ కంటి తుడుపు చర్యలేనని భారత్ అంటోంది. నిర్దిష్టమైన చర్యలతో ఉగ్రమూకలను కట్టడి చేయాలని కోరుతోంది. మరోవైపు, పాక్ ఉగ్ర సంస్థలకు దన్నుగా ఉంటోందంటూ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్‌ఏటీఎఫ్) సంస్థ ఆర్థిక సాయం నిలిపివేసింది. దీంతో ఆర్థికంగా కుంగిపోయిన పాక్‌పై ఒత్తిడి తీవ్రమైంది. ఈ నేపథ్యంలోనే ఉగ్ర సంస్థలు పాక్ నుంచి తమ మకాంను అఫ్గానిస్తాన్‌కు మార్చాయని భారత్ నిఘా వర్గాలు అంటున్నాయి. అయితే, ఈ పరిణామంతో అఫ్గాన్ రాజధాని కాబూల్‌తోపాటు కాందహార్‌లో ఉన్న భారత దౌత్య కార్యాలయాలకు ఉగ్ర ముప్పు పెరిగిందని హెచ్చరిస్తున్నాయి. జైషే మొహమ్మద్ ఉగ్రవాదులతోపాటు, పేలుడు పదార్థాలు అమర్చిన వాహనాలతో కాబూల్ ఎంబసీపై కారివరి గుల్ అనే ఉగ్ర సంస్థ దాడులకు దిగే ప్రమాదముందని అనుమానిస్తున్నాయి. కాందహార్‌లోని ఇండియన్ ఎంబసీపై తాలిబన్లు కూడా దాడులకు పాల్పడే ప్రమాదముందని అంటున్నాయి. తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌లు జైషే మొహమ్మద్ అధిపతి మసూద్ అజార్‌కు ఆశ్రయం కల్పించేందుకు ఫిబ్రవరిలో ముందుకు వచ్చినా పాక్‌లోని భావల్పూర్‌లో సైనిక రక్షణ మధ్య ఉండటమే శ్రేయస్కరమని అతడు ఆ ఆఫర్‌ను తిరస్కరించాడు. అంతేకాకుండా, కాబూల్, కాందహార్‌ల్లో ఉన్న భారత కార్యాలయాలపై ఈ ఉగ్ర సంస్థలు నిఘా వేసి ఉంచాయి. జనవరిలో సెదిక్ అక్బర్, అతావుల్లా అనే ఇద్దరు ఉగ్రవాదులను అఫ్గాన్ బలగాలు అదుపులోకి తీసుకుని, విచారించగా ఈ విషయాలన్నీ బయటకు వచ్చాయి.

### అమెరికా బలగాలకు ముప్పు

లష్కరే తోయిబా కూడా తన అనుచరులను నంగర్‌హార్, నూరిస్తాన్, కునార్, హెల్మండ్, కాందహార్ ప్రావిన్సుల్లోని శిక్షణ శిబిరాలకు తరలించింది. పెషావర్‌లో ఉన్న సభ్యుల మకాంను కాబూల్‌కు మార్చింది. తాలిబన్ సాయంతో విధ్వంసక, విద్రోహ చర్యలపై శిక్షణ ఇస్తోంది. మరోవైపు, అఫ్గానిస్తాన్‌లో ఉన్న 300 మంది జైషే మొహమ్మద్ ఉగ్రవాదులతో అమెరికా, సంకీర్ణ బలగాలకు ముప్పు ఉననట్లు అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ కూడా తన నివేదికలో పేర్కొంది. తాలిబన్, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖైబర్–పక్తున్వా మధ్య రాజీ కుదర్చడంలో జైషే మొహమ్మద్ పాత్ర ఉందని తెలిపింది.

## హుజూర్‌నగర్ ఎన్నికపై టీఆర్‌ఎస్ కుట్ర!

### టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార టీఆర్‌ఎస్ పార్టీ ఎలాగైనా గెలవాలని కుట్ర చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలా సత్యనారాయణ సంతాప సభకు హాజరైన ఉత్తమ్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండలంలో ఇసుక మాఫియాను ప్రభుత్వ పెద్దలే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇసుక మాఫియాను అడ్డుకోవాల్సిన కోదాడ డీఎస్పీ, హుజూర్‌నగర్ సీఐ, మఠంపల్లి ఎస్సైలు వెన్నుదన్నుగా నిలుస్తూ టీఆర్‌ఎస్ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వీరందరూ ఆంధ్రాకు చెందినవారని, వీరిని తెలంగాణ రాష్ట్రంలోని కోదాడ సబ్ డివిజన్‌కు బదిలీ చేయించి ఇసుక మాఫియాకు రాచబాట వేసుకున్నారని తెలిపారు. స్వయంగా తానే మఠంపల్లిలో జరుగుతున్న ఇసుక మాఫియాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇసుక లారీలను వీఆర్‌ఏ అడ్డుకుంటే అతనిపై టీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం దాడి చేశారని తెలిపారు. ఇంత జరుగుతున్నా కలెక్టర్, ఎస్పీ ఎందుకు మౌనం వహిస్తున్నారో అంతు చిక్కడం లేదని వాపోయారు. ఇసుక మాఫియాపై నోరుమెదపని కలెక్టర్, ఎస్పీపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీలకు సోమవారం ఫిర్యాదు చేస్తానని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో వార్డుల విభజన, రిజర్వేషన్లు పారదర్శకంగా చేపట్టాలన్నారు. వార్డుల విభజనలో అక్రమాలు చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు తమకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై కూడా ఎన్నికల కమిషనర్‌ను కలుస్తామని తెలిపారు.

## జగన్‌ను చూసి నేర్చుకో..

- సామాజిక న్యాయం అంటే ఏంటో తెలుస్తుంది
- సీఎం కేసీఆర్‌కు ఎంపీ కోమటిరెడ్డి సూచన



**సాక్షి, యాదాద్రి:** సామాజిక న్యాయం అంటే ఎలా ఉంటుందో పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి కేసీఆర్ నేర్చుకోవాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్.. ప్రతిపక్ష నేతగా ఉన్న భట్టి విక్రమార్కను కూడా ఆ హోదాలో లేకుండా చేస్తున్నారని విమర్శించారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు కేసీఆర్ కేబినెట్‌లో ఒక్క మంత్రి పదవీ దక్కలేదన్నారు. పక్క రాష్ట్రంలో మహిళలకు సమాన హక్కులు కల్పిస్తూ మంత్రి పదవులిచ్చిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ సామాజిక న్యాయమే అమలు చేయడం లేదని ఆరోపించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయ్యడమే లక్ష్యంగా పని చేస్తున్నానని తెలిపారు. తనకు టీపీసీసీ పదవి ఇస్తే వైఎస్సార్ లాగా రాష్ట్రవ్యాప్తంగా బస్సు, పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తానని చెప్పారు.

## ప్రభుత్వాస్పత్రిలో ప్రైవేటు వైద్యుడు

### మద్యం తాగి రోగులకు చికిత్స

**మంథని:** సర్కారు ఆస్పత్రిలో ప్రైవేటు వైద్యుడు రోగులకు ట్రీట్‌మెంట్ చేస్తున్న వైనం పెద్దపల్లి జిల్లా మంథని సామాజిక వైద్యశాలలో ఆదివారం వెలుగు చూసింది. ఆస్పత్రిలో సుశీల్‌కుమార్ అనే కాంట్రాక్ట్ వైద్యుడు ఆదివారం డ్యూటీలో ఉండాలి. ఆయనకు బదులుగా రాజు అనే ప్రైవేటు వైద్యుడు ఆస్పత్రిలో రోగులకు వైద్యం అందించాడు. కడుపునొప్పితో వచ్చిన ఓ పేషెంట్‌కు సదరు ప్రైవేటు వైద్యుడు ట్రీట్‌మెంట్ చేస్తున్న క్రమంలో వారితో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా మద్యం తాగిన వాసన రావడంతో రోగులకు అనుమానం వచ్చి మీడియాకు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి చేరుకున్న పాత్రికేయులు సదరు వైద్యుడు ఎవరని ఆరా తీయగా అసలు విషయం బట్టబయలైంది. మొదట తానే వైద్యుడినని.. నెల రోజులుగా పనిచేస్తున్నట్లు చెప్పాడు. అనుమానం వచ్చి ఆస్పత్రి ఇన్‌చార్జి వైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా రాజు అనే వైద్యుడు ఆస్పత్రిలో ఎవరూ పనిచేయడం లేదని చెప్పారు. సదరు వైద్యుడితో ఫోన్‌లో మాట్లాడించగా అసలు విషయం తెలిపాడు. తాను ప్రతిమ ఆస్పత్రిలో వైద్యుడినని సుశీల్ సార్ తన సీనియర్ అని, ఆయనకు అత్యవసర పని ఉందని తనని వెళ్లమంటే వచ్చానని వివరించాడు. అనంతరం అక్కడి నుంచి మెల్లగా జారుకున్నాడు. ఈ విషయంపై డీసీహెచ్‌ఎస్ రమాకాంత్‌ను వివరణ కోరగా విచారణ జరిపి ఇద్దరిపై చర్య తీసుకుంటామని తెలిపారు.

## ఏపీ ఉద్యోగులను తీసుకుంటే ఉద్యమిస్తాం

### టీఎస్‌పీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.రత్నాకర్‌రావు

**కొత్తపల్లి (కరీంనగర్):** ఆంధ్రప్రాంత ఉద్యోగులను ఆప్షన్‌పై తెలంగాణ రాష్ట్రానికి తీసుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.రత్నాకర్‌రావు హెచ్చరించారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీర్లు హాజరయ్యారు. అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ ఉద్యోగుల విభజన, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ మార్పు, పదోన్నతులు.. తదితర విషయాలపై చర్చించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రత్నాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ స్థానికత ఉన్న 229 మంది ఉద్యోగులను ఆంధ్రా విద్యుత్ సంస్థల నుంచి తెలంగాణ విద్యుత్ సంస్థల్లోకి తీసుకోనున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన అక్కడి ఉద్యోగులను ఆప్షన్‌పై తెలంగాణకు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. టీఎస్‌పీఈఏ సెక్రెటరీ జనరల్ పి.సదానందం, టీఎస్ఎన్‌పీడీసీఎల్ కంపెనీ సెక్రెటరీ బి.సామ్యూనాయక్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.అంజయ్య వివిధ జిల్లాలకు చెందిన ఇంజనీర్లు సమావేశంలో పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకున్న టీజీవోలు



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర మంత్రిగా టీజీవో మాజీ నేత శ్రీనివాస్‌గౌడ్‌కు అవకాశం కల్పిస్తే కాలినడకన తిరుమల శ్రీవారిని దర్శించుకుంటామన్న టీజీవో సంఘం నేతలు తమ మొక్కు తీర్చుకున్నారు. రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.రవీందర్ కుమార్, వి.సుజాత, హైదరాబాద్ నగర అధ్యక్షుడు గండూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఎం.బి.కృష్ణయాదవ్, నేతలు సబిత, శిరీష తదితరులు ఆదివారం తిరుమల వెళ్లారు. కాలినడకన మెట్ల మార్గంలో వెళ్లి శ్రీవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు.



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

## యాదాద్రిలో ముగిసిన వరుణయాగం

**యాదగిరిగుట్ట:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న వరుణయాగం ముగిసింది. యజ్ఞబ్రహ్మ మేళ్లూరి సందీప్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాగం ఆదివారం ఉదయం 11.45 గంటలకు మహాపూర్ణాహుతితో పరిసమాప్తమైంది. కాగా, యాదాద్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దాదాపు 25 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

ఏజెన్సీ కష్టాలు



## జోలెలో మృతదేహం తరలింపు

**ములుగు:** రవాణా సౌకర్యం లేక మృతి చెందిన వ్యక్తిని జోలె కట్టి సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర కాలినడకన స్వగ్రామానికి తీసుకెళ్లిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలం మురుమూరులో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మురుమూరు గ్రామానికి చెందిన రైతు సోర్లం చిరంజీవి(27) శనివారం కొప్పుసూరు గ్రామానికి కూలి పనికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో బహిర్భూమికి వెళ్లగా పాముకాటుకు గురై పంట పొలంలో కుప్పకూలాడు. ఇది గమనించిన తోటి కూలీలు అతడిని ఆస్పత్రికి తరలించేందుకు వాహన సదుపాయం లేకపోవడంతో అతని ప్రాణాలు కాపాడడానికి అనేక ప్రయత్నాలు చేశారు. అయినా వారి ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు చిరంజీవి పొలాల్లోనే ప్రాణాలు వదిలాడు. అయిత మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లడానికి రవాణా సౌకర్యం లేక పోవడంతో తోటి కూలీలు లుంగీతో జోలె కట్టి కాలినడకననే తీసుకెళ్లారు. కాగా, ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని వాజేడు మండల పోలీసులు తెలిపారు.



## మహిళ ప్రసవ వేదన

**కెరమెరి(ఆసిఫాబాద్):** సరైన రోడ్డు వసతి లేక పోవడంతో అంబులెన్సు రాక ఓ గిరిజన మహిళ ఏజెన్సీ ప్రాంతంలో ప్రసవ వేదనకు గురైంది. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం కర్రెతగూడకు చెందిన గర్భిణి సిడాం హంసుబాయి ఆస్పత్రికి నడుచుకుంటూ వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రసవించింది. ఆదివారం ఉదయం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. అయితే సాంగ్వి నుంచి కర్రెతగూడకు వెళ్లే దారి మధ్యలో చెరువు ఉంది. దీనిపై నిర్మించిన వంతెన కూలిపోయి నాలుగేళ్లు అవుతోంది. ప్రస్తుతం అటువైపు ఎలాంటి వాహనాలు వెళ్లేందుకు ఆస్కారం లేదు. దీంతో అంబులెన్సు అక్కడకు చేరుకోలేక పోయింది. దీంతో చేసేదేమీ లేక హంసుబాయి నొప్పులతోనే ఆస్పత్రికి బయలుదేరింది. కొంతదూరం వెళ్లాక నొప్పులు అధికం కావడంతో మార్గమధ్యంలోనే ప్రసవించింది. పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. కాగా, పసికందుతోనే కిలోమీటరు దూరం నడిచి చెరువు దాటాక అంబులెన్సు రావడంతో ఆమెను కెరమెరి పీహెచ్‌సీలో చేర్పించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.

## కీచక అధ్యాపకుడిపై వేటు

### ఉద్యోగం నుంచి తొలగింపు

**బాసర (ముథోల్):** బాసర ట్రిపుల్‌ఐటీలో ఓ విద్యార్థిని విషయంలో అసభ్యకరంగా ప్రవర్తించిన కీచక అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై వేటు పడింది. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చేలా వ్యవహరించిన రసాయనిక శాస్త్ర విభాగాధిపతి రవి వరాలను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు యూనివర్సిటీ పరిపాలనాధికారి శ్రీహరి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. యూనివర్సిటీలో విద్యార్థులకు డిసెంబర్–ఏప్రిల్‌లో సెమిస్టర్ పరీక్షలుంటాయి. ఇందులో ఫెయిలైన వారికి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా సబ్జెక్టు అధ్యాపకులు, విభాగాధిపతులకు ఈ బాధ్యతలు అప్పగిస్తారు. ఇదే అదనుగా కెమిస్ట్రీ విభాగాధిపతి రవి వరాల ఓ విద్యార్థినిపై తన కీచక బుద్ధిని ప్రదర్శించాడు. అసభ్యకర మెసెజ్‌లు పంపి అడ్డంగా దొరికిపోయాడు. విషయాన్ని పరిపాలనాధికారి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఇన్‌చార్జి వీసీ అశోక్‌కుమార్ వెంటనే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. కమిటీ నివేదిక ఆధారంగా కీచక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రవి వరాలపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై కోదాడి రాజు తెలిపారు. కాగా. బసర ట్రిపుల్‌ఐటీలో కీచక అధ్యాపకుడి తీరును నిరసిస్తూ పలు మహిళా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ట్రిపుల్‌ఐటీ ప్రాంగణ ద్వారం ఎదుట ధర్నా చేశారు.

# పంటల బీమా ప్రశ్నార్థకం

### ప్రీమియం చెల్లింపునకు ముంచుకొస్తున్న వ్యవధి

- ఈనెల 15న పత్తికి, 31న ఇతర పంటలకు ముగుస్తున్న గడువు
- బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో ప్రీమియం చెల్లింపునకు ఆటంకాలు
- 50 శాతం విస్తీర్ణాన్ని బీమా పరిధిలోకి తీసుకురావాలన్న లక్ష్యానికి తూట్లు
- బ్యాంకులు, బీమా కంపెనీలు సహకరించకపోవడమే కారణం



**సాక్షి, హైదరాబాద్:** వర్షాలు లేక ఒకవైపు రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు వేసిన పంటలకు రక్షణగా ఉండాల్సిన పంటల బీమా పథకం అక్కరకు రాకుండా పోతుంది. పంటల బీమా కంపెనీలు, బ్యాంకులు రైతుల జీవితాలతో ఆటాడుకుంటున్నాయి. ప్రీమియం గడువు ముంచుకొస్తున్నా ఏమాత్రం రైతులను ఆదుకోవడంలేదు. దీంతో ఈ ఖరీఫ్ పంటల బీమా ప్రశ్నార్థకంగా మారింది. బీమా ప్రీమియం చెల్లింపు గడువు తేదీలు ముంచుకొస్తున్నా రైతులను బీమాలో చేర్పించేందుకు ప్రయత్నించడంలేదు. దీంతో ఈసారి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంటల బీమాలో పంటల విస్తీర్ణం, రైతుల నమోదు గణనీయంగా తగ్గే అవకాశముంది. రాష్ట్రంలో సాగయ్యే పంటల్లో ప్రధానంగా 40 శాతం పత్తి ఉంటుంది. దానికి ఈ నెల 15వ తేదీకి బీమా గడువు ముగియనుంది. అలాగే మిగిలిన పంటలకు ఈ నెల 31వ తేదీతో ప్రీమియం గడువు ముగుస్తుంది. ఈ ఖరీఫ్‌లో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 30 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఇందులో అత్యధికంగా పత్తి 20 లక్షల ఎకరాలు సాగు దాటింది. అయితే సాగైన పత్తి విస్తీర్ణంలో 10 శాతం కూడా బీమా పరిధిలోకి రాలేదని కంపెనీలు, వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన పంటలకూ బీమా ప్రీమియం రైతుల నుంచి వసూలు చేయడంలో కంపెనీలు విఫలం అవుతున్నాయి. పైగా బీమా గడువులోగా పంటల సాగు పెరిగే పరిస్థితి కనిపించడంలేదు. ఆ ప్రకారం బీమా ప్రీమియం చెల్లించే అవకాశాలు లేవు.

**పంట రుణాలు ఇవ్వకపోవడంతో...**

పంట రుణాలకు, బీమా ప్రీమియంకు సంబంధం ఉంది. దేశంలోనూ రాష్ట్రంలోనూ పంట రుణం తీసుకునే సమయంలో ఏ పంట సాగు చేస్తున్నారో దానికి కచ్చితంగా ప్రీమియం మినహాయించుకుని బ్యాంకులు రైతులకు మిగతా రుణాన్ని మంజూరు చేస్తాయి. అంటే రుణం తీసుకునే ప్రతీ రైతు నుంచి బీమా ప్రీమియాన్ని తీసేసుకుంటాయి. ఇలా తప్పనిసరి చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందనేది సర్కారు ఉద్దేశం. అయితే బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో ఆ మేరకు పంటల బీమా ప్రీమియాన్ని మినహాయించే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే రైతులపాలిట శాపంగా మారింది. ఇదిలావుంటే బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా ఇతర పద్ధతుల ద్వారా బీమా చెల్లించడంపై అవగాహన లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఒకవేళ కాలం కలిసిరాక అన్నదాత నష్టపోతే ఎటువంటి పరిహారం అందని పరిస్థితి ఏర్పడనుంది. అలాగే సాగైన భూమిలో 50 శాతం మేర పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ దాన్ని అమలు చేయడంలో వ్యవసాయశాఖ, బ్యాంకులు, బీమా కంపెనీలు విఫలమవుతున్నాయి. మన రాష్ట్రంలో సాగయ్యే భూమిలో బీమా పరిధిలోకి వచ్చే భూమి కేవలం 20 శాతం వరకే ఉంటుంది. ఒక్కోసారి అది 15 శాతానికి పరిమితమవుతోంది. పంటల బీమా పరిధిలోకి ప్రైవేటు కంపెనీలు ప్రవేశించడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్న వాదనలున్నాయి.

**పంటల బీమా అమలులో సమస్యలు...**

- బీమా కంపెనీలు ప్రీమియం ధరలను ఏడాదికేడాదికి భారీగా పెంచుతున్నాయి. ఈ పద్ధతి మార్చాలని నిపుణులు కోరుతున్నారు.
- పంటల బీమాను అమలు చేసే కంపెనీలు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడంలేదు. జిల్లా స్థాయిలో అధికారులు ఉండటంలేదు. దీంతో రైతులకు బీమాపై అవగాహన కల్పించే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా బీమా చెల్లింపునకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీమా ప్రీమియం చెల్లించిన మూడువారాల్లోగా రైతులకు పరిహారాన్ని ఖరారు చేయాలి. ప్రస్తుతం నెలల తరబడి ఆలస్యం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనివల్ల కూడా రైతులు పంటల బీమాపై అయిష్టత చూపుతున్నారు.
- రైతులు చెల్లించిన ప్రీమియం సొమ్మును బ్యాంకులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బీమా కంపెనీలకు బదిలీ చేయాలి. కానీ అలా జరగడంలేదు.
- చిన్నచిన్న అంశాలను ఆధారం చేసుకొని పంటల బీమాను రైతులకు అందకుండా చేస్తున్నారు. ఇది పథకం ఉద్దేశాన్ని నీరుగారుస్తున్నది.
- వివిధ దశల్లో విధిస్తున్న షరతులు, నిబంధనల కారణంగా బీమా నష్టపరిహారం పొందడం గగనంగా మారింది.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

## గ్రామాల్లో పనిచేసిన వైద్యులకు గుర్తింపు

### వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

**వరంగల్:** గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు సేవలందించిన వైద్యులకు, వైద్య సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు ఇస్తామని, బదిలీల్లో కోరుకున్న చోట పోస్టింగ్‌లు కల్పిస్తామని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి మండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలసి ఎంజీఎంతో పాటు హెల్త్ యూనివర్సిటీ ఆవరణలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాలను పరిశీలించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. గ్రామీణ పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందికి అదనంగా అలవెన్సులు ఇస్తామని తెలిపారు. మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రికి పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, సిబ్బందిని వెంటనే నియమించాలని ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. సమావేశంలో ఎంపీలు బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, మేయర్ గుండా ప్రకాశ్‌రావు, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, దాస్యం వినయ్ భాస్కర్, అరూరి రమేశ్, తాటి కొండ రాజయ్య, ఒడితల సతీష్ బాబు పాల్గొన్నారు.

## హింసకు దిగితే ఊరుకోం

### మాజీ ఎంపీ వినోద్‌కుమార్



**కాజీపేట అర్బన్:** తెలంగాణను మరో బెంగాల్‌గా మారుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో ఆదివారం టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. అమిత్‌షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా 'నెలకోసారి తాను వస్తానని.. 15 రోజులకోసారి కేంద్ర మంత్రులు వస్తారని.. ఇక తెలంగాణలో తేల్చుకోవడమే'అంటూ ప్రజలను చీల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయంగా చర్చించేందుకు తెలంగాణకు రావాలే కానీ.. ప్రజలను చీల్చేందుకు వస్తే ఊరుకోమని హెచ్చరించారు. తెలంగాణలో అన్ని మతాల ప్రజలు అన్నదమ్ముల్లా కలసి ఉంటున్నారని, రాష్ట్రం ప్రశాంతంగా ఉన్న తరుణంలో హిందుత్వం పేరిట హింసకు ప్రేరేపిస్తే తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో పోరాటానికి సిద్ధమని అన్నారు. ఇంతవరకు ఏ పార్టీ కూడా సైనికుల పేరిట ఓట్లు అడగలేదన్నారు.

## పిచ్చితల్లిని కాటేసిన కామాంధుడు

- సిరిసిల్ల జిల్లా బోనాలలో దారుణం
- బాత్రూంలోనే ప్రసవం..

**సిరిసిల్లక్రైం:** మానసిక స్థితి సరిగాలేని ఓ యువతిని లోబర్చుకుని గర్భవతిని చేశాడో ప్రబుద్ధుడు. తనకు ఏం జరిగిందో చెప్పలేని స్థితిలో దాదాపు 7 నెలలు తన కడుపులోనే శిశువు మోస్తూ చివరకు బాత్‌రూంలో ప్రసవానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో పుట్టిన ఆడశిశువు వెంటనే మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చిన్నబోనాలలో ఆదివారం జరిగింది. చిన్నబోనాలలో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించే ఇండ్ల నర్సయ్య, వజ్రవ్వలకు 22 ఏళ్ల కూతురు ఉంది. చిన్ననాటి నుంచి ఆమె కాస్త మతిస్థిమితం లేనట్లు ఉండేదని స్థానికులు తెలిపారు. ఇంట్లోని వారందరూ కూలి పనులకు వెళ్లడం గమనించి స్థానికంగా ఉండే రాజు అనే వ్యక్తి ఆమెపై కన్నేశాడు. మాయమాటలు చెప్పి యువతిని లోబర్చుకున్నాడు. ఇటీవల యువతికి ఆరోగ్యం బాగాలేకపోవడం, శారీరకంగా మార్పులు రావడంతో సిరిసిల్ల వెంకంపేటలోని ఓ ఆర్‌ఎంపీకి కుటుంబీకులు చూపించినట్లు స్థానికులు వివరించారు. యువతి శరీర ఆకృతిపై అనుమానం వచ్చిన చుట్టుపక్కల మహిళలు అడిగితే డాక్టర్ ఇచ్చిన మందులతో ఇలా జరిగిందని నిరాక్షరాస్యులైన తల్లిదండ్రులు వివరించినట్లు తెలిసింది. కానీ ఆ యువతి గర్భందాల్చి దాదాపు ఏడు నెలల అవుతోందని, సమయం దగ్గరపడిన విషయం తెలియక యువతి బాతురూం వెళ్లిన క్రమంలో వచ్చిన నొప్పులకు కడుపులోని పాపను తానే బయటకు లాగినట్లు బాత్‌రూంలో ప్రసవించిన విధానాన్ని బట్టి మహిళలు వెల్లడించారు. ఆ యువతికి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నామని సిరిసిల్ల సీఐ శ్రీనివాస్, ఐసీడీఎస్ సిరిసిల్ల సీడీపీవో ఆలేఖ్య తెలిపారు.

**మానసిక వికలాంగురాలిపై లైంగిక దాడి**

**బయ్యారం:** ఓ వ్యక్తి మద్యం మత్తులో మానసిక వికలాంగురాలిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం వెంకట్రాంపురం గ్రామంలో శనివారం రాత్రి చోటచేసుకుంది. గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలు(20) ఇంటి వద్ద నిద్రిస్తుండగా జగ్నాతండాకు చెందిన ఇస్లావత్ రవి ఆమె బయటకు తీసుకెళ్లి లైంగిక దాడికి పూనుకున్నాడు. ఇంతలో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతుకుతుండగా గమనించిన రవి పారిపోయాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు బయ్యారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

# మేడిగడ్డ వద్ద రక్షణ కంచె

- బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో ప్రమాదం లేకుండా చర్యలు
- సుమారు 55 కిలోమీటర్ల వరకు బ్యాక్ వాటర్ నిల్వ
- సీఎం కేసీఆర్ ఆదేశాలతో నిర్మాణం
- చకచకా సాగుతున్న పనులు



రక్షణ కంచె నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో ఇక్కడి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ప్రమాదం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రక్షణ కంచె (చైన్ లింక్ మెష్) నిర్మాణం చేపట్టింది. మేడిగడ్డ వద్ద ఈ ఖరీఫ్ నుంచి నీటిని నిల్వ చేయనున్నారు. అయితే బ్యారేజీ నుంచి పలుగుల వరకు సుమారు 55 కిలోమీటర్ల వరకు గోదావరి బ్యాక్ వాటర్ నిలిచి ఉంటుందని ఇంజనీర్లు చెబుతున్నారు. మధ్యలో కాళేశ్వరం పుష్కర ఘాట్ల వద్ద నిల్వ ఉన్న గోదావరి బ్యాక్ వాటర్‌లో భక్తులు స్నానాలు చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తుగా భద్రత చర్యలు చేపట్టారు.

**101 మీటర్ల ఎత్తులో నీటిమట్టం..**

గోదావరి నీటి మట్టం 101 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్ వరకు ఉంటుంది. మహారాష్ట్ర–తెలంగాణల మధ్యలో గోదావరి, ప్రాణహిత నీటిని ఒడిసి పట్టి కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణం చేశారు. కాగా, పుణ్యక్షేత్రమైన శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వాటర్ లెవల్ 101 మీటర్లు ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని సీఎం కేసీఆర్ ఇరిగేషన్, ఏజెన్సీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు చెప్పారు. వెంటనే రక్షణ కంచె (ప్రొటెక్షన్ వాల్) నిర్మాణం చేట్టాలని మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం సంస్థకు ఆదేశం చేశారు. దీంతో బ్యాక్ వాటర్ పూర్తిగా రాక ముందే నిర్మాణం పూర్తి చేయాలనే ఉద్దేశంతో పనులు చకాచకా చేస్తున్నారు.

**100 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్ ఎత్తున వాల్..**

కాళేశ్వరం వద్ద 101 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్ ఎత్తున వరద ప్రవాహం వచ్చినప్పుడు ఎలాంటి ప్రమాదం లేకుండా పుష్కర ఘాట్లకు 100 ఎఫ్‌ఆర్‌ఎల్ ఎత్తున చైన్‌లింక్ మెష్ నిర్మిస్తున్నారు. ఈ వాల్ పుష్కర ఘాటుకు 240 మీటర్ల పొడవు వరకు చేపట్టారు. పుష్కర ఘాట్ పైన 2.5 మీటర్ల ఎత్తు వరకు కంచె నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం ప్రవాహం లేదు కాబట్టి మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు నడిచేందుకు వీలుగా మెష్‌ను తయారు చేస్తున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత భక్తులు జల్లు స్నానాలు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులు, డస్ట్‌బిన్‌లు సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.

**ఇరిగేషన్ అధికారుల పరిశీలన...**

ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం పనులను కాళేశ్వరం బ్యారేజీ ఈఈ రమణారెడ్డి, డీఈఈ సూర్యప్రకాశ్ ఆదివారం ఉదయం పరిశీలించారు. త్వరలో నీటిని నిల్వ చేయనున్న నేపథ్యంలో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచినట్లు ఈఈ పేర్కొన్నారు. నీటిని నిల్వ చేయక ముందే పనులు పూర్తవుతాయని చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
8-7-2019

**తొలి సెమీఫైనల్**
జూలై 9
భారత్ X న్యూజిలాండ్
వేదిక: మాంచెస్టర్
మధ్యాహ్నం 3 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

**రెండో సెమీఫైనల్**
జూలై 11
ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
వేదిక: బర్మింగ్‌హామ్
మధ్యాహ్నం 3 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

### తజికిస్తాన్ చేతిలో భారత్ పరాజయం

ఇంటర్ కాంటినెంటల్ కప్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను భారత్ ఓటమితో ప్రారంభించింది. తజికిస్తాన్‌తో ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2-4 గోల్స్ తేడాతో ఓడింది. సునీల్ ఛెత్రి (4వ, 41వ నిమిషాల్లో) చేసిన రెండు గోల్స్‌తో విరామ సమయానికి భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో తజికిస్తాన్ విజృంభించి నాలుగు గోల్స్ చేసి విజయం సాధించింది.


విలియమ్సన్

# ఎవరిదో నాకౌట్ పంచ్?


కోహ్లి

ప్రపంచకప్‌లో లీగ్ దశకు తెర పడింది. అత్యుత్తమ ప్రదర్శన చేసిన నాలుగు జట్లు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ సెమీఫైనల్ పోరుకు అర్హత సాధించాయి. వరుసగా 38 రోజుల్లో మొత్తం 45 లీగ్ మ్యాచ్‌లు జరిగాయి. రౌండ్ రాబిన్ లీగ్ ఫార్మాట్‌లో అన్ని జట్లకు సెమీఫైనల్ చేరే అవకాశాలు సమానంగా లభించాయి. కానీ సెమీఫైనల్లో మాత్రం అలాంటి చాన్స్ ఉండదు. విశ్వవిజేతను నిర్ణయించే ఫైనల్ పోరుకు అర్హత పొందేందుకు ఈ నాలుగు జట్లకు సెమీఫైనల్స్ రూపంలో ఒక్కో అవకాశమే లభించనుంది. ఈ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓడితే ఇంటిదారి పడతారు కాబట్టి నాలుగు జట్లూ ఈ కీలక మ్యాచ్‌ల్లో పైచేయి సాధించేందుకు పక్కా వ్యూహాలతో సమాయత్తం అవుతున్నాయి.

– సాక్షి క్రీడావిభాగం

**ప్రపంచకప్‌లో సెమీఫైనల్స్‌కు రంగం సిద్ధం**

- గత రన్నరప్ న్యూజిలాండ్‌తో భారత్ ‘ఢీ’
- డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఇంగ్లండ్ సమరం
- ప్రత్యేక వ్యూహాలపై నాలుగు జట్ల కసరత్తు
- తాడోపేడో మ్యాచ్‌ల్లో కీలక ఆటగాళ్ల ప్రదర్శన కీలకం

టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరిగా బరిలోకి దిగిన భారత్ ప్రస్థానం సెమీఫైనల్ వరకు రాజసంగా సాగింది. ఆతిథ్య ఇంగ్లండ్ చేతిలో పరాజయం... వర్షం కారణంగా న్యూజిలాండ్‌తో మ్యాచ్ రద్దు కావడం మినహా... మిగతా ఏడు మ్యాచ్‌ల్లో భారత్ అదరగొట్టింది. శిఖర్ ధావన్, విజయ్ శంకర్ గాయాలతో మధ్యలోనే వైదొలిగినా వారి నిష్క్రమణ ప్రభావం టీమిండియా ప్రదర్శనపై అంతగా పడలేదు. రోహిత్ శర్మ ఐదు సెంచరీలతో భీకరమైన ఫామ్‌లో ఉండటం పెద్ద ఊరట. మరో ఓపెనర్ లోకేశ్ రాహుల్ శతకంతో ఫామ్‌లోకి రావడం... కెప్టెన్ కోహ్లి నిలకడ... వెరసి భారత టాపార్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. అయితే ఇప్పటి వరకు భారత మిడిలార్డర్‌కు సరైన పరీక్ష ఎదురుకాలేదు. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్‌తో సెమీఫైనల్లో టాపార్డర్ ప్రదర్శన కీలకం కానుంది. భారత్ భారీ స్కోరు చేయాలన్నా... లక్ష్య ఛేదన సాఫీగా సాగాలన్నా రోహిత్, రాహుల్, కోహ్లిలో ఒకరు మరోసారి భారీ ఇన్నింగ్స్ ఆడాల్సిందే. ఒకవేళ వీరు విఫలమైతే మిడిలార్డర్‌లో రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్యా, ధోని బాధ్యతాయుతంగా ఆడాలి. బౌలింగ్ విషయానికొస్తే జస్‌ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ షమీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. బుమ్రా 17 వికెట్లు, షమీ 14 వికెట్లు తీశారు. లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చహల్ 11 వికెట్లు పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్, కుల్దీప్ యాదవ్ కూడా తమవంతుగా రాణిస్తున్నారు.


2008లో కోహ్లి, విలియమ్సన్

**ఒకరిద్దరిపైనే భారం...**

అందని ద్రాక్షగా ఉన్న ప్రపంచకప్‌ను ఈసారైనా సాధించాలనే లక్ష్యంతో ఉన్న న్యూజిలాండ్‌కు ఈ మెగా ఈవెంట్ చరిత్రలో కీలక మ్యాచ్‌ల్లో చేతులెత్తేసే అలవాటు ఉంది. 1975, 1979, 1992, 1999, 2007, 2011 ప్రపంచకప్‌లలో సెమీఫైనల్లో నిష్క్రమించిన కివీస్... 2015 ప్రపంచకప్‌లో ఫైనల్ చేరి తుది మెట్టుపై చతికిలపడింది. ఈ ప్రపంచకప్‌లోనూ న్యూజిలాండ్ ఆరంభంలో అదరగొట్టింది. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఆ జట్టుకు పరాజయం ఎదురుకాలేదు. అయితే పాకిస్తాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లతో జరిగిన చివరి మూడు మ్యాచ్‌ల్లో కివీస్ జట్టుకు ఓటమి ఎదురైంది. ఈ టోర్నీలో న్యూజిలాండ్ బ్యాటింగ్, బౌలింగ విభాగాల్లో ఎక్కువగా ఒక రిద్దరి ప్రదర్శనపైనే ఆధారపడుతోంది. బ్యాటింగ్‌లో విలియమ్సన్, రాస్ టేలర్... బౌలింగ్‌లో ఫెర్గూసన్, ట్రెంట్ బౌల్ట్ నిలకడగా ఆడుతున్నారు. విలియమ్సన్, టేలర్ తక్కువ స్కోర్లకే ఔటైతే మాత్రం న్యూజిలాండ్‌కు మరోసారి నిరాశ తప్పదేమో.

**ముఖాముఖి**

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మొత్తం 106 మ్యాచ్‌లు జరిగాయి. 55 మ్యాచ్‌ల్లో భారత్, 45 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలిచాయి. ఒక మ్యాచ్ ‘టై’కాగా... ఐదు మ్యాచ్‌లు రద్దయ్యాయి. ప్రపంచకప్‌లో ఏడు సార్లు ఈ రెండు జట్లు తలపడ్డాయి. మూడుసార్లు భారత్‌ను విజయం వరించగా, నాలుగు సార్లు న్యూజిలాండ్ గెలుపు రుచి చూసింది. ఈ రెండు జట్లు చివరిసారి 2003 ప్రపంచకప్‌లో తలపడటం గమనార్హం.

**వారిద్దరి సారథ్యంలోనే మళ్లీ...**

విరాట్ కోహ్లి నేతృత్వంలో భారత జట్టు 2008లో అండర్-19 ప్రపంచ కప్ టైటిల్‌ను సాధించింది. మలేసియాలో జరిగిన నాటి టోర్నీలో సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై మూడు వికెట్ల తేడాతో భారత్ గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. నాటి సెమీఫైనల్లో న్యూజిలాండ్ జట్టుకు ప్రస్తుత సీనియర్ జట్టు కెప్టెన్ కేన్ విలియమ్సన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. 11 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ రెండు జట్ల మధ్య ప్రపంచకప్ సెమీఫైనల్ పోరు జరగనుండగా... యాదృచ్ఛికంగా కోహ్లి, విలియమ్సన్ ఈసారి సీనియర్ జట్లకు సారథులుగా ఉన్నారు. నాటి జూనియర్ న్యూజిలాండ్ జట్టులో సభ్యులుగా ఉన్న ట్రెంట్ బౌల్ట్, టిమ్ సౌతీ... భారత జూనియర్ జట్టులో సభ్యుడైన రవీంద్ర జడేజా ప్రస్తుతం సీనియర్ జట్టులోనూ ఉన్నారు.


మోర్గాన్

**అడ్డంకి దాటాలంటే...**

1992 తర్వాత మళ్లీ ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరిన ఇంగ్లండ్‌పై ఈసారి భారీగా అంచనాలు ఉన్నాయి. భారీ హిట్టర్లు ఉండటం.. అందరూ ఫామ్‌లోకి రావడం... బౌలింగ్ పదును పెరగడం... వెరసి ఇంగ్లండ్‌ను ఈసారి టైటిల్ ఫేవరెట్‌గా చేశాయి. లీగ్ దశలో ఆసీస్ చేతిలో ఓడిన ఇంగ్లండ్... చావోరేవోలాంటి సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను దెబ్బ కొట్టాలని పట్టుదలగా ఉంది. పోరాటపటిమకు మారుపేరైన ఆసీస్‌ను ఓడించాలంటే ఇంగ్లండ్ తమ అత్యుత్తమ ప్రదర్శన చేయాలి. ఇంగ్లండ్ నుంచి ఐదుగురు బ్యాట్స్‌మెన్‌లో జో రూట్, బెయిర్‌స్టో రెండేసి సెంచరీలు చేయగా... జేసన్ రాయ్, మోర్గాన్, బట్లర్ ఒక్కోసెంచరీ సాధించారు. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ (17 వికెట్లు), మార్క్ వుడ్ (16 వికెట్లు), క్రిస్ వోక్స్ (10 వికెట్లు) హడలెత్తిస్తున్నారు. అయితే లీగ్ దశ ప్రదర్శన ఇప్పుడు చరిత్రే. నాకౌట్ మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించి ఓపెనర్లు శుభారంభం అందించాలి. మిడిలార్డర్ కుదురుగా ఆడాలి. ఆ తర్వాత బౌలర్లు మిగతా బాధ్యతను నిర్వర్తించాలి. కీలక మ్యాచ్‌లో కలిసికట్టుగా ఆడితేనే గట్టెక్కుతామన్న సంగతి ఇంగ్లండ్‌కూ తెలుసు కాబట్టి రెండో సెమీఫైనల్ రసవత్తరంగా సాగడం ఖాయం.

**ముఖాముఖి**

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లు ఓవరాల్‌గా 148 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 82 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా గెలవగా... 61 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్‌కు విజయం దక్కింది. రెండు మ్యాచ్‌లు ‘టై’గా ముగిశాయి. మూడు మ్యాచ్‌లు రద్దయ్యాయి. ప్రపంచకప్‌లో ఈ రెండు జట్లు ఎనిమిదిసార్లు పోటీపడ్డాయి. ఆరు సార్లు ఆస్ట్రేలియా నెగ్గగా... రెండు సార్లు ఇంగ్లండ్ గెలిచింది. 1992 ఈవెంట్ తర్వాత ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్‌కు ప్రపంచకప్ మ్యాచ్‌లో విజయం దక్కలేదు.

**కంగారూ పడొద్దంటే...**

ప్రపంచ కప్ సెమీస్ ముంగిట డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను ఆటగాళ్ల గాయాలు కలవరపెడుతున్నాయి. ఇప్పటికే షాన్ మార్ష్ మోచేతి గాయంతో ప్రపంచ కప్‌కు దూరం కాగా, తాజాగా ఉస్మాన్ ఖాజా తొడ కండరాల గాయంతో ప్రపంచ కప్ నుంచి వైదొలిగాడు. ఖాజా స్థానంలో వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ మాథ్యూ వేడ్‌ను ఎంపిక చేశారు. మరోవైపు ఆల్ రౌండర్ స్టొయినిస్ పక్కటెముకల గాయంతో బాధపడుతున్నాడు. అయితే అతను సెమీఫైనల్లో ఆడేది లేనిది మరో రెండు రోజుల్లో తేలనుంది. స్టొయినిస్‌కు బ్యాకప్‌గా మిచెల్ మార్ష్‌ను ఎంపిక చేశారు. లీగ్ దశ ఆరంభంలో భారత్ చేతిలో ఓడిన ఆస్ట్రేలియా ఆ తర్వాత వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి... చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో పోరాడి ఓడింది. ఆస్ట్రేలియా విజయమంత్రాల్లో సమష్టి ప్రదర్శన ప్రధానం. ఏ ఒక్కరిపైనో ఆ జట్టు అతిగా ఆధారపడటం లేదు. వార్నర్, ఫించ్, స్టీవ్ స్మిత్, అలెక్స్ క్యారీ జోరు మీదుండగా... మ్యాక్స్‌వెల్ నుంచి భారీ ఇన్నింగ్స్ బాకీ ఉంది. ఇక బౌలింగ్‌లో మిషెల్ స్టార్క్ 26 వికెట్లతో టోర్నీ టాపర్‌గా కొనసాగుతున్నాడు. కమిన్స్ 13 వికెట్లు, బెహ్రెన్‌డార్ఫ్ తొమ్మిది వికెట్లు తీశారు. లీగ్ దశలో ఇంగ్లండ్‌పై నెగ్గిన ఆస్ట్రేలియా నాకౌట్ మ్యాచ్‌లో మాత్రం విజయం సాధించాలంటే విశేషంగా రాణించాల్సి ఉంటుంది.


ఫించ్

## ధోని @ 38

**శుభాకాంక్షల వెల్లువ**



**లీడ్స్:** భారత్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని ఆదివారం 38వ పడిలోకి ప్రవేశించాడు. ప్రపంచకప్ వేటలో ఉన్న విరాట్ సేనతో పాటు, మాజీలు, దిగ్గజ క్రికెటర్లు మహికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. భార్య సాక్షి, కుమార్తె జీవాలతో కలిసి శనివారం రాత్రే కేక్ కటింగ్‌తో ధోని వేడుక చేసుకున్నాడు. అనంతరం కేక్ క్రీమ్ పూసుకున్న ముఖంతో ధోని తన గారాలపట్టి జీవాతో కలిసి చిందులు వేశాడు. ఈ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడంతో లక్షల్లో లైక్‌లు వచ్చిపడ్డాయి. ‘హ్యాపీ బర్త్‌డే మహి’ అనే శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఎప్పట్లాగే కెప్టెన్ కోహ్లి తన నాయకుడు ధోనినే అంటూ అతనికి విషెస్ చెప్పగా... వైస్ కెప్టెన్ రోహిత్ తాము మాంచెస్టర్ వెళ్లే దారిలో బస్ జర్నీలో ధోని జన్మదిన వేడుక చేసుకుంటామన్నాడు. భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ట్విట్టర్‌లో ‘విష్ యు హ్యాపీబర్త్ డే ఎం.ఎస్.ధోని. ఈ యేడూ నీకు మంచి జరగాలి. మిగతా రెండు మ్యాచ్‌లకు ఆల్ ద బెస్ట్’ అని ట్వీట్ చేశాడు. సెహ్వాగ్ వినూత్నంగా ‘7 ఖండాలు, 7 రోజులు, హరివిల్లులోని 7 రంగులు, 7 సంగీత స్వరాలు, పెళ్లిలో 7 అడుగులు, 7 వింతలు, ఏడో నెలలో ఏడో తేదీన పుట్టిన క్రికెట్ అద్భుతం ధోనికి శుభాకాంక్షలు’ అని ట్వీట్ చేశాడు. అలాగే జట్టు సహచరులందరూ ధోనికి విషెస్ చెప్పారు.

## రోహిత్... తన జోడీని ఉరకలెత్తిస్తాడు

**బ్యాటింగ్ కోచ్ బంగర్ వ్యాఖ్య**



**లీడ్స్:** ఈ ప్రపంచకప్‌లో అదేపనిగా శతక్కొట్టే ప్రదర్శనతో దూసుకెళ్తున్న ఓపెనర్ రోహిత్ శర్మను భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ ప్రశంసలతో ముంచెత్తాడు. ‘రోహిత్ ఆటతీరు, నిలకడైన ప్రదర్శన అద్భుతం. బరిలోకి దిగిన ప్రతీసారి అదే పట్టుదలతో ఆడుతున్నాడు. ఈ క్రమంలో తన పరుగులకే పరిమితం కాకుండా జోడీ కట్టిన రెండో ఓపెనర్‌నూ ఉరకలెత్తిస్తున్నాడు. ఆసీస్‌తో జరిగిన పోరులో శిఖర్ ధావన్‌ను అలాగే ఉత్సాహపరిచాడు. ఇప్పుడు శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో రాహుల్‌ను పరుగుపెట్టించాడు. దీంతో తదుపరి బ్యాట్స్‌మెన్‌కు బ్యాటింగ్ తేలికవుతోంది. ఇలా జట్టు మొత్తానికి ఉపయోగపడేలా రోహిత్ ఇన్నింగ్స్‌లు సాగుతున్నాయి. అతని ఆటతీరుతో జట్టు కూడా నిలకడైన విజయాలతో దూసుకెళ్తోంది’ అని అన్నాడు. భారత్ సెమీస్ ప్రత్యర్థి న్యూజిలాండ్ కాగా దీనిపై స్పందించిన బంగర్... టీమిండియా తమ ఆటతీరుపైనే దృష్టి పెట్టింది కానీ ప్రత్యర్థి ఎవరనే దానిపై కాదని అన్నాడు. ఈ టోర్నీలో ఇప్పటిదాకా కనబరిచిన ప్రదర్శనను సెమీఫైనల్లోనూ కొనసాగించాలని ఆశిస్తున్నట్లు చెప్పాడు. ప్రత్యర్థి జట్టు బలహీనతలపై దృష్టిపెట్టకుండా తమ జట్టు బలాన్నే నమ్ముకున్నామని బంగర్ అన్నాడు. ఈ సీజన్ ఐపీఎల్ సందర్భంగా ముంబై సహచరుడు, సీనియర్ క్రికెటర్ యువరాజ్ సింగ్ తనతో పంచుకున్న అనుభవాలు, ఇచ్చిన సూచనలే తన రాణింపునకు దోహదం చేశాయని మరోవైపు రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. ‘యువీ నాకు పెద్దన్నలాంటివాడు. మేం ఎప్పుడు మాట్లాడుకున్నా క్రికెట్ గురించే! 2011 ప్రపంచకప్‌లో తను ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడో నాకు వివరించాడు. ఓపిగ్గా ఆడటంపై దృష్టిపెట్టాలని సూచించాడు. ఇవన్నీ నాకిపుడు బాగా ఉపయోగపడ్డాయి’ అని రోహిత్ అన్నాడు.

**‘హిట్‌మ్యాన్’తో కెప్టెన్ ఇంటర్వ్యూ...**

ఓపెనర్ రోహిత్ శర్మ ఐదో సెంచరీతో భారత్ ఏడో విజయం సాధించాక కెప్టెన్ కోహ్లి... తన వైస్‌కెప్టెన్ రో‘హిట్‌మ్యాన్’ను సరదాగా ఇంటర్వ్యూ చేశాడు. ఐదు శతకాల ఆటతీరుపై స్పందన ఏంటని కోహ్లి అడిగితే ‘క్రికెటర్‌గా మేం గతాన్ని పట్టించుకోం. ప్రస్తుతం జరిగేదే మాకవసరం. ఇప్పుడు నేనూ అదే చేస్తున్నాను. ప్రస్తుత పరిస్థితి, ఫామ్ కొనసాగడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టాను. బ్యాటింగ్‌లో జట్టును ఇలా ముందుండి నడిపించాలని ఆశిస్తున్నా. ఈ ప్రపంచకప్ ముఖ్యమైన టోర్నమెంట్. ఇందులో జట్టు రాణించడం బాగుంది. ఓ టాపార్డర్ బ్యాట్స్‌మన్‌గా, ఓపెనర్‌గా నా బాధ్యతేంటో నాకు తెలుసు. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై సెంచరీ కొట్టాక... ఇకపై కూడా ఇలాంటి ప్రదర్శనే కనబరచాలని భావించాను’ అని అన్నాడు.

## వినేశ్ పసిడి పట్టు



**మాడ్రిడ్:** స్పెయిన్ రెజ్లింగ్ గ్రాండ్‌ప్రిలో భారత మహిళా రెజ్లర్లు ఆరు పతకాలతో సత్తా చాటారు. జకార్తా ఆసియా క్రీడల చాంపియన్ వినేశ్ ఫొగాట్ (53 కేజీలు), దివ్య కక్రాన్ (68 కేజీలు) పసిడి పతకాలు సాధించగా, పూజ దండా (57 కేజీలు), సీమా (50 కేజీలు), మంజు కుమారి (59 కేజీలు), కిరణ్ (76 కేజీలు) రజత పతకాలు సాధించారు. ఫైనల్స్‌లో జెస్సికా బ్లాస్కా (నెదర్లాండ్స్)పై వినేశ్; అగ్నెస్కా వీస్‌జెజెక్ (పోలాండ్)పై దివ్య గెలుపొందగా... వెరోనికా చుమికోవా (రష్యా) చేతిలో పూజ, ఇవోనా (పోలాండ్) చేతిలో సీమా, లియుబోవ్ ఒవ్‌చరోవా (రష్యా) చేతిలో మంజు, సెనియా బురకోవా (రష్యా) చేతిలో కిరణ్ ఓడిపోయారు. ఈ టోర్నీలో భారత్ 130 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. రష్యా 165 పాయింట్లతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

### కెనడా ఓపెన్ ఫైనల్లో కశ్యప్



**కాల్గరి:** ఎట్టకేలకు ఈ ఏడాది తొలిసారి ఓ టోర్నమెంట్‌లో భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్ ఫైనల్లోకి ప్రవేశించాడు. కెనడా ఓపెన్ సూపర్-100 టోర్నమెంట్‌లో ఈ హైదరాబాద్ ప్లేయర్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. ఈ ఏడాది ఇప్పటివరకు తొమ్మిది టోర్నీల్లో ఆడిన కశ్యప్ ఏ ఒక్క టోర్నీలోనూ ఫైనల్ బెర్త్ దక్కించుకోలేకపోయాడు. కానీ కెనడా ఓపెన్‌లో మాత్రం ఆద్యంతం నిలకడగా రాణిస్తూ టైటిల్‌కు విజయం దూరంలో నిలిచాడు. 70 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 36వ ర్యాంకర్ కశ్యప్ 14-21, 21-17, 21-18తో నాలుగో సీడ్ వాంగ్ జు వీ (చైనీస్ తైపీ)పై సంచలన విజయాన్ని నమోదు చేశాడు. ఫైనల్లో చైనా షట్లర్, ప్రపంచ 126వ ర్యాంకర్ లీ షి ఫెంగ్‌తో కశ్యప్ తలపడతాడు.

### రన్నరప్ శ్రీకృష్ణప్రియ



**సాక్షి, హైదరాబాద్:** కోట్ డి ఐవరీ ఓపెన్ అంతర్జాతీయ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి కుదరవల్లి శ్రీకృష్ణప్రియ రన్నరప్‌గా నిలిచింది. ఐవరీకోస్ట్‌లో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 82వ ర్యాంకర్ శ్రీకృష్ణప్రియ 17-21, 13-21తో ప్రపంచ 101వ ర్యాంకర్ థెట్ తార్ తుజర్ (మయన్మార్) చేతిలో ఓడిపోయింది. ఫైనల్ చేరే క్రమంలో తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోని శ్రీకృష్ణప్రియ టైటిల్ పోరులో మాత్రం తడబడింది. తదుపరి శ్రీకృష్ణప్రియ ఈనెల తొమ్మిదిన మొదలయ్యే యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నమెంట్‌లో బరిలోకి దిగనుంది. తొలి రౌండ్‌లో ఆమె కిమ్ గా యున్ (దక్షిణ కొరియా)తో ఆడుతుంది.

### ప్రపంచ అమెచ్యూర్ చెస్‌లో సంధ్యకు రజతం



**సాక్షి, విజయవాడ:** ప్రపంచ అమెచ్యూర్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి గోలి సంధ్య మహిళల విభాగంలో రజత పతకం సాధించింది. మెక్సికోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో అండర్-2300 ఎలో రేటింగ్ ఓపెన్ విభాగంలో పాల్గొన్న సంధ్య నాలుగు పాయింట్లు సాధించింది. ఓపెన్ కేటగిరీలో మొత్తం 27 మంది పాల్గొన్నారు. చివరిదైన తొమ్మిదో రౌండ్ తర్వాత బరిలో ఉన్న ఐదుగురు మహిళా క్రీడాకారిణులు సాధించిన పాయింట్ల ఆధారంగా వారికి ప్రత్యేకంగా పతకాలు అందజేశారు. అలెగ్జాండ్రా జెరెబెత్సోవా (రష్యా-5 పాయింట్లు) స్వర్ణం సాధించగా... పాల్మెరో మార్టినెజ్ రాచెల్ (క్యూబా-4 పాయింట్లు) కాంస్యం కైవసం చేసుకుంది. సంధ్య, పాల్మెరో నాలుగు పాయింట్లతో సమంగా నిలిచినా మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా సంధ్యకు రజతం లభించింది.

## స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 395 ▼ | 136 ▼ |
| 39,513 | 11,811 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,162 | ▼ | 8 |
| డోజోన్స్ | 26,922 | ▼ | 44 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,553 | ▼ | 50 |
| డాక్స్ | 12,568 | ▼ | 61 |
| షాంఘై | 3,011 | ▲ | 5 |
| నికాయ్ | 21,746 | ▲ | 44 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 67.80 | 69.44 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.78 | 87.91 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.00 | 78.88 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.42 | 64.84 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.19 | 49.34 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.72 | 51.49 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.07 | 19.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.39 | 10.75 |

# రిటైర్మెంట్‌కు ఎంత కావాలి?



- ఇందుకోసం ఎన్నో సూత్రీకరణలు
- 60 ఏళ్ల నాటికి జీవన వ్యయాలే కీలకం
- కనీసం వార్షిక ఖర్చులకు 28–30 రెట్లు అవసరం
- సంపాదన ఆరంభించిన నాటి నుంచే ప్రణాళిక
- అప్పుడే దీర్ఘకాలంలో తగినంత నిధి ఏర్పడుతుంది

*ఈ తరం వారికి రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ వచ్చే సదుపాయాలు ఉండడం లేదు. ప్రైవేటు రంగంలోని వారికి ఈపీఎఫ్ ఉన్నా కానీ, అదేమంత సరిపోయే మొత్తం కాదు. ప్రభుత్వరంగంలోని వారిని మినహాయించి చూస్తే, మిగిలిన వారు ఉద్యోగ జీవితం ముగిసిన తర్వాత తమ జీవన అవసరాల కోసం అవసరమైనంత నిధి ఏర్పాటుకు ముందు నుంచే చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం. అయితే, మలి జీవితం భద్రత దృష్ట్యా ఎంత మొత్తం పొదుపు చేయాలన్నది అందరికీ అర్థమయ్యే విషయం కాదు. అయితే, ఇందుకు ఆర్థిక నిపుణులు కొన్ని రకాల లెక్కింపు విధానాలను సూచించారు. వాటి ఆధారంగా ఎవరికి వారు తమ రిటైర్మెంట్ అనంతర జీవితం కోసం ప్రణాళిక రూపొందించుకోవచ్చు.*






## 30 యేళ్ల అవసరాలకు అనుగుణంగా




60 ఏళ్లు వచ్చే సరికి తదుపరి జీవన అవసరాలకు ఎంత కావాలో లెక్క వేసుకోవడం అన్నది కొంచెం కష్టమైన పని. ఎందుకంటే ఎంత కాలం జీవిస్తారు, ఏవైనా ఆరోగ్య సమస్యలు చుట్టు ముడతాయా? అన్న అంశాలపై కావాల్సిన మొత్తం ఆధారపడి ఉంటుంది. కనీసం 90 ఏళ్ల పాటు జీవించి ఉంటామన్న అంచనాకు తగ్గట్టు ప్రణాళిక రూపొందించుకోవడం సరైన దిగా నిపుణుల సూచన. రిటైర్మెంట్ తర్వాత అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న నిధి ఎంత లేదన్నా కనీసం 25–30 ఏళ్ల అవసరాలకు కావాల్సి ఉంటుంది. 60 ఏళ్ల వయసులో నెలకు రూ.లక్ష ఆదాయం కోరుకుంటే, రిటైర్మెంట్ నిధిగా కనీసం రూ.2.57 కోట్లు అవసరం అవుతాయి.

## పెట్టుబడులపై ఆచితూచి...




**క**నుక అధిక అవసరాల నేపథ్యంలో ఈక్విటీ వంటి అధిక వృద్ధి చూపించే పెట్టుబడులు అవసరం. చిన్న వయసు నుంచే ఈక్విటీల్లో కొంత మేర రిటైర్మెంట్ నిధి కోసం ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలి. చాలా మంది నిపుణులు 100 నుంచి తమ వయసును మినహాయించగా, వచ్చేంత ఈక్విటీలకు కేటాయింపులు చేసుకోవచ్చని సూచిస్తుంటారు. అలాగే, రిటైర్మెంట్‌కు వచ్చిన వెంటనే ఈక్విటీలోని పెట్టుబడులను పూర్తిగా డెట్ విభాగానికి మళ్లించాలన్నది ఇప్పటి పరిస్థితుల్లో సరైనది కాదని నిపుణులు పేర్కొంటున్నారు. 60 ఏళ్ల వయసులోనూ తమ వద్దనున్న నిధిలో 40 శాతాన్ని ఈక్విటీలకు, 70 ఏళ్ల వయసులో 30 శాతాన్ని కేటాయించుకోవచ్చన్నది సూచన. సెన్సెక్స్ దీర్ఘకాలంలో సగటున 14 శాతం రాబడులను ఇచ్చింది. కొంచెం రిస్క్ తక్కువ కోణంలో ఆలోచించినా దీర్ఘకాలంలో 12 శాతం రాబడులు ఉంటాయన్నది నిపుణుల అంచనా. డెట్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో రాబడులు 8 శాతం ఉంటాయి. ద్రవ్యోల్బణ దీర్ఘకాల సగటు 6 శాతం మినహాయిస్తే వాస్తవ రాబడులు 2 శాతంగానే అనుకోవాలి.

## ఖర్చులు రెండు భాగాలు

**రి**టైర్మెంట్ సమయంలో వ్యయాలు ఎంత మేర ఉంటాయన్నది లెక్కించాలి. జాబితాగా రాసుకోవాలి. కిరాణా, యుటిలిటీ బిల్లులు (రిటైర్మెంట్ తర్వాత కూడా ఉండేవి) ఇవి ఒకరకం. రోజువారీ ఉద్యోగానికి వెళ్లి వచ్చేందుకు అయ్యే వ్యయాలు, వృత్తిరీత్యా ధరించాల్సిన దుస్తులు, ఇంటి రుణానికి చెల్లించే ఈఎంఐ ఇవన్నీ రిటైర్మెంట్‌తో ముగిసిపోతాయి కనుక ఇవి మరో భాగంగా రాసుకోవాలి. వైద్య వ్యయాలు రిటైర్మెంట్ తర్వాత గణనీయంగా పెరిగిపోతాయి. దీంతో భవిష్యత్తులో వ్యయాలు ఇంకా పెరిగిపోవచ్చని, ప్రస్తుత స్థాయి ఖర్చులను కూడా రిటైర్మెంట్ తర్వాత బెంచ్ మార్క్‌గా తీసుకోవాలని సిన ర్జీ క్యాపిటల్ సర్వీసెస్ ఎండీ విక్రమ్ దలాల్ పేర్కొన్నారు. ప్రస్తుతమున్నంత ఖర్చులకు తగ్గకుండానే రిటైర్మెంట్ సమయంలోనూ ఉంటాయన్నారు.

## రిటైర్మెంట్ తర్వాత ఆదాయం



**ఉ**ద్యోగ జీవితానికి విరమణ చెప్పిన తర్వాత మీకొచ్చే మొత్తం ఆదాయం ఎంతో అంచనా వేసుకోవాలి. ఈపీఎస్ లేదా ఇతర పెన్షన్ సాధనాల రూపంలో నెలవారీగా ఆదాయం వచ్చేందుకు ఏర్పాటు ఉంటే దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. మీకేమైనా ప్రాపర్టీలు ఉంటే వాటిపై వచ్చే అద్దె ఆదాయం కూడా కలుపుకోవాలి. మొత్తం ఖర్చులకు సరిపడా నికర నెలవారీ ఆదాయం కూడా ఉండాలి. లేదంటే అదనంగా మీరు సమకూర్చుకోవాలని అర్థం. అందుకని నేటి రోజుల్లో 60 ఏళ్లకే అందరూ పనికి సెలవు చెప్పేయడం లేదు. ఆ తర్వాత కూడా ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు చేస్తూనే ఉన్నారు. స్వయం ఉపాధిలో ఉన్న వారు కూడా తమ శరీరం సహకరించేంత కాలం వాటిని చక్కగానే కొనసాగిస్తున్నారు. అందుకని రిటైర్మెంట్ నాటికి హాయిగా విశ్రాంతి తీసుకుని, తమకు ఎదురయ్యే ఖర్చులకు సరిపడా ఆదాయం సమకూర్చుకుంటే సరి. లేదంటే రిటైర్మెంట్ తర్వాత కూడా కనీసం ఓ ఐదేళ్లపాటు ఆదాయ మార్గాలను చూసుకోవడం మంచి ఆలోచనే.

## ద్రవ్యోల్బణం ప్రభావం



**అ**దనంగా కావాల్సింది చిన్న మొత్తంగానే ఇప్పుడు అనిపించొచ్చు. కానీ, మీరు రిటైర్ అయ్యే నాటికి ద్రవ్యోల్బణ ప్రభావంతో కావాల్సిన మొత్తం భారీగా పెరిగిపోతుందన్నది మరవద్దు. దీర్ఘకాలంలో సగటు వార్షిక ద్రవ్యోల్బణ ప్రభావాన్ని 6 శాతంగా పరిగణనలోకి తీసుకుని ఎంత కావాలన్నది అంచనాకు రావచ్చు. ఉదాహరణకు 6 శాతం ద్రవ్యోల్బణ రేటు ప్రకారం చూస్తే... ఇప్పుడు నెలవారీ రూ.లక్ష అవసరం అవుతుంటే, మరో 30 ఏళ్ల తర్వాత రూ.5.74 లక్షలు కావాల్సి ఉంటుంది.

## దీర్ఘకాలంలో కాంపౌండింగ్‌తో లాభం



**మ**రి మన భారతీయుల జీవన అవసరాల ప్రకారం... 90ఏళ్ల ఆయుర్దాయం అనుకుంటే, రిటైర్మెంట్ తర్వాత 30 ఏళ్ల జీవన అవసరాల కోసం, 7 శాతం ద్రవ్యోల్బణ ప్రభావం, పన్ను అనంతరం రాబడులు 8 శాతం అంచనా ప్రకారం ఎంత లేదన్నా కనీసం వార్షిక ఖర్చులకు 28 రెట్ల మేర సమకూర్చుకోవాలన్నది ఓ సూత్రం. రాబడుల రేటు తక్కువగా ఉంటే, రిస్క్ తీసుకోని వారు రిటైర్మెంట్ అయ్యే నాటికి వార్షిక ఖర్చులకు కనీసం 30–33 రెట్ల మేర సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అంటే ఏటా మూడు శాతం ఉపసంహరణకు వీలుంటుంది. అందుకే ఉద్యోగం లేదా సంపాదన ఆరంభమైన ఏడాది నుంచే రిటైర్మెంట్ తర్వాత జీవన అవసరాల కోసం తగిన ప్రణాళిక వేసుకుని, ఏటా ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో కాంపౌండింగ్ కారణంగా అవసరమైనంత నిధిని సులభంగానే సమకూర్చుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## అసలు ఎంత కావాలి...




**ని**జానికి రిటైర్మెంట్ తర్వాత ఎంత కావాలనే విషయమై అమెరికాలో ఆర్థిక నిపుణులు కొన్ని సూత్రాలను రూపొందించారు. ఫిడెలిటీ సంస్థ రిటైర్మెంట్ నాటికి ఒకరి వార్షిక ఆదాయానికి పది రెట్ల మొత్తం సమకూర్చుకుంటే తర్వాతి జీవిత అవసరాలను అధిగమించొచ్చని అధ్యయనం ద్వారా తేల్చింది. ఈ ప్రకారం 30 ఏళ్ల వయసుకు వచ్చే సరికి వార్షికాదాయానికి కనీసం ఒక రెట్టు మొత్తాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. 40 ఏళ్లు వచ్చే సరికి మూడు రెట్ల మొత్తం కావాలి. 50 ఏళ్లకు ఆరు రెట్లు, 60 ఏళ్లకు తొమ్మిది నుంచి పది రెట్ల మొత్తాన్ని సమకూర్చుకునే ప్రణాళిక రూపొందించుకుని, అమలు చేస్తే సరి. అయితే, ఇది అమెరికన్ అవసరాలకు తగ్గట్టుగా రూపొందించిందని గుర్తుంచుకోవాలి. ఇక ట్రినిటీ యూనివర్సిటీకి చెందిన ఫైనాన్స్ నిపుణులు రూపొందించిన 4 శాతం సూత్రాన్ని కూడా తెలుసుకోవాల్సిందే. అంటే రిటైర్మెంట్ తర్వాత స్టాక్స్‌లో పెట్టుబడులను ఒకేసారి తీసుకోవడం కాకుండా ఏటా 4 శాతం చొప్పున వెనక్కి తీసుకోవాలి. ద్రవ్యోల్బణ రేటుకు సర్దుబాటు చేసిన తర్వాత ఎంత శాతాన్ని వెనక్కి తీసుకోవాలన్నది ఎవరికి వారు నిర్ణయించుకోవచ్చు. మరికొందరు నిపుణుల సూత్రీకరణ ప్రకారం రిటైర్మెంట్ సమయంలో వార్షిక ఖర్చులు ఎంతున్నాయో, దానికి 25 రెట్లకు సరిపడా నిధి ఉంటే జీవన అవసరాలను గట్టెక్కవచ్చన్నది అంచనా. ఉదాహరణకు పదవీ విరమణ సమయానికి రూ.12 లక్షలు వార్షిక ఖర్చులుగా ఉన్నాయనుకుంటే కనీసం రూ.2.1 కోట్లు కావాల్సి వస్తుంది. అయితే, ఇవన్నీ అమెరికా అవసరాలకు అనుగుణంగా అక్కడి సంస్థలు, నిపుణులు రూపొందించిన అవసరాలు.

# నివాస గృహ మార్కెట్‌కు పూర్వవైభవం!



రవి నారాయణన్
సెక్యూర్డ్ అసెట్స్ హెడ్, ఐసీఐసీఐ బ్యాంకు

*భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో గత కొన్నేళ్లల్లో వృద్ధి నెమ్మదించింది. రెరా, జీఎస్‌టీ వంటివి రియల్ ఎస్టేట్ రంగం కొలుకోవడానికి కీలకమైన అంశాలు. రెరా, జీఎస్‌టీ అమలు చేసిన తర్వాత దేశంలోని 8 ప్రధాన పట్టణాల్లో 2018లో గృహాల అమ్మకాల్లో 6 శాతం వృద్ధి అంచనాలు వెలువడ్డాయి. 2017తో పోలిస్తే 2018లో 75 శాతం కొత్త ప్రాజెక్టుల్లో అమ్మకాలు జరగ్గా, అమ్ముడు కాని ప్రాజెక్టులు 11 శాతానికి తగ్గాయి. ప్రస్తుతం, గృహ, వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో వృద్ధి కనిపిస్తోంది. దేశంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ 2030 నాటికి ట్రిలియన్ డాలర్లుగా ఉండొచ్చని ఒక అంచనా. ఈ రంగం సానుకూలంగా మారడానికి కారణమైన అంశాలను పరిశీలిస్తే...*

### రెరా, జీఎస్‌టీ

2016లో రెరా చట్టం, 2017లో జీఎస్‌టీ అమల్లోకి వచ్చింది. ఇవి రియల్ ఎస్టేట్ రంగంలో పెనుమార్పులకు నాంది పలికాయి. ఈ నిర్మాణాత్మక సంస్కరణలు నియంత్రణ విధానాన్ని బలోపేతం చేశాయి. అంతేకాకుండా మార్కెట్ స్థిరీకరణకు ఉపయోగపడ్డాయి. దీంతో స్థిరమైన వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు ఇవి తోడ్పడ్డాయి. కొనుగోలుదారులకు సాధికారత కల్పించడం ద్వారా గృహాలకు డిమాండ్ గణనీయంగా వృద్ధి చెందడంలో రెరా సహాయపడింది. తద్వారా ఈ రంగంలో సీరియస్‌గా పనిచేసే సంస్థలు ముందు నిలవడంలో సాయపడుతుంది. సమయానికి ప్రాజెక్టు పూర్తి అవుతుందన్న భరోసాతోపాటు వినియోగదారుల్లో ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. ఇప్పటికీ ఈ పరిశ్రమ మార్పుల దశలో ఉండగా, దీర్ఘకాలంలో మాత్రం బాగా వృద్ధి చెందనుంది. జీఎస్‌టీ సైతం ఇప్పుడు రియల్ ఎస్టేట్ మార్కెట్ పునరుద్ధరణలో అతి కీలకమైన పాత్ర పోషిస్తోంది. పారదర్శకత, జవాబుదారీతనం, సరళీకృత పన్నుల విధానం సాధ్యమవుతాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అమల్లోకి వచ్చింది. ఇది ఈ రంగానికి మరింత ఊతమివ్వడంతోపాటు గృహాలకు డిమాండ్‌ను సైతం పెంచుతుంది. ప్రీమియం గృహ విభాగంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు ఇప్పుడు జీఎస్‌టీ 5 శాతంగా ఉంది. గతంలో ఇది 12 శాతంగా ఉండేది. అందుబాటు ధరల గృహాలకు ఇది 8 శాతం నుంచి 1 శాతానికి తగ్గింది. జీఎస్‌టీ కౌన్సిల్ ఇప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సిస్టమ్‌ను అమలు చేస్తుండడం వల్ల కొనుగోలుదారుల సెంటిమెంట్ గణనీయంగా పెరగనుంది.

### అందుబాటులో గృహ విభాగం

నిర్మాణాత్మక సంస్కరణలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల కొనుగోలుదారులు ముందుకు రావడంతో ఈ రంగంలో రికవరీ సాధ్యమయింది. స్టాండర్డ్ డిడక్షన్ రూ.40వేల నుంచి రూ.50వేలకు పెరగడం, రూ.5 లక్షల్లోపు ఆదాయం కలిగిన వారికి పూర్తి పన్ను రాయితీ, మౌలిక వసతులు, కనెక్టివిటీ అన్నవి మెరుగైన పెట్టుబడులకు కారణమయ్యాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్‌లో నివాసిత ప్రాజెక్టుల విభాగం వృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం 2022 నాటికి అందరికీ ఇళ్లు అన్న లక్ష్యమే కారణం. అందుబాటు ధరల గృహ వినియోగదారులు రానున్న కాలంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ వృద్ధికి తోడ్పడనున్నారు.



### మధ్య తరగతికి ప్రయోజనాలు

**అం**దుబాటులో గృహ విభాగంలో ఇప్పటికే పెట్టుబడులు కూడా పెరిగాయి. 2018లో నూతన సరఫరాలో ఇది 41 శాతంగా ఉంది. ప్రభుత్వం ఇప్పుడు క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకాన్ని 2020 మార్చి వరకు పొడిగించింది. దీని ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు (ఈడబ్ల్యూఎస్), అల్పాదాయ వర్గాలు (ఎల్ఐజీ), మధ్యతరగతి వర్గాల (ఎంఐజీ) వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా వడ్డీ రాయితీలు అందిస్తున్నారు. 2019 ఏప్రిల్ నాటికి 4.45 లక్షల కుటుంబాలకు రూ.10వేల కోట్ల రాయితీని క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ ద్వారా అందించారు. గృహ రుణ రాయితీలు, స్వల్ప జీఎస్‌టీ ధరల నుంచి అధిక శాతం కొనుగోలుదారులు ప్రయోజనం పొందుతున్నారు. స్టూడెంట్ హౌసింగ్ వంటి నూతన అస్సెట్ క్లాసెస్ పెరుగుతుండడంతో నివాసిత రియల్ ఎస్టేట్ మార్కెట్ కోలుకునేందుకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జూలై-5-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 7 | 7.3 | 7.25 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.5 | 7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.75 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.7 | 6.7 | 6.4 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.5 | 6.65 | 6.45 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.35 | 7 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.75 | 7 | 7.25 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.25 | 6.85 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7.25 | 7.75 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 7 | 7.2 | 7 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.5 | 6.85 | 6.75 |
| ఎస్‌బీఐ | 6.4 | 7 | 6.7 |
| సిండికేట్ బ్యాంక్ | 6.35 | 7.05 | 7.15 |
| పీఎన్‌బీ | 6.75 | 6.85 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.75 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# లార్జ్‌క్యాప్‌లో సుదీర్ఘ అనుభవం

### హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 100




**ఈ**క్విటీ మార్కెట్లలో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. రాబడులు కూడా అలానే ఉంటాయి మరి. అయితే, ఈక్విటీల్లో రిస్క్ కొంత తక్కువ ఉండాలనుకునే వారికి లార్జ్‌క్యాప్ విభాగం అనుకూలం. లార్జ్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారి ముందున్న ఎంపికల్లో హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 100 మ్యూచువల్ ఫండ్ పథకం కూడా ఒకటి. ఈ పథకానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. మార్కెట్ పతనాలను ఎన్నింటినో చూసి ఉన్నది. రాబడుల విషయంలో మంచి ట్రాక్ రికార్డు కూడా ఈ పథకంలో గమనించొచ్చు.

**రాబడులు**

ఈ పథకం గత ఏడాది కాలంలో మంచి పనితీరు ప్రదర్శించింది. ఎందుకంటే గత ఏడాది, ఏడాదిన్నర కాలంలో ప్రధానంగా బ్లూచిప్ కంపెనీలు మంచి ప్రదర్శన చూపడమే. లార్జ్‌క్యాప్ ఈక్విటీ డైవర్సిఫైడ్ విభాగంలో ఉత్తమ పనితీరు చూపించిన పథకం ఇదే కావడం గమనార్హం. గత ఏడాది కాలంలో పోటీ పథకాలైన యాక్సిస్ బ్లూచిప్ ఫండ్, రిలయన్స్ లార్జ్ క్యాప్, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఫ్రంట్‌లైన్ ఈక్విటీ కంటే హెచ్‌డీఎఫ్‌సీ టాప్100 ముందున్నది. మూడేళ్లలో ఈ పథకం వార్షికంగా 16.2 శాతం, ఐదేళ్లలో వార్షికంగా 10.9 శాతం, పదేళ్లలో 13.4 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు ప్రతిఫలాన్నిచ్చింది. నిఫ్టీ 100 మూడేళ్లలో 14.8 శాతం, ఐదేళ్లలో వార్షికంగా 11.3 శాతం చొప్పున ఉన్నాయి. సుదీర్ఘకాలంగా మార్కెట్లో ఉన్న ఈ పథకం 2015, 2016 సంవత్సరాల్లో మాత్రం ఆశించిన పనితీరు చూపలేదు. కానీ, 2017లో మాత్రం తిరిగి మంచి పనితీరుతో ముందున్నది. తక్కువ రిస్క్ కోరుకునే వారు ఈ పథకంలో దీర్ఘకాలం పాటు, సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవడం వల్ల రిస్క్‌ను అధిగమించి మెరుగైన రాబడులు పొందడానికి అవకాశం ఉంటుంది.

**పోర్ట్‌ఫోలియో, విధానం**

ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ స్టాక్స్ ఎన్నో ఏళ్ల ర్యాలీ అనంతరం ఈ పథకం తన ప్రాధాన్యంలో మార్పు చేసింది. కార్పొరేట్ బ్యాంకులు, ఇండస్ట్రియల్స్, యుటిలిటీలు, ఐటీ రంగాలకు 2017లో ప్రాధాన్యాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ఈ రంగాల్లోనే ఎక్కువ ఎక్స్‌పోజర్ కలిగి ఉంది. ఎఫ్‌ఎంసీజీ, ఆటో రంగాల్లో స్టాక్స్ వ్యాల్యూషన్లు ఎక్కువగా ఉండడం, డిమాండ్ బలహీనంగా ఉండడం వంటి కారణాలతో తక్కువ వెయిటేజీ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో 50 స్టాక్స్ ఉన్నాయి. మొత్తం పెట్టుబడుల్లో 97.44 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన మొత్తాన్ని నగదు నిల్వల రూపంలో కలిగి ఉంది. బ్లూచిప్ కంపెనీలకు 90.5 శాతం వరకు పెట్టుబడులను కేటాయించగా, మరో 9.5 శాతం మేర మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలకు పెద్ద పీట వేసింది. ఈ రంగాల్లో 37.5 శాతం పెట్టుబడులు పెట్టింది. ఆ తర్వాత ఎనర్జీ స్టాక్స్‌కు 23.69 శాతం, టెక్నాలజీకి 13 శాతం పెట్టుబడులను కేటాయించింది.

### టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| ఐసీఐసీఐ బ్యాంకు | 8.10 |
| ఎస్‌బీఐ | 7.96 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 7.15 |
| ఇన్ఫోసిస్ | 6.64 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 6.63 |
| ఎల్‌అండ్‌టీ | 6.29 |
| ఎన్‌టీపీసీ | 4.35 |
| ఐటీసీ | 4.09 |
| టీసీఎస్ | 4.03 |
| యాక్సిస్ బ్యాంకు | 3.77 |



ఒక వ్యాపారవేత్త విజయాలకన్నా...
అపజయాల నుంచే ఎక్కువ నేర్చుకోగలుగుతాడు!
- కెవిన్ పీ.రెయాన్, గిల్ట్ గ్రూప్ వ్యవస్థాపకులు

## బొమ్మ-బొరుసు



# పీఎన్‌బీకి మరో షాక్!!

**రూ. 3,805 కోట్లు మోసం చేసిన భూషణ్ పవర్ అండ్ స్టీల్**



**న్యూఢిల్లీ:** నీరవ్ మోదీ ఫ్రాడ్ నుంచి తేరుకునేందుకు నానా తంటాలు పడుతున్న ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)కి మరో షాక్ తగిలింది. తాజాగా దివాలా తీసిన భూషణ్ పవర్ అండ్ స్టీల్ (బీపీఎస్ఎల్) సంస్థ దాదాపు రూ. 3,805.15 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు పీఎన్‌బీ వెల్లడించింది. ఖాతాల్లో అంకెల గారడీతో బ్యాంకుల కన్సార్షియం నుంచి రుణాలు పొందిన బీపీఎస్ఎల్.. ఆ నిధులను దుర్వినియోగం చేసిందని ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెల్లడైనట్లు పీఎన్‌బీ పేర్కొంది. 'ఫోరెన్సిక్ ఆడిట్ విచారణలో తేలిన అంశాల ప్రాతిపదికన నిధుల మళ్లింపు అభియోగాలతో బీపీఎస్ఎల్, దాని డైరెక్టర్లపై సీబీఐ సుమోటో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీన్ని ఆర్‌బీఐకి నివేదించాం' అని పేర్కొంది. అయితే, ఈ ఖాతాకు సంబంధించి నిబంధనల ప్రకారం ఇప్పటికే రూ. 1,932 కోట్ల మేర కేటాయింపులు జరిపినట్లు పీఎన్‌బీ తెలిపింది. బీపీఎస్ఎల్ దేశీయంగా చండీగఢ్‌లోని పీఎన్‌బీ కార్పొరేట్ బ్రాంచ్ నుంచి రూ. 3,192 కోట్లు, విదేశీ శాఖల (దుబాయ్, హాంకాంగ్) నుంచి రూ.614 కోట్లు రుణాలుగా తీసుకుంది. ప్రస్తుతం దివాలా తీసిన బీపీఎస్ఎల్ కేసు విచారణ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో తుది దశలో ఉందని, ఈ ఖాతా నుంచి పెద్ద మొత్తమే రాబట్టుకోగలమని ఆశిస్తున్నామని పీఎన్‌బీ వివరించింది. వజ్రాభరణాల వ్యాపారులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరులు పీఎన్‌బీని దాదాపు రూ. 13,500 కోట్ల మేర మోసగించిన సంగతి తెలిసిందే.

# నేడు ఆర్‌బీఐ బోర్డు సభ్యులతో సీతారామన్ భేటీ

**బడ్జెట్‌లో చర్యలపై చర్చ...**

**న్యూఢిల్లీ:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం(నేడు) రిజర్వ్ బ్యాంక్ కేంద్ర బోర్డు సభ్యులతో సమావేశం కానున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కీలక అంశాలను ఈ సందర్భంగా ఆమె ఆర్‌బీఐకి వివరించనున్నారు. ఆర్థిక క్రమశిక్షణకు కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యం ఇందులో ప్రధానంగా చర్చకు రానుంది. ఈ ఏడాది(2019–20) ద్రవ్యలోటు లక్ష్యాన్ని 3.4 శాతం నుంచి 3.3 శాతానికి తాజా పూర్తిస్థాయి బడ్జెట్‌లో తగ్గించిన సంగతి తెలిసిందే. మధ్యంతర బడ్జెట్‌లో అంచనాలతో పోలిస్తే



నికరంగా రూ.6,000 కోట్లు ఖజానాకు అదనంగా సమకూరనుండటంతో ఇది సాధ్యమైంది. అదేవిధంగా వచ్చే ఆర్థిక సంవత్సరం(2020–21) ద్రవ్యలోటు లక్ష్యాన్ని కూడా జీడీపీలో 3 శాతానికి కట్టడి చేయడం, ప్రాథమిక లోటును పూర్తిగా తొలగించడం వంటి అంశాలతో రోడ్‌మ్యాప్‌ను సీతారామన్ ప్రకటించారు. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పేర్కొంటారు. అదేవిధంగా ద్రవ్యలోటు నుంచి కేంద్రం చెల్లించాల్సిన వడ్డీలను మినహాయిస్తే, మిగిలిన లోటును ప్రాథమిక లోటుగా వ్యవహరిస్తారు. ఇక ఆర్‌బీఐ మిగులు నిధుల విషయానికొస్తే.. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రానికి రూ.90,000 కోట్లను డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు అంచనా. గతేడాదితో పోలిస్తే( రూ.68,000 కోట్లు) ఇది 32 శాతం అదనం. అంతే కాదు ఇప్పటిదాకా ఆర్‌బీఐ నుంచి కేంద్రం అందుకున్న అత్యధిక డివిడెండ్‌గా కూడా ఇది నిలవనుంది.

## ఆర్బిట్రల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించండి

**జీవీకేకు సూచించిన ఢిల్లీ హైకోర్టు**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** బిడ్ సర్వీసెస్ కేసులో మధ్యంతర ఉపశమనం కోసం ఆర్బిట్రల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించుకోవచ్చని జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌కు ఢిల్లీ హైకోర్టు అనుమతినిచ్చింది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో తనకున్న 13.5 శాతం వాటాను థర్డ్ పార్టీకి విక్రయించుకోవచ్చని ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జ్ బెంచ్ ఇటీవల బిడ్ సర్వీసెస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ జీవీకే కోర్టును ఆశ్రయించింది. ఆర్బిట్రేషన్ యాక్టు సెక్షన్ 9 కింద ఆర్బిట్రల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించుకోవచ్చని జస్టిస్ ఎస్. మురళీధర్, జస్టిస్ తల్వంత్ సింగ్‌ల డివిజన్ బెంచ్ ఈ మేరకు జీవీకేను సూచించింది. బిడ్ సర్వీసెస్–జీవీకే కేసు పెండింగులో ఉన్న సమయంలో ఇరు పార్టీలు ఆర్బిట్రేటర్లను నామినేట్ చేశాయి. ముగ్గురు సభ్యులతో ఇప్పటికే ఈ ట్రిబ్యునల్ ఏర్పాటై ఉంది. జూలై 9న ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ తొలిసారిగా సమావేశం కానుంది. ఆర్బిట్రల్ యాక్టు సెక్షన్ 17 ప్రకారం ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ ఇటువంటి దరఖాస్తులను స్వీకరించవచ్చని, జూలై 9నే వేగవంతమైన పరిష్కారం చూపవచ్చని న్యాయమూర్తులు తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## స్టార్టప్స్‌కు తగ్గనున్న నియంత్రణ భారం



**న్యూఢిల్లీ:** బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలతో స్టార్టప్ సంస్థలకు నియంత్రణ సంస్థలు, పన్నుల శాఖ నిబంధనల పాటింపు విషయంలో భారం కాస్త తగ్గుతుందని ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కునాల్ బెహల్ తెలిపారు. ఏంజెల్ ట్యాక్స్‌కు సంబంధించి షేర్ల వేల్యుయేషన్ పరమైన వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టడమనేది స్టార్టప్స్ సంస్థల నిధుల సమీకరణకు తోడ్పడగలదని ఆయన వివరించారు. అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా కొత్తగా అంకుర సంస్థలు ఏర్పాటయ్యేందుకు, ఈ విభాగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బడ్జెట్లో ప్రతిపాదనలు ఉపయోగపడగలవని బెహల్ అభిప్రాయపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఆదాయ పన్ను అసెస్‌మెంట్ కేసులతో పాటు స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదనలు చేసిన సంగతి తెలిసిందే.

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 8-7-2019

| | |
|---|---|
| విశాఖ | 444–00 |
| చిత్తూరు | 468–00 |
| వరంగల్ | 432–00 |
| చెన్నై | 475–00 |
| ముంబై | 484–00 |
| విజయవాడ | 420–00 |
| నమక్కల్ | 465–00 |
| గోదావరి | 420–00 |
| 7-7-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 429–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.90 |

# మార్కెట్‌పై 'బడ్జెట్' ప్రభావం

- ఐఐపీ, ద్రవ్యోల్బణం, కార్పొరేట్ ఫలితాల పాత్ర కూడా
- ఈ వారం మార్కెట్ గమనంపై నిపుణుల అంచనాలు
- 9న టీసీఎస్, 12న ఇన్ఫోసిస్ ఫలితాలు



**న్యూఢిల్లీ:** గత శుక్రవారం బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన కీలక నిర్ణయాలు, ప్రతిపాదనల ప్రభావం ఈ వారం మార్కెట్‌పై ఉంటుందని, అలాగే ఐఐపీ(పారిశ్రామికోత్పత్తి), ద్రవ్యోల్బణం వంటి స్థూల ఆర్థిక గణాంకాలపైనా ఇన్వెస్టర్ల దృష్టి ఉంటుందని అనలిస్టులు అంచనా వేస్తున్నారు. ఇక జూన్ త్రైమాసికానికి సంబంధించి విడుదలయ్యే కంపెనీల ఫలితాలు కూడా మార్కెట్ ట్రెండ్‌ను నిర్ణయించొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నెల 9న టీసీఎస్, 12న ఇన్ఫోసిస్ ఫలితాలు విడుదల కానున్నాయి. అలాగే, బడ్జెట్ నిర్ణయాల నేపథ్యంలో డాలర్‌తో రూపాయి కదలికలు, అంతర్జాతీయ అంశాల ప్రభావం సైతం ఉంటుందని భావిస్తున్నారు. గత శుక్రవారం బడ్జెట్ నిర్ణయాలు ఆశాజనకంగా లేకపోవడంతో సూచీలు నష్టాల్లో ముగిసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా లిస్టెడ్ కంపెనీల్లో కనీస ప్రజల వాటాను ప్రస్తుత 25 శాతం నుంచి 35 శాతానికి పెంచడం, బైబ్యాక్‌పై 20 శాతం పన్ను వంటి అంశాలు మార్కెట్లకు రుచించలేదు. ''ఎంతగానో వేచి చూసిన బడ్జెట్ కార్యక్రమం ముగిసింది. అయితే, దీని తాలూకా ప్రభావం ఈ వారం కూడా మార్కెట్‌పై కొనసాగుతుంది'' అని శామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమీత్ మోదీ తెలిపారు. ''బడ్జెట్ ప్రభావం సోమవారం నాటి మార్కెట్‌పైనా ఉంటుంది. సూచీల్లో భారీ క్షీణత మరింత నష్టాలు ఉంటాయన్న సంకేతాన్నిస్తోంది. 11,800ను నిఫ్టీ కోల్పోతే మరింత క్షీణతకు దారితీస్తుంది'' అని రెలిగేర్ బ్రోకింగ్ రిటైల్ డిస్ట్రిబ్యూషన్ ప్రెసిడెంట్ జయంత్ మంగ్లిక్ తెలిపారు. ఇక, పారిశ్రామిక ఉత్పత్తి, జూన్ నెల ద్రవ్యోల్బణం గణాంకాలు, చమురు ధరల కదలిక, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ధోరణి సైతం ఈ వారం మార్కెట్ దిశను నిర్ణయించనున్నాయి. లిస్టెడ్ కంపెనీల్లో ప్రజల వాటాను పెంచే ప్రతిపాదన అవసరమైనదే కానీ, లార్జ్‌క్యాప్ కంపెనీల విషయంలో దీని అమలు సమస్యలతో కూడుకున్నదేనని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్‌కుమార్ అన్నారు.

**మార్కెట్లకు నిరుత్సాహం...**

''ప్రభుత్వం నుంచి మద్దతు చర్యలను మార్కెట్ ఆశించింది. కానీ, అది జరగలేదు. దేశీయంగా, అంతర్జాతీయంగా మందగమన పరిస్థితులే ఇందుకు కారణం'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్‌హెడ్ వినోద్‌నాయర్ పేర్కొన్నారు. ఈక్విటీల్లో పెట్టుబడులపై ప్రోత్సాహకాల్లేమి మార్కెట్లను సమీప కాలంలో నిరుత్సాహంగా మార్చొచ్చన్నారు. ఈ స్థాయి నుంచి మార్కెట్ పనితీరు అన్నది 2020 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఆర్థిక పనితీరుపై ఆధారపడి ఉంటుందన్న అభిప్రాయాన్ని వినిపించారు.

**ఈ వారంలో వచ్చే ఫలితాలు**

8వ తేదీన డెల్టాకార్ప్, గోవా కార్బన్, 9న టీసీఎస్, 10న సీసీఎల్, 12న ఇండస్ఇండ్ బ్యాంకు, ఇన్ఫోసిస్, కర్ణాటక బ్యాంకు, 13న డీహెచ్ఎఫ్ఎల్, డీమార్ట్ ఈ వారంలో ఫలితాలు విడుదల చేయనున్న ప్రముఖ కంపెనీల్లో కొన్ని. ''బడ్జెట్‌లో అదనపు సాయం కారణంగా ప్రభుత్వరంగ బ్యాంకుల లాభాలు కొనసాగుతాయి. 2019–20 ఆర్థిక సంవత్సరం ఫలితాల్లో వీటి పాత్ర గణనీయంగా ఉంటుంది. 2019–20 ఫలితాల విషయంలో ఎన్ఎస్ఈ 500 కంపెనీల పన్ను అనంతరం లాభంలో 30 శాతం వృద్ధి ఉంటుందని అంచనా వేస్తున్నాం''అని ఎడెల్‌వీజ్ ఇన్వెస్టర్ రీసెర్చ్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ సాహిల్‌కపూర్ తెలిపారు.

**తొలి వారంలో విదేశీ పెట్టుబడులు వెనక్కి**

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు, బడ్జెట్ ప్రతిపాదనలపై అనిశ్చితి అంచనాల నేపథ్యంలో జూలై తొలి వారంలో విదేశీ ఇన్వెస్టర్లు నికరంగా రూ. 475 కోట్ల మేర పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అంతకు ముందు దాదాపు అయిదు నెలలుగా విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరుపుతూ వస్తున్నారు. ఈక్విటీ, డెట్ మార్కెట్లకు సంబంధించి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) నికరంగా ఫిబ్రవరిలో రూ.11,182 కోట్లు, మార్చిలో రూ. 45,981 కోట్లు, ఏప్రిల్‌లో రూ. 16,093 కోట్లు, మే లో రూ. 9,031.15 కోట్లు, జూన్‌లో రూ. 10,385 కోట్ల మేర ఇన్వెస్ట్ చేశారు.



## సుమోటోగా పాన్ జారీ



**న్యూఢిల్లీ:** పాన్, ఆధార్‌ను అనుసంధానించే దిశగా ఆదాయ పన్ను శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కేవలం ఆధార్‌తోనే ఐటీ రిటర్నులు దాఖలు చేసే వారికి సుమోటో ప్రాతిపదికన పాన్ (పర్మనెంట్ అకౌంటు నంబరు) జారీ చేసే యోచన ఉన్నట్లు కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ ప్రమోద్ చంద్ర మోదీ తెలిపారు. పాన్ లేని వారు ఆధార్ నంబరుతోనైనా ఐటీ రిటర్నులు దాఖలు చేయొచ్చంటూ బడ్జెట్‌లో ప్రతిపాదన చేసిన నేపథ్యంలో ఇకపై పాన్ అవసరం ఉండదా అన్న ప్రశ్నలకు స్పందిస్తూ మోదీ ఈ మేరకు సమాధానమిచ్చారు. 'ఈ ప్రతిపాదన అర్థం? పాన్ పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని కాదు. పాన్ లేకుండా.. కేవలం ఆధార్ మాత్రమే ఉన్న పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేసేందుకు ఇది అదనపు సదుపాయంగా మాత్రమే భావించాలి' అని ఆయన చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో అసెసింగ్ అధికారి తనంత తానుగా పాన్ నంబరును కేటాయించవచ్చని మోదీ వివరించారు. ప్రస్తుతం దేశీయంగా 120 ఆధార్ నంబర్లు, 41 కోట్ల పాన్ నంబర్లు జారీ అయ్యాయి. వీటిల్లో 22 కోట్ల పాన్‌లు మాత్రమే ఆధార్‌తో అనుసంధానమయ్యాయి.

## నెస్లే ఇండియా

**బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్** — **కొనొచ్చు**



**ప్రస్తుత ధర:** రూ.11,920 **టార్గెట్ ధర:** రూ.13,000

**ఎందుకంటే:** ఈ కంపెనీ ఈ ఏడాది జనవరి–మార్చి క్వార్టర్ ఆర్థిక ఫలితాలు బాగున్నాయి. నికర అమ్మకాలు 9 శాతం వృద్ధితో రూ.3,003 కోట్లకు పెరిగాయి. వివిధ కేటగిరీల్లో కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తేవడంతో అమ్మకాలు పెరిగాయి. నిర్వహణ లాభం 6 శాతం వృద్ధితో రూ.738 కోట్లకు పెరిగింది. మార్జిన్లు మాత్రం 71 బేసిస్ పాయింట్లు తగ్గి 24.6 శాతానికి చేరాయి. ఇతర ఆదాయం రూ.56 కోట్ల నుంచి రూ.73 కోట్లకు పెరగడంతో నికర లాభం 9 శాతం వృద్ధితో రూ.463 కోట్లకు పెరిగింది. ఒక్కో షేర్‌కు రూ.23 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి తెచ్చిన నేపథ్యంలో ప్రకటనల, ప్రమోషన్ల దూకుడును పెంచింది. ఫలితంగా అమ్మకాలు రెండేళ్లలో 12 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని భావిస్తున్నాం. కిట్‌క్యాట్, మిల్క్ మెయిడ్, నెస్కేఫ్ ఉత్పత్తులను రీలాంచ్ చేసింది. మరిన్ని బ్రాండ్లను రీమోడల్ చేయనున్నది. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను విస్తృతం చేయడం, రూ.10 లోపు ధరల్లో ఉత్పత్తులను అందిస్తుండటంతో అమ్మకాలు మరింతగా పెరగనున్నాయి. పాలు, పోషకాల సెగ్మెంట్లో సేంద్రియ ఉత్పత్తులను అందించనున్నది. అధిక వేతనాలు పొందుతున్న యువత లక్ష్యంగా హెల్త్, వెల్‌నెస్ ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తోంది. రెండేళ్లలో నికర అమ్మకాలు 13 శాతం, నికర లాభం 20 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని భావిస్తున్నాం.

## ఐసీఐసీఐ బ్యాంక్

**బ్రోకరేజ్ సంస్థ: ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్** — **కొనొచ్చు**



**ప్రస్తుత ధర:** రూ.436 **టార్గెట్ ధర:** రూ.585

**ఎందుకంటే:** గత పదేళ్లలో వివిధ ఆటుపోట్లు ఎదుర్కొంటున్న ఈ ప్రైవేట్ రంగ బ్యాంక్ ఇప్పుడిప్పుడే కుదురుకుంటోంది. 1994లో కార్యకలాపాలు ప్రారంభించిన ఈ బ్యాంక్‌కు ఈ ఏడాది మార్చి నాటికి రూ.9.6 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులున్నాయి. మార్జిన్లు అధికంగా ఉండే రిటైల్ రుణాలు పెంచుకుంటోంది. ఈ బ్యాంక్ రుణాల్లో మొత్తం రిటైల్ రుణాలు 60 శాతం వరకూ ఉన్నాయి. ఈ బ్యాంక్ నిర్వహిస్తున్న తనఖా, వాహన, వాణిజ్య వాహన రుణాలు, జీవిత బీమా, సాధారణ బీమా, మ్యూచువల్ ఫండ్ తదితర వ్యాపార విభాగాల్లో చెప్పుకోదగ్గ మార్కెట్ వాటాను సాధించింది. ఈ బ్యాంక్ అనుబంధ కంపెనీలు–ఐసీఐసీఐ వెంచర్‌ఫండ్స్, ప్రుడెన్షియల్ ఐసీఐసీఐ ఏఎమ్‌సీ, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, ఐసీఐసీఐ లాంబార్డ్ కంపెనీలు తమ తమ రంగాల్లో అగ్రస్థాయి కంపెనీల్లో ఒకటిగా నిలిచాయి. నిర్ణయాలు తీసుకునే విషయంలో వికేంద్రీకరణను పాటిస్తోంది. 20 శాతం లాభదాయకతే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తోంది. రిటైల్ టర్మ్ డిపాజిట్ల పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారిస్తోంది. మంచి రేటింగ్ ఉన్న కంపెనీలకే రుణాలివ్వడానికి ప్రాధాన్యత ఇస్తోంది. బిజినెస్ బ్యాంకింగ్‌ను మెరుగుపరచుకుంటోంది. నికర వడ్డీ ఆదాయం 3.5 శాతానికి మించి ఉండటం, వ్యయాలు నియంత్రణలోనే ఉండటం, ఉత్పాదకత మెరుగుపడటం, 20 శాతానికి మించిన రుణ వృద్ధి సాధించడం, రుణ నాణ్యత మెరుగుపడుతుండటం, సానుకూలాంశాలు. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి కల్లా రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్ఓఈ) 17 శాతానికి చేరుతుందని భావిస్తున్నాం. వ్యాపార వృద్ధి, ఆర్థిక పరిస్థితులు మందగించడం వల్ల లాభదాయకత ప్రభావితమయ్యే అవకాశం, రిటైల్ రుణాల్లో పోటీ తీవ్రమవుతుండటం... ప్రతికూలాంశాలు.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## పన్నులతో అదనంగా 30వేల కోట్ల ఆదాయం

- సంపన్నులపై పన్నులు చైనా కన్నా తక్కువే
- రెవెన్యూ శాఖ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే వెల్లడి



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో చేసిన తాజా పన్ను ప్రతిపాదనలతో ఖజానాకు అదనంగా రూ. 30,000 కోట్ల మేర ఆదాయం సమకూరనుందని కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు. అత్యంత సంపన్నుల ఆదాయాలపై సర్‌చార్జీల విధింపు, పెట్రోల్..డీజిల్‌పై అధిక సుంకాల వడ్డనతో పాటు బంగారం.. విలువైన లోహాలపై పెంచిన కస్టమ్స్ సుంకాల ద్వారా ఈ ఆదాయం లభించనున్నట్లు ఆయన వివరించారు. అయితే, 25 శాతం కార్పొరేట్ ట్యాక్స్ పరిధిని రూ. 400 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకు కూడా వర్తింపచేయడంతో కొంత మేర ఆదాయాన్ని కోల్పోనున్నట్లు పాండే వివరించారు. డీజిల్, పెట్రోల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ సుంకాల పెంపు వల్ల కేంద్రానికి వార్షికంగా రూ. 30,000 కోట్లు వస్తాయి. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలలే మిగిలి ఉన్నందున ఈ కాలానికి రూ. 22,000 కోట్ల మేర ఆదాయం లభించవచ్చు. ఇక సూపర్ రిచ్‌పై సర్‌చార్జీ పెంపుతో ఖజానాకు మరో రూ.12,000–13,000 కోట్లు వస్తాయని అంచనా.

**ఆ దేశాల్లో కన్నా తక్కువే..**

సంపన్నులపై భారత్‌లో విధిస్తున్న పన్ను రేటు ప్రపంచంలోనే అత్యధికం అంటూ వస్తున్న విమర్శలను పాండే తోసిపుచ్చారు. చైనా, అమెరికా, దక్షిణాఫ్రికాతో పోలిస్తే భారత్‌లో ఇది తక్కువే ఉందని స్పష్టం చేశారు. చైనా.. దక్షిణాఫ్రికాల్లో గరిష్టంగా 45%, అమెరికాలో 50.3% పన్ను రేటు ఉందన్నారు. 2019–20 బడ్జెట్‌లో రూ.2–5 కోట్ల ఆదాయం ఉన్నవారి పన్నులపై సర్‌చార్జీని 15% నుంచి 25%కి, రూ. 5 కోట్ల పైబడి ఆదాయం ఉన్న వారిపై 15% నుంచి 37%కి పెంచిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లో గరిష్ట పన్ను రేటు 42.7%కి చేరింది.

## సెన్సెక్స్ మద్దతు శ్రేణి 39,320-39,090

**మార్కెట్ పంచాంగం**

బడ్జెట్ అంచనాలు, ప్రపంచ మార్కెట్ల సానుకూల పవనాల కారణంగా గతవారం తొలి నాలుగురోజులూ క్రమేపీ పెరిగిన మన మార్కెట్...బడ్జెట్ ప్రతిపాదనలు నిరుత్సాహపర్చడంతో వారంలో ఆర్జించిన లాభాల్లో చాలావరకూ కోల్పోయింది. మరోవైపు అమెరికాలో తాజాగా వెలువడిన జాబ్స్ డేటాతో ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గవన్న అంచనాల్ని ఏర్పర్చడంతో గత శుక్రవారం అమెరికా, యూరప్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఈ అంశాల ప్రభావం ఈ వారం ప్రారంభంలో మన మార్కెట్‌పై పడవచ్చు. అటుతర్వాత వెల్లడికానున్న కార్పొరేట్ ఫలితాలు సూచీలను ఒడుదుడుకులకు లోనుచేయవచ్చు. ఇక ప్రస్తుత సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...,

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




జూలై 5తో ముగిసిన వారంలో చివరిట్రేడింగ్ రోజున కేంద్ర బడ్జెట్ సమర్పణ సందర్భంగా 40,032 పాయింట్ల గరిష్టస్థాయిని తాకిన బీఎస్ఈ సెన్సెక్స్, అటుతర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనై 39,441 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. గతవారంలో ఇవే గరిష్ట, కనిష్టస్థాయిలుకావడం గమనార్హం. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 118 పాయింట్ల లాభంతో 39,513 పాయింట్ల వద్ద ముగిసింది. బడ్జెట్ ఏర్పర్చిన నిరుత్సాహం, ఆసియా మార్కెట్ల ప్రతికూలతతో ఈ సోమవారం సెన్సెక్స్ గ్యాప్‌డౌన్ తో ప్రారంభమైతే 39,320–39,090 పాయింట్ల శ్రేణి వద్ద లభించబోయే తక్షణ మద్దతు కీలకం. ఇదే శ్రేణి వద్ద 50 రోజుల చలన సగటు (50 డీఎంఏ) రేఖ కదులుతున్నది. ఈ శ్రేణిని కోల్పోతే 38,825–38,570 పాయింట్ల శ్రేణి వద్దకు తగ్గవచ్చు. ఈ లోపున 38,000 పాయింట్ల వద్దకు పతనం కావచ్చు. తొలి మద్దతుశ్రేణిని పరిరక్షించుకుంటే తొలుత 39,730 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపైన ముగిస్తే 39,980–40,032 పాయింట్ల శ్రేణి వరకూ పెరగవచ్చు. ఆపైన 40,320 పాయింట్ల వరకూ పెరగవచ్చు.

**నిఫ్టీ మద్దతుశ్రేణి 11,760-11,725 పాయింట్లు....**




గత వారం 11,982–11,797 పాయింట్ల శ్రేణిలో గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య హెచ్చుతగ్గులకు లోనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 22 పాయింట్ల లాభంతో 11,811 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీ గ్యాప్‌డౌన్‌తో మొదలైతే 11,760–11,725 శ్రేణి వద్ద కీలక మద్దతు లభిస్తున్నది. 50 డీఎంఏ కదులుతున్న 11,725 పాయింట్ల స్థాయిని కోల్పోతే డౌన్ ట్రెండ్ వేగవంతమై 11,625–11,590 పాయింట్ల శ్రేణి వద్దకు క్షీణించవచ్చు. ఈ శ్రేణిని వదులుకుంటే 11,426 పాయింట్ల స్థాయికి పడిపోవచ్చు. ఈ వారం తొలి శ్రేణి వద్ద మద్దతును పొందగలిగితే నిఫ్టీ తొలుత 11,890 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపైన 11,945–11,982 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ స్థాయి పైన ముగిస్తే, 12,100 పాయింట్లకు ర్యాలీ జరపవచ్చు.

– పి. సత్యప్రసాద్

# నేరుగా ఎన్‌సీడీల్లో ఇన్వెస్ట్ చేయవచ్చా?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

**నేను గత నాలుగేళ్లుగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ప్రస్తుతం నా పోర్ట్‌ఫోలియోలో మొత్తం 20కి పైగా ఫండ్స్ ఉన్నాయి. ఈ సంఖ్యను సగానికైనా తగ్గించుకొమ్మని మిత్రులంటున్నారు. ఈ విషయంలో నాకు తగిన సలహా ఇవ్వండి.** –సురేశ్, విజయవాడ

మీ మిత్రులు చెప్పింది నిజమే. మీ పోర్ట్‌ఫోలియోలో ఫండ్స్ సంఖ్యను కనీసం నాలుగో వంతుకైనా తగ్గించుకుంటే మంచిది. ఈక్విటీలో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తే ఎలాంటి రాబడులు వస్తాయో, 3–4 మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసినా అదే రాబడులు పొందవచ్చు. సాధారణంగా డైవర్సిఫికేషన్ కోసం మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తారు. డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందడం కోసం గరిష్టంగా ఐదు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే సరిపోతుంది. కానీ మీ పోర్ట్‌ఫోలియోలో 20కి పైగా ఫండ్స్ ఉన్నాయంటే డైవర్సిఫికేషన్ కూడా బాగా ఎక్కువగా ఉన్నట్లు అర్థం. ఇంత అధికమైన డైవర్సిఫికేషన్ అవసరం లేదు. పైగా ఫండ్స్ అధికంగా ఉండడం వల్ల మీరు ఫండ్ నిర్వహణ చార్జీలు కూడా అధికంగానే చెల్లించాల్సి ఉంటుంది. మీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న ఫండ్స్ అన్నింటిపై మీకు ఆసక్తి ఉంటుంది. కానీ, ఏ ఫండ్‌పై పూర్తి అవగాహన ఉండదు. పైగా అన్ని ఫండ్స్ గురించి పట్టించుకోవడం కాలహరణం తప్ప మరేమీ కాదు. అందుకని మీ పోర్ట్‌ఫోలియోలోని ఫండ్స్ సంఖ్యను కుదించండి. ఫండ్స్ పోర్ట్‌ఫోలియోలు దగ్గర, దగ్గరగా, దాదాపు ఒకటేగా ఉన్న వాటి నుంచి వైదొలగండి. మీ పోర్ట్‌ఫోలియోలో లార్జ్ క్యాప్, స్మాల్ క్యాప్, మల్టీ క్యాప్ ఫండ్స్ ఉండేలా చూసుకోండి.

**నేను అత్యవసర నిధి నిమిత్తం కొంత డబ్బులు పోగేసాను. ఈ మొత్తాన్ని ఏ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలి ?** –సుచరిత, హైదరాబాద్

మీ కుటుంబానికి ఆరు నెలల పాటు అవసరమయ్యే ఖర్చులను లెక్కేసి అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాలి. మీరు ఉద్యోగం కోల్పోయినా, మరో ఉద్యోగం దొరికేదాకా ఈ అత్యవసర నిధి మిమ్ములను ఆదుకుంటుంది. ఈ అత్యవసర నిధిని వివిధ స్థాయిల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మీ తల్లిదండ్రులు మీ వద్దే ఉన్నా, మీకు ఇంటర్, ఆపై చదువులు చదివే పిల్లలున్నా, కనీసం రూ.20,000 చేతిలో ఉంచుకోండి. ఇది మొదటి లెవల్, ఇక రెండో లెవల్... రూ.15,000–20,000 మొత్తాన్ని బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో ఉంచుకోండి. ఈ డబ్బును ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ఏటీఎమ్ కార్డ్ ద్వారా తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇక మూడో స్థాయిలో కనీసం రూ.30,000 వరకూ అల్ట్రా షార్ట్ డ్యురేషన్ లేదా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయండి. ఒకటి లేదా రెండు రోజుల్లో మీరు ఈ ఫండ్స్ నుంచి పెట్టుబడుల్ని నగదుగా మార్చుకోవొచ్చు.

**ఇటీవలి కాలంలో డెట్ మ్యూచువల్ ఫండ్స్ పెద్దగా రాణించడం లేదు కదా ! అందుకని నేను హౌసింగ్ ఫైనాన్స్, తయారీ రంగ కంపెనీల నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల(ఎన్‌సీడీ)లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. నాది సరైన నిర్ణయమేనా ?** –వంశీ, విశాఖపట్టణం

కొన్ని కంపెనీల సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల డెట్ ఫండ్స్ బాగా దెబ్బతిన్నాయి. ఫలితంగా ఎఫ్ఎమ్‌పీలు తమ ఇన్వెస్టర్లకు చెల్లించాల్సిన మొత్తాలను వాయిదా వేస్తున్నాయి. ఫలితంగా ఎఫ్ఎమ్‌పీల పట్ల ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొన్నది. అయితే రాబడులు తగ్గడమో, లేదా స్వల్పంగా నష్టాలు రావడమో తప్పితే, ఇన్వెస్టర్లు తమ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను నష్టపోయే అవకాశాలు లేవని చెప్పవచ్చు. ఇక ఎన్‌సీడీల్లో నేరుగా ఇన్వెస్ట్ చేసే విషయానికొస్తే, దురదృష్టవశాత్తూ మీరు ఇన్వెస్ట్ చేసిన ఎన్‌సీడీలను జారీ చేసిన కంపెనీకి ఏమైనా అయితే మీరు ఇన్వెస్ట్ చేసిన మొత్తాన్ని మీరు నష్టపోవలసి వస్తుంది. అదే మ్యూచువల్ ఫండ్ విషయానికొస్తే, మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్ తన నిధులను కనీసం పది నుంచి పదిహేను కంపెనీల సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. కాబట్టి ఒక కంపెనీ దివాలా తీసినా ఆ మేరకు అంటే మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో కొంత భాగం మాత్రమే ఆ ప్రభావం ఉంటుంది. అందుకని ఎన్‌సీడీల్లో నేరుగా ఇన్వెస్ట్ చేయకుండా ఉంటేనే బాగుంటుంది. అయితే హెచ్‌డీఎఫ్‌సీ, సుందరమ్ ఫైనాన్స్ వంటి కంపెనీల ఎన్‌సీడీల్లో ఎలాంటి సంశయం లేకుండా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇలాంటి కంపెనీలు 30–40 ఏళ్లపాటు ఎన్‌సీడీలను సకాలంలో రిడీమ్ చేస్తూ, ఇన్వెస్టర్లకు మంచి రాబడులనే ఇస్తున్నాయి. అయితే ఇలాంటి కంపెనీలు తక్కువగానే ఉన్నాయి. అందుకని ఎన్‌సీడీల్లో నేరుగా ఇన్వెస్ట్ చేయాలనే ఆలోచన మానుకోండి. మరోవైపు డెట్ ఫండ్స్‌లో మొత్తం 16 కేటగిరీల ఫండ్స్ ఉన్నాయి. వీటిల్లో లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్, లేదా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో మాత్రమే ఇన్వెస్ట్ చెయ్యండి.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792


BIG C
225+ STORES | AP | TS | TN
AASHADAM SALE*
SCRATCH & WIN*
10 CRORES
WORTH OF GIFTS*
1 EMI FREE*
UP TO 51% DISCOUNT*
FLAT 30% paytm CASHBACK*
5% CASH BACK*
HDFC BANK
*T&C Apply
realme
ALL MODELS AVAILABLE
vivo V15 Pro EMI ₹1799
V15 EMI ₹1333
vivo Y17 EMI ₹1066
1 EMI FREE
BAJAJ FINSERV
3GB + 32GB
LOWEST EMI
₹999
oppo A5s
All MODELS AVAILABLE
mi
3GB + 32GB
57% DISCOUNT
micromax HS2 Infinity
3GB + 32GB
50% DISCOUNT
NOKIA 3.1
LOWEST PRICE 2GB PHONE
₹5249
micromax I One
SKYWIN
2300 mAh
₹799
GYM Bag FREE
SAMSUNG
Galaxy A
Aashadam Sambaralu
Buy a Samsung Galaxy Smartphone*& get a chance to win*fabulous prizes.
Daily Prize
Galaxy A10 - 10 (N)
Total - 310 (N)
Weekly Prize
Bajaj Platina Bikes - 1 (N)
Total - 5 (N)
Bumper Prize
Hundai Santro Car - 1 (N)
*No other offers are applicable.
*T&C appy. For more details contact the BIG C outlet. offer valid on purchase of any Samsung Smart phone above Rs.10000/-
0% Down Payment
Processing Fee
No Cost EMI
BAJAJ FINSERV
HOME CREDIT
IDFC FIRST Bank
HDFC BANK
HDB FINANCIAL SERVICES
Pine Labs
Helpline 1800 123 4578
www.bigcmobiles.com
for more offers
visit your nearest Big C Store
BIG C

# సంక్షేమ సంతకం

# చెరగని జ్ఞాపకం


సాక్షి

నల్లగొండ | సోమవారం

8-7-2019

www.sakshi.com


## ఇప్పటికీ.. ఎప్పటికీ ప్రజల గుండెల్లో

## నీ స్థానం పదిలం

నేడు మహానేత 70వ జయంతి

ఆరోగ్యశ్రీతో ఆయుష్షు నింపావు..

108తో ఆపద్బాంధవుడవయ్యావు..

జలయజ్ఞంతో భగీరథుడవయ్యావు..

రైతుల కోసం వ్యవ'సాయం' చేశావు..

ఫీజురీయింబర్స్‌మెంట్‌తో విద్యా జ్యోతులు వెలిగించావు..

ఇళ్లు ఇచ్చి.. కన్నీళ్లు తుడిచావు..

పింఛన్లతో అవ్వాతాతలకు చేతి ఊతమయ్యావు..

పార్టీలతో పనేంటి?.. ప్రజలంతా నా వాళ్లే అన్నావు..

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరాగా నిలిచావు...

ఇచ్చిన మాట కోసం మరణానికైనా ఎదురెళ్లావు..

రాజకీయ నాయకుడిగా కాదు.. రాముడిలా పాలించావు..

విశ్వసనీయతే నీ ఇంటి పేరుగా మార్చుకున్నావు..

మీ విధానాలు నిత్య నూతనం...

సదా అనుసరణీయం అందుకే పదేళ్లయినా..

ఇంకో వందేళ్లయినా నిను మరువదు ఈ ప్రజ

మనసున్నవాడు పాలకుడు అయితే పాలన
ఎంత ప్రజారంజకంగా ఉంటుందో...
గుండెలో తడి ఉన్న నేత పాలకుడు అయితే
ప్రజల కళ్లల్లో తడి చేరకుండా ఎలా పాలిస్తాడో...
ప్రజలను ఓటర్లుగా కాకుండా తనవాళ్లుగా చూసే
నేత పాలకుడు అయితే ఎంతటి సంక్షేమం సాధ్యమో...
అన్నదాన్ని దేశానికి చూపిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి.



ఎందుకంటే ఆయన అమ్మానాన్నల కష్టం తెలిసిన ఓ కొడుకు.. చదువు 'కొనలేక'పోతున్న విద్యార్థుల మానసిక క్షోభను గుర్తించిన ఓ తండ్రి.. అవ్వాతాతల బాధలు చూసిన ఓ మనవడు.. రైతు రుణం తీర్చుకోవాలనుకునే ఓ రుషి.. పేదోడి గుండె చప్పుడు విన్న మనసున్న రాజు. అందుకే తరతమభేదం లేకుండా మనసుతో పాలించి రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచగలిగారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కేవలం రాజకీయ నేతగా పరిపాలించలేదు... ఓ సామాజికవేత్తగా, అర్థశాస్త్ర నిపుణుడిగా, వ్యవసాయ శాస్త్రవేత్తగా, అన్నింటికీ మించి ప్రతి ఇంటి సభ్యుడిగా తనను తాను భావించి పరిపాలించారు. వైఎస్సార్ ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు పరిశీలిస్తే ఆ విషయం స్పష్టమవుతుంది. అందుకే సుభిక్షమైన పాలనకు నిర్వచనంగా అనాదికాలం నుంచి రామరాజ్యం అన్నది ఎంతగా స్థిరపడిపోయిందో.. మన రాష్ట్రంలో నేడు రాజన్న రాజ్యం అన్నది కూడా అంతగా ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. ఆ మహానేత దివంగతుడై పదేళ్లు గడిచినప్పటికీ ఆయన పరిపాలన ప్రజల మనసుపొరల్లో సజీవంగా నిక్షిప్తమై ఉంది. ఇంకో వందేళ్లయినా ఆయన ఖ్యాతి నిలిచే ఉంటుంది. – సాక్షి, అమరావతి

### అజరామరం ఆయన స్ఫూర్తి...

వైఎస్ రాజశేఖరరెడ్డి... ఆ పేరే ఓ స్ఫూర్తి. కఠిన కాల పరీక్షకు ఎదురొడ్డి ప్రజల మనసులో దేదీప్యమానంగా వెలుగొందుతున్న దీప్తి. ఎన్నో సిద్ధాంతాలు, పాలనా విధానాలు కాలక్రమంలో కనుమరుగైపోతూ ఉంటాయి. దీనికి వైఎస్సార్ పూర్తిగా మినహాయింపు. ఆయన పరిపాలనా విధానం, ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ, ఎన్నటికీ ఆదర్శనీయం. ఎందుకంటే ఆయన సమాజాన్ని మనసుతో చూసి పాలించారు. ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయింబర్స్‌మెంట్, సామాజిక పింఛన్లు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, జలయజ్ఞం.. ఇలా ఎన్నో పథకాలు అత్యంత ఆవశ్యకమైనవిగా సామాజికవేత్తలు గుర్తించారు. వైఎస్ హఠాన్మరణానంతరం ప్రభుత్వాలు ఆయన పథకాలను నీరుగార్చడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఆ రాజన్న పాలన మళ్లీ రావాలని ప్రజల గుండెలు తపించాయి. అందుకే 'ఆనాటి రామరాజ్యం నేను చూడలేదు.. కానీ రాజన్న రాజ్యం చూశాను. నాకు అవకాశం ఇస్తే మళ్లీ ఆనాటి రాజన్న రాజ్యం తీసుకువస్తాను' అన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటను ప్రజలు అంతగా నమ్మారు. తండ్రి పేరును నిలబెట్టే సిసలైన వారసుడిగా గుర్తించి ఆయనకు పట్టాభిషేకం చేశారు.

### చదివించే బాధ్యత భుజానికెత్తుకున్నారు..

చదవాలనే తపన ఉండి.. కేవలం డబ్బులేక విద్యను మధ్యలోనే ముగించాల్సి రావడం ఆ విద్యార్థిని ఎంతటి మానసిక క్షోభకు గురిచేస్తుందో వర్ణించడం సాధ్యం కాదు. తన బిడ్డను చదివించే స్తోమత లేక నిద్రలేని రాత్రులు గడిపి ఆత్మహత్యలు చేసుకున్న తల్లిదండ్రులు ఎందరో. ఈ పరిస్థితులన్నిటినీ ఒకే ఒక్క పథకం శాశ్వతంగా మార్చేసింది. అదే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం. ఉన్నత విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని వైఎస్సార్ గుర్తించారు. పేద విద్యార్థులను చదివించే బాధ్యతను ఆయన భుజానికెత్తుకున్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు పైసా ఖర్చులేకుండా ఇంజనీరింగ్, మెడికల్, ఇతర కాలేజీల్లో చదువుకున్నారు. పేద, మధ్యతరగతికి చెందిన పిల్లలు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. మహానేత పాలన ఫలితంగానే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గుముఖం పట్టింది.

### పేదరికం జబ్బును నయం చేసిన వైద్యుడు

పేదరిక నిర్మూలనకు మందు విద్య, ఆరోగ్యమేనని సూత్రీకరించిన సామాజిక వైద్యుడు వైఎస్. అందుకే ఆయన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ప్రవేశపెట్టి సామాజిక విప్లవం తీసుకువచ్చారు. పేదలు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండా పూర్తి వైద్య బీమా పొందేందుకు వైఎస్ ప్రవేశపెట్టిన 'రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం' ఓ సంచలనం. అంతవరకు ప్రీమియం చెల్లించకుండా వైద్య బీమా అందించే పథకం ఏదీ మన దేశంలోనే కాదు ప్రపంచంలో కూడా ఎక్కడా లేదు. ఎవరూ ఊహించని రీతిలో లక్షలాదిమంది పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన హయాంలో ప్రభుత్వ వైద్యశాలల్లో సౌకర్యాలను గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశారు. అంతేకాదు 108, 104 వైద్యసేవలతో ఆయన మరో విప్లవం సృష్టించారు. ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా, ఎవరికి ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఒక్క ఫోన్ చేస్తే కుయ్.. కుయ్.. అంటూ 20 నిమిషాల్లో అంబులెన్స్ వచ్చి ఆస్పత్రికి సకాలంలో తరలించడం అన్నది దేశంలో అదే మొదటిసారి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు దూరంగా ఉన్న వేలాది గ్రామాలకు 104 వాహనాల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించేలా చేయడం వైఎస్సార్‌కే చెల్లింది. ఉచిత పథకాలకు పూర్తి వ్యతిరేకం అయిన ప్రపంచ బ్యాంక్ కూడా వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రశంసించడం విశేషం. పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆయన స్ఫూర్తి దేశంలో ఎన్నో రాష్ట్రాలకే కాదు.. కేంద్ర ప్రభుత్వానికి కూడా మార్గనిర్దేశం చేసింది. దాదాపు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆరోగ్యశ్రీ పథకాన్ని తమ రాష్ట్రాల్లో ప్రవేశపెట్టి నేటికీ అమలు చేస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన 'ఆయుష్మాన్ భారత్' పథకం కూడా ఆరోగ్యశ్రీ పథకం స్ఫూర్తితో రూపొందించినదే. ఆరోగ్య భారత్ సాధనకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ వైఎస్సారే మార్గనిర్దేశం చేశారు.

### రాజకీయ సంస్కర్త..

ప్రజలను కేవలం ఓటర్లుగా చూసే గత పాలకుల విధానాలతో భ్రష్టుపట్టిన రాజకీయాలను సంస్కరించిన సంస్కర్త వైఎస్ రాజశేఖరరెడ్డి. ప్రజలను సమ దృష్టితో చూడాలన్న విధానాలకు అంతకు ముందు ప్రభుత్వాలు తిలోదకాలు ఇచ్చేశాయి. తమ పార్టీకి ఓటేశారా?.. ఏ సామాజికవర్గానికి చెందినవారు? మన పార్టీ నేతల సిఫార్సు ఉందా లేదా? అన్నది చూసే సంక్షేమ పథకాలు ఇచ్చేవారు. చివరికి వృద్ధులు, వితంతువుల పింఛన్ల పంపిణీలో కూడా ఇదే నీచ రాజకీయాలు రాజ్యం చేశాయి. మహానేత వైఎస్సార్ తన పాదయాత్రలో ఈ దుస్థితిని చూసి చలించిపోయారు. ప్రజలందర్నీ తనవాళ్లగానే చూడాలన్నది ఆయన సిద్ధాంతం. ఆయన 2004 ఎన్నికల్లో సీఎం కాగానే రాజకీయాలకు అతీతంగా పాలన సాగించారు. శాచ్యురేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్లు, పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాలను అందించారు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక ప్రయోజనం అందించిన ఘనత ఆయనదే. అందుకే 2009లోనూ ఆయనకు అధికారాన్ని కట్టబెట్టారు. వైఎస్ స్ఫూర్తిని ఆయన తదనంతర ప్రభుత్వాలు కొనసాగించలేదు. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరుతో దుష్ట రాజకీయాలు తెరపైకి వచ్చాయి. టీడీపీ నేతలు పచ్చ ముద్ర వేస్తేనే ప్రభుత్వ పథకాలు అన్న విధానం అమలైంది. దాంతో ప్రజలు వాస్తవాన్ని గుర్తించారు. 'కులం చూడం.. మతం చూడం.. రాజకీయాలు చూడం.. పార్టీలు చూడం.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం' అన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్పష్ట ప్రకటన పార్టీలకు అతీతంగా ప్రజల మనసును తాకింది. ఆ మహానేత స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న వైఎస్ జగన్ పట్ల ప్రజలు అచంచల విశ్వాసం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీకి అద్వితీయమైన విజయాన్ని అందించి రాష్ట్రంలో మళ్లీ రాజన్న రాజ్యాన్ని తీసుకువచ్చారు.

### అపర భగీరథుడు..

ప్రపంచీకరణ అనంతర పరిణామాల్లో వ్యవసాయ రంగాన్ని విస్మరించి ఊహాకాశంలో పరుగులు తీస్తున్న పాలకులకు వైఎస్సార్ మట్టి వాసనను మళ్లీ పరిచయం చేశారు. ఆర్థిక సంస్కరణలుగానీ మరే విధానమైనాగానీ వ్యవసాయ రంగమే మూలాధారమని మార్గనిర్దేశం చేశారు. సాగు, నీటిపారుదల రంగాలకు పెద్దపీట వేసి వ్యవసాయాన్ని పండుగ చేశారు. అంతకుముందు పాలకులు 'సాధ్యం కాదు.. కూడదు' అన్న ఉచిత విద్యుత్‌ను సాకారం చేసి చూపించారు. జలయజ్ఞం పేరుతో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నడుం బిగించారు. కోటిన్నర ఎకరాలకు సాగునీరు అందించేందుకు 86 ప్రాజెక్టులను చేపట్టారు. బీడుబారిన పొలాలను సస్యశ్యామలం చేశారు. రైతులకు బ్యాంకుల నుంచి సకాలంలో నామమాత్రపు వడ్డీకే రుణాలు అందించేలా కృషి చేశారు. మహానేత హఠాన్మరణానంతరం వచ్చిన ప్రభుత్వాల నిర్వాకంతో సాగు, నీటిపారుదల రంగాలకు మళ్లీ గ్రహణం పట్టింది. పంట రుణాలు మాఫీ చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా రైతులను నిండా ముంచారు. గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడ్డారు. జలయజ్ఞం నిలిచిపోయింది. శాశ్వత ప్రయోజనాన్ని అందించే పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వం తమ అవినీతికి ఏటీఎంగా మార్చుకుంది. పట్టిసీమ వంటి తాత్కాలిక పథకాలతో ప్రజలను కనికట్టు చేసి కోట్లు దోచుకుంది. మరోవైపు సాగునీరు లేక పంటలు దెబ్బతిన్నాయి. రాయలసీమలో పొలాలు బీడువారాయి. రైతులు కూలీలుగా మారి వలస బాట పట్టారు. దాంతో రైతులు మరోసారి రాజన్న రాజ్యం కావాలని కోరుకున్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బాసటగా నిలిచి అఖండ విజయాన్ని అందించారు.

### మహానేత కలను సాకారం చేస్తున్న జననేత

ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతికి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతగానో పరితపించారు. తనదైన శైలిలో పేదల అభ్యున్నతికి ఒక అడుగు ముందుకు వేసి ఎన్నో వినూత్న పథకాలు చేపట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. అంతలోనే ఆయన మనకెవ్వరికీ అందనంత దూరంగా సుదూర తీరాలకు వెళ్లిపోయారు. ఆయనే కనుక ఉండి ఉంటే అందరి భవిష్యత్ బంగారంలా ఉండేదని అన్ని వర్గాల ప్రజలు అనునిత్యం గుర్తు చేసుకుంటూ.. మళ్లీ ఆ స్వర్ణ యుగం ఆయన తనయుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమంటూ మొన్నటి ఎన్నికల్లో పట్టం కట్టారు. ఇది జరిగి నెల రోజులైనా పూర్తవ్వకముందే.. వైఎస్ జగన్ పేదల అభ్యున్నతికి రెండడుగులు ముందుకు వేస్తూ నవరత్నాలతో అందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు శ్రమిస్తున్నారు.



అన్ని దానాల్లోకెల్లా ఉత్తమం ప్రాణ దానం

1986లో ఓ రోజు జీపులో వైఎస్సార్.. నెల్లూరుకు వెళుతున్నారు. వెంకటగిరి దగ్గర రోడ్డు మీద ఒక పేదవాడు గాయపడి కనిపించాడు. ఏదో గుర్తు తెలియని బండి ఆ పేదవాణ్ణి గుద్దేసి వెళ్లిపోయిందని అర్థమైంది. ఎవరూ పట్టించుకోలేదు. వై.ఎస్‌కు కూడా నెల్లూరులో అర్జెంట్ పని ఉంది. కానీ వెంటనే జీపు ఆపించి ఆగమేఘాల మీద ఆ పేదవాణ్ణి ఖర్చులిచ్చి మరీ ఆసుపత్రికి తరలించారు. 'అన్ని దానాల్లోకెల్లా ప్రాణదానం గొప్పది' అని ఆయన అనేవారు. అందుకే ఆయన ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, 108 వంటి సేవల పట్ల అంత లక్ష్యశుద్ధితో వ్యవహరించింది.

# మహానేత 70వ జయంతి రైతు దినోత్సవం



- పెద్దాయన పుట్టినరోజు.. ప్రతి పేదోడికి పండుగ రోజు
- పల్లె వాకిట సంబరాలు.. ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు
- ఉపాధి కూలీల్లో ఉప్పొంగిన అభిమానం
- బతుకు మెట్లెక్కించిన వైఎస్‌కు యువత జోహార్లు
- రంజాన్ సంబరాలే అంటున్న ముస్లిం మైనార్టీలు
- ఆశలు మొలకెత్తాయంటున్న రైతన్న
- ఊరువాడా ప్రాణదాత పక్షమే
- ఆరోగ్యశ్రీ ఊపిరిలో ప్రతిధ్వనిస్తున్న వైఎస్
- రాజధాని నుంచి పల్లెదాకా ఉప్పొంగిన ఆత్మీయత

# జనం గుండె చప్పుళ్లలో



తూర్పు గోదావరి జిల్లా పి గన్నవరం మండలం మానేపల్లిలో సైకిళ్లపై ర్యాలీగా వెళ్తున్న యువత



మామిడికుదురులో వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి వృద్ధురాలిని ఆహ్వానిస్తున్న వైఎస్ అభిమానులు

## దారిపొడవునా అభిమానమే..

కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లోని వెంటప్రగడ నుంచి గుడివాడ, ముదినేపల్లి, కైకలూరు, ఆకివీడు మొదలు ఉండి, భీమవరం, పాలకొల్లు, రాజోలు, అమలాపురం, అంబాజీపేట, తణుకు, తాడేపల్లిగూడెం వరకూ సాగిన 'సాక్షి' బృందం ప్రత్యేక పర్యటనలో ఎంతోమంది వైఎస్సార్ వీరాభిమానులు కలిశారు. మహానేత తమకు చేసిన మేలును గుర్తు చేసుకున్నారు. ఆయన పుట్టిన రోజును పండుగలా జరుపుకుంటామని చెప్పారు.



వైద్యురాలు షేక్ ఆఫ్రిన్

యోగభావన, యోగ భార్గవి



## నిద్ర లేవగానే వైఎస్ తాతను చూడాల్సిందే..

గుడివాడలో పొన్నంపల్లి కల్పన, శ్రీనివాసరావు దంపతులు నిరుపేదలు. వారి పిల్లలు యోగభావన, యోగ భార్గవి పుట్టుకతోనే చెవుడు, మూగ. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఆ చిన్నారులకు కొత్త జీవితాన్నిచ్చింది. మొత్తం రూ.13 లక్షలు మంజూరై చికిత్స అందడంతో ఆ చిన్నారులు ఇప్పుడు మాట్లాడుతున్నారు. నిద్ర లేవగానే తాత (వైఎస్సార్) ఫొటోనే చూస్తారని కల్పన చెప్పింది. ఆపరేషన్ అయిన నెల రోజులకు వైఎస్సార్‌ని కలిశారట. ఆయన ముద్దు పెట్టుకున్నారట. రోజూ దాన్ని జ్ఞాపకం చేసుకుని ఆ పిల్లలు మురిసిపోతున్నారు.

# రాజన్న జ్ఞాపకం

ప్రతి తెలుగువాడి గుండెచప్పుడు.. 'వైఎస్సార్'. పల్లె తలుపు తట్టినా.. పేదవాడి ముంగిటకెళ్లినా.. వైఎస్సార్ మార్కు జ్ఞాపకాలు గిర్రున తిరుగుతాయి. జలసిరుల జలయజ్ఞంలో, బడుగు జీవులకు ప్రాణం పోసిన ఆరోగ్యశ్రీలో, కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లయిన నిరుపేదల ఫీజురీయింబర్స్‌మెంట్ అనుభవాల్లో పెద్దాయనే కనిపిస్తారు. ఏ ఊరికెళ్లినా రాజన్న మాటలే. ఏ వాడకెళ్లినా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తీపిగుర్తులే. జనం గుండెల్లో పదిలంగా నిలిచిపోయిన ఆ మహనీయుడి పుట్టిన రోజును ప్రజలు గొప్ప పండుగనే అంటున్నారు. ఎంత చేస్తే ఓ వ్యక్తిని ఇంతగా ఆరాధిస్తారు? ఏం చేసి ఆయన జనం గుండెల్లో దేవుడై నిలిచాడు? పెద్దాయన పుట్టిన రోజు కోసం ఎదురు చూస్తున్న ప్రజల వద్దకు 'సాక్షి' బృందం వెళ్లినప్పుడు మాటలకందని అభిమానం కనిపించింది. అక్షరాలకే అంతుచిక్కని ఆత్మీయత ప్రస్ఫుటమైంది.

– ప్రజాక్షేత్రం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధులు



తూర్పుగోదావరి జిల్లా రాజోలులో వైఎస్సార్ పుట్టిన రోజు నిర్వహిస్తున్న మహిళలు

## ఆయన పుట్టిన రోజున విత్తనం నాటడం అలవాటు

గుడివాడలో విత్తనాల కోసం వచ్చిన రైతులు శ్రీనివాసరావు, యాగ భార్గవ్, చందం గురవయ్య.. షాపు యజమానితో చెప్పే మాటల్లో వైఎస్ ప్రస్తావన విని అటువైపు 'సాక్షి' బృందం వెళ్లింది. 'నకిలీ విత్తనాలు అమ్మితే వైఎస్ తాట తీసేవారు. పెద్ద పెద్ద విత్తన కంపెనీలతోనూ ఢీ అని పోరాడి రైతుల పక్షాన నిలబడ్డారు. ఇప్పుడు ఆయన కొడుకే సీఎం. గుర్తుపెట్టుకోండి.. మీరిచ్చే విత్తనంలో తేడా వస్తే రియాక్షన్ మరోలా ఉంటుంది' రైతు శ్రీనివాస్ ధైర్యంతో ఇచ్చిన వార్నింగ్ ఇది. 'అవునయ్యా వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే మాకు అభిమానం. మాకు ఆయన పుట్టిన రోజు నాడే విత్తనం నాటడం అలవాటు. ఇంతకాలం నకిలీ విత్తనాలు వచ్చినా అడగలేకపోయాం. ఇప్పుడు వైఎస్ జగన్ పాలన నడుస్తోంది. అదే మా ధైర్యం' అన్నాడు చందం గురవయ్య. రైతుకు వైఎస్ చేసిన మేలు గురించి గుక్కతిప్పుకోకుండా చెప్పారు.. ఆ రైతులు.

## పేదల గుండెల్లో... పెద్దాయన పటం

'ఆ మహానుభావుడి పుట్టిన రోజు.. కాలనీ మొత్తం రావాల్సిందే.. పండుగయ్యేక పులిహోర పంచుదాం'.. భీమవరం ఇందిరమ్మ కాలనీ రేషన్ షాపు దగ్గర నిలబడి చర్చించుకుంటున్న మహిళలతో సుశీల అన్న మాటలివి. 'వాళ్లకు పూట గడవడమే కష్టంగా ఉంది. అయినా వైఎస్సార్ పుట్టిన రోజు ఘనంగా చేయాలని ఎంత తాపత్రయపడుతున్నారో చూడండి సార్'.. ఆ కాలనీకి చెందిన బీటెక్ విద్యార్థి రామశేషు అన్నాడు. అంత అభిమానం ఏంటని అడిగితే.. ఆ కాలనీ వైఎస్సార్ హయాంలోనే ఏర్పాటు చేశారట. అప్పటివరకూ కూలిపోయిన ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటూ ఉండేవాళ్లట. చావు బతుకులతో సంసారం చేసేవాళ్లంట. వారి గోడు విన్న వైఎస్ వాళ్ల కోసం భూమి కొని మరీ ఇళ్లు కట్టించారట. 'కాలనీకొచ్చి చూడండయ్యా.. మా ఇంట్లో దేవుడి పక్కనే వైఎస్ ఫొటో ఉంటుంది'.. అంది ఈశ్వరమ్మ. ఆయన కన్నుమూశాక వాళ్లకొచ్చిన కష్టాలేంటో చెప్పుకొచ్చారు. ఆయన కట్టించారని టీడీపీ వాళ్లు కక్షగట్టారని చెప్పారు. డ్రైయిన్లు లేవయ్యా అంది షేక్ అబిదాబీ. కట్టుకున్న ఇళ్లకు లోన్లు క్లియర్ చేయలేదని వెంకటలక్ష్మి బావురుమంది. భర్త చనిపోయినా పింఛన్ ఇవ్వట్లేదని చెప్పిన సుశీల.. 'ఆయన కొడుకొచ్చాడుగా వస్తాయిలే బాబూ' అంటూ ధీమా వ్యక్తం చేసింది. మంచంలో కదలలేని స్థితిలో ఉన్న బళ్ల గురువులు దగ్గరకు తీసుకెళ్లారు ఆ కాలనీ వాసులు. ఆయన భార్య కూడా అనారోగ్యంతో మంచం పట్టింది. ఆ స్థితిలోనూ వాళ్లు వైఎస్సార్ గురించి చెప్పుకొచ్చారు. 'కూడు.. గూడు ఇచ్చిన దేవుడయ్యా' అని చేతులెత్తి మొక్కారు.

## పిలిస్తే పలికే దేవుడాయన

'వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు నేను నందివాడ సర్పంచ్‌గా పనిచేశాను. ప్రజాపథం కార్యక్రమానికి సీఎం హోదాలో ఆయన మా ఊరొచ్చారు. మహిళనైన నన్ను ఎంతగానో గౌరవించారు. సీసీ రోడ్లు లేవని ఆయన దృష్టికి తెస్తే అప్పటికప్పుడు రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఊరికి 115 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారు. పేదవాడికి ఆపదొచ్చిందంటే ఏ పార్టీ అని కూడా చూడని మంచి నేత ఆయన. అందుకే ఈ ఊరంతా ఆయనంటే అభిమానిస్తారు. వైఎస్ జయంతిని ఊరంతా పండుగలా చేసుకుంటాం' అని కృష్ణా జిల్లా నందివాడకు చెందిన పెయ్యల రాణి ఆనందంతో చెప్పారు. తాను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డానంటే అది వైఎస్సార్ ఫీజురీయింబర్స్‌మెంట్ భిక్షేనని మండవల్లి మండలం లింగాలకు చెందిన ఉప్పల కిరణ్ తెలిపారు. 'నేను ఆయనతో కలిసి గుల్బర్గాలో ఎంబీబీఎస్ చదివాను. అప్పుడే ఆయన గొప్ప లీడర్‌గా ఉండేవారు. సీఎం అయ్యాక కూడా నన్ను మరిచిపోలేదు. గుండె లోతుల్లోంచి మిత్రుడికి వినిపించేలా హ్యాపీ బర్త్‌డే చెప్పాలనుంది' అని పాలకొల్లులో డాక్టర్ పెన్మత్స శివాజీరాజు చెప్పారు. 'తలలో రక్తం గడ్డకట్టి చావు బతుకుల మధ్య ఉన్న నన్ను ఆరోగ్యశ్రీ ఆదుకుంది. అప్పటి నుంచి కష్టం తెలియకుండా బతికాను. రోజూ ఆయనకు ప్రార్థన చేశాకే మరే పనైనా' అని రాజోలు మండలం శివకోడుకు చెందిన వీరవాణి పేర్కొంది. 'నేను కొబ్బరి కాయల వ్యాపారం చేస్తాను. మాకు వైఎస్సార్ ఇల్లు కట్టించారు. అందుకే రోజూ వ్యాపారం ప్రారంభించేటప్పుడు ఓ కొబ్బరికాయను ఆయన కోసం తీయడం ఆనవాయితీగా మారింది' అని శివకోడుకు చెందిన సత్యవతి చెప్పింది.



ఉప్పల కిరణ్

## అందరి గుండెల్లో గుడి..

ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పర్యటించిన సాక్షి బృందానికి దారిపొడవునా ఎంతో మంది వైఎస్సార్ అభిమానులు కలిశారు. 'ముసల్మాన్ కా జాన్.. వైఎస్సార్.. ఆయన ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్‌తో నేను మెడికల్ సీటు సంపాదించాను. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో పైసా కట్టకుండా సీటు వచ్చింది. నాకైతే వైఎస్సార్ 'అల్లా' మాదిరిగానే నన్ను ఆదుకున్నట్లు అనిపించింది' అని ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన వైద్యురాలు షేక్ ఆఫ్రిన్ చెప్పారు. 'మగ్గంపై నేసిన చీరలు అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే నాకు 2008లో గుండెలో రంధ్రం ఉందని తెలిసింది. నా వద్ద ఉన్న తెల్లకార్డుతోనే గుంటూరులోని ఆసుపత్రిలో చేర్చుకుని ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఈ భూమిపై నాకు నూకలు ఉన్నాయంటే అది వైఎస్సార్ పెట్టిన భిక్షే' అని ప్రకాశం జిల్లా ఈపూరుపాలెంకు చెందిన చేనేత కార్మికుడు జొన్నాదుల సుబ్బారావు ఆ మహానేత మేలును గుర్తు చేసుకున్నారు. 'ఆ మహానుభావుడు కండలేరు ఎడమ కాలువ తవ్వించడం వల్లే ఈ రోజు మా నోట్లోకి నాలుగు వేళ్లు వెళుతున్నాయి' అని నెల్లూరు జిల్లా పొదలకూరుకు చెందిన రైతు ఆకుల గంగిరెడ్డి ఆనందంతో చెప్పారు. 'మహనేత వైఎస్సార్ ఫీజురీయింబర్స్‌మెంట్ చలువ వల్లే ఈ రోజు నా కూతురు పోలీస్ శాఖలో కమ్యూనికేషన్స్ విభాగంలో రేడియో ఇంజనీర్‌గా పని చేస్తోంది. అప్పట్లో ఆయన ఇచ్చిన పావలా వడ్డీ రుణం మా కుటుంబానికి బాగా ఉపయోగపడింది' అని నెల్లూరు జిల్లా బంగారుపేటకు చెందిన కోనేటి రేవతి ఆనందంతో చెప్పింది. వైఎస్ చేపట్టిన రుణమాఫీ పథకం వల్లే అప్పుల ఊబి నుంచి బయటపడ్డామని, ఇందుకు ఆయనకు రుణ పడి ఉంటామని చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి మండలం ఇనగలూరుకు చెందిన యామల భాస్కర్ చెప్పారు.

## మెతుకు ఇచ్చిన దేవుడు.. మొక్కుతాం ఎప్పుడూ..

తూర్పుగోదావరి జిల్లా రాజోలులోని గోదావరి గట్టు పక్కన వెళ్తున్నప్పుడు కనిపించిన దృశ్యం.. వైఎస్సార్ ఫొటో, కేక్, చుట్టూ పదుల సంఖ్యలో జనం. ఏంటని అడిగితే చెప్పారు.. వాళ్లు వైఎస్సార్ పుట్టినరోజు చేసుకుంటున్నారట.. ఉపాధి కూలీలట. ఎక్కడ ఉంటే అక్కడ ఏటా అలా వైఎస్ పుట్టిన రోజుకు కేక్ కట్ చేయడం ఆనవాయితీ అన్నారు. అంత అభిమానమేంటన్న ప్రశ్నకు.. జయలక్ష్మి భూలక్ష్మి, అన్నమ్మ, మేరి, లక్ష్మమ్మ, చంద్రకళ, గ్రేసమ్మ పోటీపడి మరీ చెప్పారు. 'ఆయన దేవుడయ్యా.. ఉపాధి కూలీకి అన్నం పెట్టాలనుకున్నాడు. యంత్రాలు రానివ్వకుండా చేశాడు. ముద్ద నోటికెళ్తుందంటే ఆయన చలువే బాబు'. ఇలా ఒక్కొక్కరు ఒక్కో మాట చెప్పేటప్పుడు ప్రతి కళ్లలోనూ ఆనంద భాష్పాలు కన్పించాయి. 'నా కొడుకు పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడయ్యా.. ఫీజురీయింబర్స్‌మెంట్ వల్లే ఇది జరిగింది' మాణిక్యమ్మ మనసులోంచి తన్నుకొచ్చిన సంతోషమిది. కూలిపోయే ఇంట్లో చావలేక బతుకుతున్న మాకు వైఎస్ ఇల్లిచ్చాడు. పింఛను ఇప్పించాడు. ఆ మహారాజును ఎలా మరిచిపోతాం. వెంకట గోవిందమ్మ అన్న మాటిది. రాజన్నే దేవుడనే అక్కడున్న ఆ జనం మధ్య వైఎస్సార్ పుట్టిన రోజు ఓ పండుగ వాతావరణాన్నే తలపించింది.

## తరాలు మారినా... యువతరానికీ పెద్దే

తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లిలో సైకిళ్లపై ర్యాలీగా వెళ్తున్న యువత 'జోహార్ వైఎస్సార్...' అంటూ నినదిస్తోంది. ఆ ర్యాలీలో ఓ వ్యక్తి రాజన్న ఫొటో పట్టుకున్నాడు. వాళ్ల నినాదాలు ఉద్వేగంగా ఉన్నాయి. గుండె నిండా ప్రేమతో తన్నుకొచ్చే ఆవేశం వాళ్లలో కనిపించింది. ఎందుకీ సందడి... ప్రశ్న రాకముందే కుడుపూడి నరేష్ చెప్పడం మొదలుపెట్టాడు. 'రాజన్న బర్త్‌డే... మా ఊరిలో చాలామంది యువకులు ఆయన వల్లే బాగుపడ్డారు. రేపటి తరాలకు ఆయన గుర్తుండాలి. ప్రతి వ్యక్తికి ఆయన మంచి తెలియాలి. అందుకే ప్రతి పుట్టిన రోజూ గ్రాండ్‌గా చేస్తాం' అన్నాడు. 'ఇప్పటికీ ఆయన మాటలను యూట్యూబ్‌లో వింటాం. ఆరోగ్యశ్రీతో ఎంతో మందిని ఆదుకున్న మహా మనిషి అని ఆయన గురించి చెప్పుకుంటాం' వై.షరీన్ నోటి వెంట వచ్చిన మాటలివి. 'యూత్‌కు ఆయనే ఫేవరెట్ లీడర్' ప్రకాశ్, పవన్‌కుమార్, ఉదయ్ చందులో ఉప్పొంగే ఆనందం లోంచి వినిపించిన మాటలివి.

## అల్లాని మొక్కుదాం... సల్లగుండాలని

మామిడికుదురులో ముస్లిం మైనార్టీలు రాజన్నను దేవుడుగానే చూస్తున్నారు. ఆయన పుట్టిన రోజు వేడుకల కోసం చేస్తున్న సన్నాహాలే దీనికి నిదర్శనం. ఆ ఊరి గుండా వెళ్తున్నప్పుడు ఓ ఇంటి ముందు సన్నివేశం ఆపింది. ముజఫర్ అలీ, ఎండీ రఫీ, షబ్బీర్ అలీ, అబిద్ హుస్సేన్, అలీ రజా, సకీర్ హుస్సేన్ గుంపుగా ఓ ఇంటి ముందు ఆగారు. ఆ ఇంటి పెద్దావిడకు వైఎస్సార్ ఫొటో చూపించి చెబుతున్నారు.. 'మన ముస్లింలకు నిజమైన బతుకునిచ్చిన దేవుడమ్మా.. ఊళ్లో ఆయన పుట్టిన రోజు చేస్తున్నాం.. ఇంటిల్లిపాది రావాలి. ఆయన కుటుంబాన్ని సల్లగా చూడాలని ఇంటిల్లిపాది దువా చేయాలి' అన్నారు. 'ఇంత హడావుడా?' ఈ ప్రశ్న వాళ్లకు ఇబ్బందిగా అనిపించిందేమో.. 'ఏం సార్.. వైఎస్సార్ మా ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ ఓ వరం. దాంతో ఎంతోమంది గవర్నమెంట్ ఉద్యోగాల్లోకి వెళ్లారు. మా ఊరి నుంచే 20 మంది ఉన్నారు. ప్రతి ముస్లింకూ ఆయన పుట్టిన రోజు రంజాన్ అంత పెద్ద పండుగ' అంటూ భావోద్వేగంగా చెప్పారు.



నెల్లూరు జిల్లాకు చెందిన రైతు ఆకుల గంగిరెడ్డి

# అరుదైన నాయకుడు వైఎస్సార్



### చిన్న కార్యకర్తనైన నన్ను ఎంపీని చేశారు



వైఎస్సార్ జీవితం.. తెరిచిన పుస్తకం. ఆయన జీవితంలో రహస్యమంటూ ఏమీ లేదు. నాలాంటి వాళ్లు వైఎస్సార్ జీవితంలో వేల మంది ఉంటారు. 1983లో ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నేను రాజమండ్రిలో చిన్న కార్యకర్తను. అలాంటి నన్ను రెండుసార్లు ఎంపీగా గెలిపించారు.

– ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీ, రాజమహేంద్రవరం

### మంచి మెత్తని మనసున్న రెడ్డి.. వైఎస్సార్



ఆంధ్రప్రదేశ్‌లో నేను చూసినంత వరకు ఎక్కువ ప్రజాదరణ పొందిన వ్యక్తులు.. ఎన్టీఆర్, వైఎస్సార్ మాత్రమే. అంతటి ప్రజాదరణ పొందడం సామాన్య విషయం కాదు. వైఎస్‌కి ఉన్న ప్రజాదరణను చూసి నేను ఆయన్ను అభిమానించాను. కడప నుంచి వచ్చినా మంచి మెత్తని మనసున్న రెడ్డి.. వైఎస్సార్.

– జస్టిస్ జాస్తి చలమేశ్వర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

### వైఎస్సార్‌కు సాటి మరొకరు లేరు



సొంత బలంతో, సొంత వ్యూహాలతో అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి, తిరుగులేని ప్రజాదరణతో ముఖ్యమంత్రి అయిన నేత ఆయనొక్కరే. 2009 ఎన్నికల్లో పార్టీ గెలిచినా, ఓడినా తనదే బాధ్యత అని ప్రకటించుకున్న వైఎస్సార్‌కు సాటి మరొకరు లేరు.

– పొత్తూరి వెంకటేశ్వరరావు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్

### రాజుకు ఉండాల్సిన లక్షణాలు ఆయనలో కనిపించాయి



1987లో కడప ఎస్పీగా ఉన్నప్పుడు తొలిసారిగా వైఎస్సార్‌ను చూశాను. ఒక రాజుకు ఉండాల్సిన లక్షణాలు ఆయనలో నాకు కనిపించాయి. ఆయనెప్పుడూ మనసులో ఒకటి పెట్టుకుని బయటికి వేరే విధంగా మాట్లాడేవారు కాదు. అధికారులను తన కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు. అధికారులతో చాలా స్నేహపూర్వకంగా ఉండేవారు. చాలా ముందుచూపు ఉన్న వ్యక్తి.. వైఎస్సార్.

– కె.అరవిందరావు, మాజీ డీజీపీ

### అనవసర సమీక్షలు ఉండేవి కాదు



టైమ్ మేనేజ్‌మెంట్ గురించి వైఎస్సార్ దగ్గర నేర్చుకోవాలి. ఆయన హయాంలో అనవసర సమీక్షలు, చర్చ ఉండేది కాదు. మానవత్వం ఉన్న మనిషి.. వైఎస్సార్.

– ఐవైఆర్ కృష్ణారావు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

### పూర్తి స్వేచ్ఛ ఉండేది



వైఎస్సార్ హయాంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. అధికారులతో ఆయనకు సత్సంబంధాలు ఉండేవి. మంచి రాజకీయవేత్త. సమయపాలన బాగా పాటించేవారు.

–ఎస్ఎస్పీ యాదవ్, మాజీ డీజీపీ

### తెలుగు జాతి ఉన్నంతవరకు ఆయన కీర్తి నిలుస్తుంది



జీవితంలో చివరి క్షణం వరకు సమాజ క్షేమం, అందరిలో చెరగని చిరునవ్వును కోరుకున్న అరుదైన మహానాయకుడు.. వైఎస్సార్. ఆయన కీర్తి తెలుగు జాతి ఉన్నంతవరకు నిరంతరం దేదీప్యమానమై నిలిచి ఉంటుంది. వైఎస్సార్.. మంచి స్నేహితుడు, కల్లాకపటం లేనివాడు, అరుదైన మిత్రుడు. రాజకీయాల్లో ఇంకా ఉండాల్సిన సమయం, వయసు ఉన్నా ఆయన దూరమవడం బాధాకరం.

– మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య

### నేను, వైఎస్ అవిభక్త కవలలం



1966 నుంచి 2009, సెప్టెంబర్ 2 వరకు వైఎస్సార్‌తో కలిసి నడిచే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం. నేను, వైఎస్సార్ అవిభక్త కవలలం. ఆయనకు నాతోపాటు ఎంతోమంది ఆత్మబంధువులు ఉన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి జనాకర్షక పథకాలతో ఆయన పేదలకు మేలు చేశారు. దేశం గర్వించే అతికొద్ది మంది నాయకుల్లో వైఎస్సార్ అగ్రగణ్యుడు.

– కేవీపీ రామచంద్రరావు (రాజ్యసభ ఎంపీ), వైఎస్సార్ ప్రాణస్నేహితుడు





### వైఎస్సార్ చేసినన్ని మంచి పనులు ఎవరూ చేయలేదు

సీఎంగా వైఎస్సార్ చేసినన్ని మంచి పనులు గతంలో ఏ సీఎం చేయలేదు. పేదల కోసమే తపించే మంచి మనసున్న మనిషి. ఆరోగ్యశ్రీ, ఫీజుల చెల్లింపులాంటివాటితో వారి కన్నీళ్లు తుడిచారు.

–అక్కినేని నాగార్జున, ప్రముఖ సినీ నటుడు



### వైఎస్‌ది వెన్నలాంటి రైతు మనసు

వైఎస్‌ది వెన్నలాంటి రైతు మనసు. తెలుగుదనానికి నిలువుటద్దం. తీసుకున్న నిర్ణయాలకు నిబద్ధతతో కట్టుబడి ఉండే వ్యక్తిత్వం ఆయనది. తన పాలనలో పేదలకు, రైతులకు చేయగలిగినంత చేసిన అరుదైన రాజకీయ నేత.. వైఎస్సార్.

–గోరటి వెంకన్న, ప్రముఖ కవి



### ప్రతి పేదవాడి గుండెలో జీవించే ఉన్నారు

పాదయాత్ర అనుభవాలతో ఆరోగ్యశ్రీకి వైఎస్సార్ రూపకల్పన చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎక్కువ చొరవ చూపేవారు. అన్ని రంగాలపై మంచి పట్టున్న వ్యక్తి. సంక్షేమ పథకాలతో ప్రతి పేదవాడి గుండెలో జీవించే ఉన్నారు.

– రమాకాంత్‌రెడ్డి, మాజీ సీఎస్

### వైఎస్సార్ హయాంలో అధికారులు ఎక్కడా ఇబ్బంది పడలేదు



వైఎస్సార్ మహానాయకుడు, గొప్ప విలక్షణ మనస్తత్వం ఉన్న మనిషి. 2004 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నాకు తిరిగి వైఎస్సార్ ప్రభుత్వంలోనూ పనిచేసే అరుదైన అవకాశం దక్కింది. వైఎస్సార్ హయాంలో అధికారులు ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఆయన మమ్మల్ని చాలా స్వేచ్ఛగా పనిచేసుకోనిచ్చేవారు. అధికారుల సూచనలను తప్పకుండా పరిగణనలోకి తీసుకునేవారు. ఆయనకు పాలనా యంత్రాంగంపై మంచి పట్టు ఉంది.

– మోహన్‌కందా, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

చేపలు ఇవ్వడం కంటే పట్టడం నేర్పాలి

1985లో వెంకటగిరి దగ్గర పంజాం అనే గ్రామానికి ఏదో పని మీద వైఎస్ వెళ్లారు. అక్కడ ఓ దళిత కుటుంబం ఆయనకు తారసపడింది. ఆ దళితుడి పేరు పెంచలయ్య. 'ఎలా ఉన్నావ్ పెంచలయ్య' అని అడిగితే 'కళ్ల నీళ్లు తాగితే తప్ప కూటిన్నీళ్లు దొరకడం లేదు సార్' అన్నాడు పెంచలయ్య. వైఎస్ చాలా చలించిపోయారు. ఆర్థిక సాయం చేస్తే వృధా కావచ్చు. వృధా చేసుకోవచ్చు. అందుకే అతనికి కాడెద్దులు, మడకను ఇప్పించారు. అతడి జీవనోపాధికి బెంగలేకుండా చూశారు.

మహానేత 70వ జయంతి

# రైతు దినోత్సవం



# అభివృద్ధికి చిరునామా

వైఎస్సార్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పరుగులు పెట్టింది. అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. తరతమ బేధం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాయి. అందులో కొన్ని..

## ఆరోగ్య శ్రీ

- పేదలు, అల్పాదాయ వర్గాల వారికి పెద్ద పెద్ద జబ్బులకు సైతం ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ రాష్ట్ర ప్రజలకు వైద్య ప్రదాతగా మారింది. 18 రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

**ఉమ్మడి ఏపీలో కేటాయింపులు: 4,610 కోట్లు**

**విభజిత ఏపీలో కేటాయింపులు: 3,500 కోట్లు**

పథకం ప్రారంభం
**2007 ఏప్రిల్ 1**
పథకం వర్తించే వ్యాధుల సంఖ్య **1995**
తెలుగు రాష్ట్రాల్లో వైద్యం పొందిన వారు మొత్తం **94.5** లక్షలు

## 108 అంబులెన్సుల పథకం

- వైద్యం కోసం అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాల్సిన వారు రాష్ట్రంలో ఏ ప్రాంతం నుంచి ఫోన్ చేసినా అరగంటలో అక్కడికి అంబులెన్సు చేరుకుని రోగిని ఆస్పత్రికి చేర్చాలనే ఉదాత్త ఆశయంతో వైఎస్సార్ 108 పథకానికి శ్రీకారం చుట్టారు. దీనిద్వారా రోడ్డు ప్రమాద బాధితులు, గర్భిణులు, గుండె జబ్బు బాధితులను తక్షణం ఆస్పత్రులకు చేర్చి వైద్యం చేయించడం ద్వారా లక్షలాది మంది ప్రాణాలను కాపాడారు.

**ఉమ్మడి ఏపీలో కేటాయింపులు: 611.94 కోట్లు**

**విభజిత ఏపీలో కేటాయింపులు: 351 కోట్లు**

పథకం ప్రారంభం
**2005 ఆగస్ట్ 15**
రెండు తెలుగు రాష్ట్రాల్లో అంబులెన్సులు **835**
ఇప్పటి వరకూ లబ్ధిపొందిన వారు **79.70** లక్షలు

## 104 సంచార వైద్యశాలలు

- మారుమూల ప్రాంతాలకు అంబులెన్సుల్లో వైద్య సిబ్బంది వెళ్లి రోగులకు సాధారణ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులిప్పించాలనే లక్ష్యంతో వైఎస్సార్ ఈ పథకాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో ఉండి ఆస్పత్రుల వరకు వెళ్లలేక బాధపడే లక్షలాది మందికి ఈ పథకం ఎంతో ఉపయోగపడింది.

**ఉమ్మడి ఏపీలో కేటాయింపులు: 467.72 కోట్లు**

**విభజిత ఏపీలో కేటాయింపులు: 279.89 కోట్లు**

పథకం ప్రారంభం
**2008 డిసెంబర్ 25**
తెలుగు రాష్ట్రాల్లో మొత్తం అంబులెన్సులు **492**
ఇప్పటి వరకూ లబ్ధి పొందిన వారు **11.33** కోట్లు
(ఒకటి అంతకంటే ఎక్కువసార్లు లబ్ధి పొందిన వారితో కలిపి ఈ సంఖ్య)

## రైతులకు ప్రోత్సాహకం

- అప్పట్లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించింది. అయితే రుణాలు తీసుకుని చెల్లించిన వారికి ప్రయోజనం దక్కలేదు. వీరికి వైఎస్సార్ సొంతంగా నగదు అందించారు.

| సర్కారు ఇచ్చిన ప్రోత్సాహకం ఒక్కొక్కరికి | లబ్ధి పొందిన రైతులు | వెచ్చించిన మొత్తం |
|---|---|---|
| 5000 | 36 లక్షలు | 1,800 కోట్లు |

## జలయజ్ఞం

తలపెట్టిన ప్రాజెక్టులు: 86
పూర్తయిన ప్రాజెక్టులు : 17
పాక్షికంగా పూర్తయినవి : 24
కొత్తగా నీరందిన విస్తీర్ణం: 18.48 లక్షల ఎకరాలు
స్థిరీకరించిన ఆయకట్టు : 2.07 లక్షల ఎకరాలు
ఖర్చు చేసిన మొత్తం **54,000** కోట్లు (దాదాపు)

2004లో ఉమ్మడి ఏపీలో వ్యవసాయ దిగుబడులు **107** లక్షల టన్నులు

2009 నాటికి వ్యవసాయ దిగుబడులు **204** లక్షల టన్నులు

## భూ పంపిణీ

ఐదేళ్లలో లబ్ధి పొందిన కుటుంబాలు **4,96,760**

పంపిణీ చేసిన భూమి (ఎకరాల్లో) **6,94,864**

## సెజ్‌లతో ఉపాధి

వైఎస్ హయాంలో ఉమ్మడి ఏపీలో కార్యకలాపాలు ప్రారంభమైన సెజ్‌లు : 76

13 జిల్లాల ఏపీలో సెజ్‌లు : 28

ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న వారు: 2 లక్షలు (దాదాపు)

ఎగుమతుల విలువ : రూ.70,000 కోట్లు




పథకం ప్రారంభం
**ఏప్రిల్, 2006**
2004కు ముందు ఉమ్మడి ఏపీలో పింఛనుదారుల సంఖ్య **19.02** లక్షలు
2009 నాటికి ముందు ఉమ్మడి ఏపీలో పింఛనుదారుల సంఖ్య **67.21** లక్షలు

పథకం ప్రారంభం
**01- 07-2004**
13 జిల్లాల ఏపీలో లబ్ధిపొందుతున్న మహిళలు **89** లక్షలు



పథకం ప్రారంభం
**2009 ఫిబ్రవరి 6**
ఉమ్మడి ఏపీలో లబ్ధిదారుల సంఖ్య **34,55,031**
13 జిల్లాల ఏపీలో లబ్ధిదారుల సంఖ్య **24.29** లక్షలు
వారి పేరిట ఉన్న కార్పస్ ఫండ్ **1,806** కోట్లు

## సంతృప్త స్థాయి పింఛన్లు

2004కు ముందు ఉమ్మడి ఏపీలో కేవలం 19 లక్షల మంది మాత్రమే వృద్ధాప్య, వితంతు పెన్షన్ పొందుతుండేవారు. అది కూడా మూడు నెలలకొకసారి కేవలం రూ. 70 మాత్రమే వచ్చేది. ఈ జాబితాలోని వ్యక్తులు ఎవరైనా చనిపోతేనే కొత్త వారికి అవకాశం వచ్చే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజశేఖర రెడ్డి అర్హులందరికీ (సంతృప్త స్థాయిలో) ప్రతి నెలా ఒకటో తారీఖుకే రూ. 200 పింఛన్‌ను అందించారు.

## పొదుపు సంఘాలకు పావలా వడ్డీ

వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యే నాటికి ఒక్కో బ్యాంకు ఒక్కో రకంగా రుణ గ్రహీతల నుంచి 12.25 శాతం నుంచి 14.25 శాతం వరకూ వడ్డీ వసూలు చేసేవి. రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలకు ఈ అధిక వడ్డీ పెను భారంగా ఉండేది. వీరికి వడ్డీ భారాన్ని తగ్గించాలని అప్పట్లో వైఎస్ సర్కారు సాహసోపేతంగా పావలా వడ్డీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ పథకం స్ఫూర్తితో ప్రస్తుతం సున్నా వడ్డీ పథకం కూడా అమలులోకి వచ్చింది. 13 జిల్లాల ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం 7.68 లక్షల పొదుపు సంఘాలు ఉండగా, అందులో 2.90 లక్షల సంఘాలు వైఎస్ సీఎంగా ఉన్న 2004–09 మధ్యలోనే ఏర్పడడం గమనార్హం.

## అభయ హస్తం..

పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు 60 ఏళ్ల వయసు దాటిన తర్వాత బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి తిరస్కరిస్తున్న నేపథ్యంలో వారికి తగిన ఆదాయ భద్రత కల్పించాలనే ఆశయంతో వైఎస్సార్.. 'అభయ హస్తం' పథకాన్ని రూపొందించారు. తర్వాత కొద్ది రోజులకే ఆయన మరణించినా పథకం కొనసాగింది. డ్వాక్రా మహిళలు ప్రతి రోజూ రూపాయి చొప్పున, ప్రభుత్వం వారి పేరిట ప్రతి రోజూ రూపాయి చొప్పున ఇన్సూరెన్సు సంస్థకు చెల్లించాలనేది ఈ పథకం ఉద్దేశం. ఇలా చెల్లించిన వారికి 60 ఏళ్ల వయసు తర్వాత ఒక్కొరికి గరిష్టంగా రూ. 2,600 పెన్షన్ అందించడం ఈ పథకం ఉద్దేశం.

## విద్యాభివృద్ధికి ఎనలేని కృషి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఏర్పాటు చేయనన్ని విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేశారు. కేవలం అయిదేళ్ల కాలంలోనే శ్రీకాకుళం, ఒంగోలు, కడప, ఆదిలాబాద్ జిల్లాల్లో వైద్య కళాశాలలను, కడపలో దంత కళాశాలను ఏర్పాటు చేశారు.

**వైఎస్సార్ హయాంలో ఏర్పాటైన విశ్వవిద్యాలయాలివీ.. :** ఆది కవి నన్నయ వర్సిటీ (రాజమండ్రి), యోగి వేమన వర్సిటీ (కడప), అంబేడ్కర్ వర్సిటీ (శ్రీకాకుళం), కృష్ణా వర్సిటీ (మచిలీపట్నం), రాయలసీమ వర్సిటీ (కర్నూలు), విక్రమ సింహపురి వర్సిటీ (నెల్లూరు), శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ (తిరుపతి), శ్రీ వెంకటేశ్వర వేదిక్ వర్సిటీ (తిరుపతి), వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ (పశ్చిమగోదావరి), జేఎన్‌టీయూ (కాకినాడ), జేఎన్‌టీయూ (అనంతపురం), రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీ (హైదరాబాద్), దామోదరం సంజీవయ్య లా వర్సిటీ (విశాఖ), స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (విజయవాడ), తెలంగాణ వర్సిటీ (నిజామాబాద్), మహాత్మాగాంధీ వర్సిటీ (నల్గొండ), పాలమూరు వర్సిటీ (మహబూబ్‌నగర్), శాతవాహన వర్సిటీ (కరీంనగర్), జేఎన్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ (హైదరాబాద్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (హైదరాబాద్).

## పారిశ్రామిక పరుగులు

వైఎస్ఆర్ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడుల సాధనలో సగటున 54 శాతం వృద్ధి నమోదైంది. పెట్టుబడుల ఆకర్షణలో ఉమ్మడి ఏపీ దేశంలోమొదటి స్థానానికి చేరుకుంది. ఆ స్థాయి వృద్ధిరేటు వైఎస్‌కు ముందుగానీ, తర్వాతగానీ నమోదు కాకపోవడం గమనార్హం. ఐటీ, ఇన్‌ఫ్రా, ఫార్మా, తయారీ, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ ఇలా అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే, బయోటెక్నాలజీ పార్క్, గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, ప్రత్యేక ఆర్థికమండళ్లు, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కైజెన్ టెక్నాలజీస్ వంటివి ప్రారంభమయ్యాయి.

## ఎగుమతుల వృద్ధి ఇలా...( గణాంకాలు రూ. కోట్లలో)




2003-04 మొత్తం ఎగుమతుల విలువ **15,381** కోట్లు

2009-10 నాటికి ఎగుమతుల విలువ **73,143** కోట్లు



## రైతులకు ఉచిత విద్యుత్

పథకం ప్రారంభం : 2004 మే 15

తెలుగు రాష్ట్రాల్లో లబ్ధి పొందుతున్న రైతులు **40.25** లక్షలు

2004 మే 21 వరకూ ఉన్న బకాయిల మాఫీ మొత్తం **1,250** కోట్లు

వైఎస్సార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైలుపై సంతకం చేశారు. అప్పటి నుంచి పలు ప్రభుత్వాలు మారినా పథకం కొనసాగుతోంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 40.25 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో పంపు సెట్టు కింద కనిష్టంగా 5 ఎకరాలు సాగవుతుందని అంచనా. ఈ ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్ ఛార్జీ చెల్లించకుండా 2.01 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

## పోటీపడి 'మన్నవరం' సాధన

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) విద్యుత్తు ఉపకరణాల తయారీ ప్రాజెక్టును తమ రాష్ట్రానికే సాధించుకోవాలని కర్ణాటక, తమిళనాడు పోటీ పడగా పట్టుబట్టి వైఎస్సార్ దీనిని రాష్ట్రానికి తలమానికంగా తీసుకొచ్చారు. అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో కొట్లాడి రాష్ట్రానికి మన్నవరం ప్రాజెక్టు తెచ్చిన ఘనత వైఎస్సార్ కే దక్కింది. హైదరాబాద్‌కు బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు (బిట్స్) క్యాంపస్‌ను తెచ్చిన ఘనతా దివంగత మహానేతదే.

## ఫీజు రీయింబర్స్‌మెంట్

విద్యార్థులందరికీ ఉచితంగా ఉన్నత విద్య అందించే ఆశయంతో వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రూ. 2 వేల కోట్లతో ప్రాంభించారు. ఆ తర్వాత 2012–13కు రూ.5 వేల కోట్లకు చేరింది. ప్రతి సంవత్సరం ఉమ్మడి రాష్ట్రంలో 30 లక్షలకు పైన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల లబ్ధిపొందారు. రాష్ట్ర విభజన తర్వాత 13 జిల్లాల్లో 16 నుంచి 17 లక్షల మంది విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులుగా నిలిచారు. అయితే తెలుగు దేశం ప్రభుత్వం అరకొర నిధులు ఇచ్చి పథకాన్ని నీరుగార్చింది.

## ట్రిపుల్ ఐటీల ఏర్పాటు

నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో బాసర (తెలంగాణ), నూజివీడు (కోస్తా), ఇడుపులపాయ (రాయలసీమ)లో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. వీటిలో చదివిన వేలాది మంది ఇప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కందిలో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కూడా ఆయనే ఏర్పాటు చేయించారు. అప్పట్లో విదేశాలకు వెళ్లడానికి వీసా కావాలంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల వారు కూడా చెన్నైకి వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో వైఎస్ ఎంతో కృషి చేసి హైదరాబాద్‌కు అమెరికన్ కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని తీసుకొచ్చారు.

– సాక్షి, అమరావతి

# మేరునగధీరుడు

## విద్యార్థి దశ నుంచే నాయకుడిగా ఎదిగిన వైఎస్సార్

- డాక్టర్‌గా రూపాయికే వైద్య సేవలు
- ఎమ్మెల్యేగా, ఎంపీగా హ్యాట్రిక్
- ప్రతిపక్ష నేతగా ఎన్నో పోరాటాలు
- సంతృప్తస్థాయిలో పథకాల అమలు

**సాక్షి, అమరావతి:** వైఎస్ రాజశేఖరరెడ్డి 1949 జూలై 8వ తేదీన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని సీఎస్ఐ క్యాంప్‌బెల్ మిషన్ ఆస్పత్రిలో జన్మించారు. తల్లి జయమ్మ, తండ్రి రాజారెడ్డి. పాఠశాల విద్యను బళ్లారిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో పూర్తి చేశారు. విజయవాడ లయోలాలో కాలేజీ విద్య చదివారు. అనంతరం గుల్బర్గాలోని మహదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో హౌస్ సర్జన్ పూర్తి చేశారు. తరువాత కొద్దిరోజుల పాటు జమ్మలమడుగులోని సీఎస్ఐ క్యాంప్‌బెల్ ఆస్పత్రిలో వైద్యాధికారిగా పనిచేశారు. 1973 నుంచి పులివెందులలో తన తండ్రి వైఎస్ రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలందించారు. ఆ కాలంలోనే రూపాయి వైద్యునిగా పేరు ప్రఖ్యాతులందుకున్నారు. రాజకీయాల్లో ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎదిగారు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు వైఎస్ రాజశేఖరరెడ్డిలోని నాయకత్వ లక్షణాలు చిన్ననాటి నుంచే వచ్చాయి. విజయవాడ లయోలా కాలేజీలో చదువుతున్నప్పుడే మొలకెత్తిన నాయకత్వ పటిమ గుల్బర్గాలోని ఎంఆర్ వైద్య కళాశాలలో వైద్య వృత్తిని అభ్యసిస్తున్న సమయానికి ఆ కాలేజీ విద్యార్థి సంఘం నేతగా ఎదిగేలా చేసింది. అనంతరం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్ చేస్తున్నప్పుడు అక్కడి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేపట్టారు. హౌస్‌సర్జన్ల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థుల సమస్యలకు పరిష్కారాన్ని చూపించారు. ప్రజల కష్టాలు, సమస్యలపై ఆనాటి నుంచే వైఎస్సార్‌కు తీవ్రంగా స్పందించే నైజం ఉండేది.

### పోరాటమే ఊపిరిగా..

రాజశేఖరరెడ్డి రాత్రికి రాత్రి నాయకుడిగా ఎదగలేదు. కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లతో పదవులను అధిష్టించలేదు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తొలినుంచీ పోరాటమే ఊపిరిగా సాగుతూ వెళ్లారు. చివరకు ప్రజల్లో వైఎస్‌కు పెరుగుతున్న అభిమానాన్ని, మద్దతును చూసి సొంత పార్టీ నేతలే ఆయనకు అడగుడుగునా అడ్డంకులు సృష్టించారు. అయితే.. ప్రజల కోసం తాను చేపట్టిన పోరాటాన్ని వైఎస్ ఏనాడూ ఆపలేదు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో సొంత పార్టీ ముఖ్యమంత్రులపైనే పోరాటం సాగించిన ధీరత్వం వైఎస్‌ది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా కాంగ్రెస్ పార్టీలో హేమాహేమీలనదగ్గ సీనియర్ నేతలను ఢీకొట్టి తనను నమ్ముకున్న వారికి న్యాయం చేయించిన పోరాట యోధుడు వైఎస్. పార్టీలో తనను అసమ్మతి వాదిగా ముద్ర వేసినా.. ఆర్థికంగా, మానసికంగా అణచేసేందుకు ప్రయత్నించినా ప్రజల కోసం తాను ఎంచుకున్న పంథానుంచి వీసమెత్తు కూడా పక్కకు జరగలేదు. సిద్ధాంత పరంగానే తప్ప ఏనాడూ ఆయన పోరాటం వ్యక్తిగత స్థాయిలో ఉండేది కాదు. అందుకే, ఆయన్ను రాజకీయంగా నిర్వీర్యం చేయాలని ప్రయత్నించినా ప్రజలు మాత్రం వెంటే నడిచారు. చివరకు 2004కు ముందు పూర్తిగా కుప్పకూలే దశలోకి చేరిన కాంగ్రెస్ పార్టీయే ఆయన బాటలో నడిచే పరిస్థితికి వచ్చింది. సొంత పార్టీలో అలా ఉంటే.. బయట తెలుగుదేశం పార్టీతో, ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి ప్రజావ్యతిరేక పాలనపై వైఎస్ పోరాటం మరో ఎత్తు. 1995 నుంచి 2004 ఎన్నికల వరకు చంద్రబాబు ప్రజాకంటక పాలనపై వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక రూపాల్లో పోరాటం సాగించారు. సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్తు చార్జీల పెంపు ఇలా ఎన్నో అంశాలపై ప్రజల తరఫున ప్రభుత్వంపై ఉద్యమించారు. విద్యుత్తు చార్జీల పెంపుపై చివరకు తన ప్రాణాలు పోయినా ఫర్వాలేదంటూ ఆమరణ నిరశన దీక్షలు, చలో అసెంబ్లీ కార్యక్రమాలతో నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని గడగడలాడించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ.. వారి బాధలు అర్థం చేసుకుని సమస్యలు పరిష్కరించడమే రాజకీయాలకు పరమార్థమని చాటిచెప్పిన వ్యక్తి వైఎస్. ప్రతిపక్ష నేతగా ఆయన ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు 2003 ఏప్రిల్ 9 నుంచి ప్రజాప్రస్థానం పేరుతో చేపట్టిన పాదయాత్ర చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచింది. మండు వేసవిలో 1,467 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

### నమ్మకానికి చిరునామా..

వైఎస్ రాజశేఖరరెడ్డి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారు. తాను నమ్మిన వారిని తన కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా ప్రేమించే నాయకుడు ఆయన. అందుకే ఆయనతో పాటు నడిచిన ప్రతి ఒక్కరూ చివరికంటా ఒకే జట్టుగా ముందుకు కదిలారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆదుకున్నారు. పంచెకట్టుతో అచ్చమైన తెలుగింటి పెద్దగా, తనదైన హావభావాలతో అందరికీ ప్రేమను పంచారు. వైఎస్సార్‌ది మాట ఇస్తే తప్పని నైజం.



## ఓటమి ఎరుగని నేత..

**1975లో** ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా నియమితులై పూర్తిస్థాయి రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1978 ఎన్నికల్లో వైఎస్సార్ తొలిసారిగా కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. తరువాత వరుసగా 1983, 1985 ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ సాధించారు. అనంతరం రాజకీయాల్లో మరో మెట్టు ఎక్కి 1991, 1996, 1998 ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి హ్యాట్రిక్ విజయాలు సాధించారు. మళ్లీ 2004, 2009 ఎన్నికల్లో పులివెందుల నుంచి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి విజయాన్ని కైవసం చేసుకున్నారు. తాను పోటీ చేసిన ఏనాడూ ఓటమి ఎరుగని నేతగా చరిత్ర పుటల్లో కొత్త అధ్యాయాన్ని లిఖించారు. 1980లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా, 1982లో ఎక్సైజ్, విద్యా శాఖ మంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలందించారు. 1983 నుంచి 1985 వరకు, 1998 నుంచి 2000 వరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1999–2003 వరకు ప్రతిపక్ష నేతగా అనేక పోరాటాలు సాగించారు.

## ఇచ్చిన హామీలే కాదు.. మరెన్నో అమలు

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగిన ప్రభుత్వ పాలన మరో స్వర్ణ యుగమేనని చెప్పుకోవాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనే కాకుండా పాదయాత్రలో ప్రజల బాధలను, కష్టాలను దగ్గర్నుంచి చూసిన నాయకుడిగా సమస్యలను పరిష్కరించే దిశగా అనేక పథకాలను అమలు చేశారు. తన పాలనపై నమ్మకంతో కొత్త హామీలు ఇవ్వకుండానే 2009లో ఎన్నికలకు వెళ్లి ఘన విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే దురదృష్టవశాత్తు అదే ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన హెలికాఫ్టర్ ప్రమాదంలో మరణించారు. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వాటన్నిటిని గుండె నిబ్బరంతో ఎదురొడ్డి నిలిచి ఎదుర్కొన్న ధీశాలి. ఎంతో నేర్పు, ఓర్పులతో ఒక్కో మెట్టు పైకెక్కుతూ అగ్రస్థానానికి ఎదిగిన మేరునగ ధీరుడు.

**పేదవాడిని సాటి మనిషిగా చూడాలి**

ఇది 30 ఏళ్ల క్రితం సంగతి. వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక రోజు మంగంపేట మైన్స్ దగ్గరికి వెళ్లారు. కొందరు కూలీలు, పని వాళ్లు భోజనం చేసి వెళ్లిన చోట మెతుకులు పడి ఉండటం చూసి.. 'ఈ మెతుకులు బతికిస్తాయి. బతుకునిస్తాయి. వీటిని తొక్కకూడదు' అంటూ శ్రద్ధగా ప్రతి మెతుకునూ ఏరి పక్కన పడేశారు. ఎవరో వచ్చి 'అయ్యయ్యో.. మీరెందుకు ఏరుతారు సార్. ఆ కూలివాళ్లకే చెప్పొచ్చుగా' అని సాయానికి రాబోతే 'ఏం.. కూలివాళ్లు సాటి మనుషులు కాదా.. ఇప్పుడే అన్నం తిని విశ్రాంతి తీసుకుంటుంటే వాళ్లకు పని చెప్పాలా?' అన్నారు. ఇలాంటి ప్రవర్తన చాలామంది చూపించరు. వైఎస్‌కు ఆ మనసు ఉంది.

# మహానేత 70వ జయంతి
# రైతు దినోత్సవం





ఏదైనా గ్రామానికి వెళ్లినప్పుడు
ధైర్యంగా మైకు పట్టుకుని..
ఈ గ్రామంలో ఇల్లు లేని వాళ్లు,
నిజంగా అర్హులై ఉండీ పింఛన్
రాని వాళ్లు, తెల్ల కార్డు లేని వాళ్లు
ఎవరైనా ఉంటే చేతులెత్తండి అంటే..
ఒక్కరు కూడా చేయి పైకి ఎత్తని రీతిలో
సంక్షేమ పాలన సాగాలన్నది
దివంగత ముఖ్యమంత్రి
వైఎస్ రాజశేఖరరెడ్డి కల.
ఆ కలను సాకారం చేసే రీతిలో
ఆయన పాలన సాగుతున్న వేళ
అనూహ్యంగా ఆయన మనందరికీ
అందనంత దూరంగా వెళ్లిపోయారు.
ఆయన ఇంతగా ప్రజల బాగు
కోసం పరితపించడానికి కారణం
ఏంటంటే..ముఖ్యమంత్రి కావడానికి
ముందు సాగించిన
'ప్రజా ప్రస్థానం'లో ప్రజల కష్టాలు,
కడగండ్లను కళ్లారా చూడటమే.

అది 2003.. రాష్ట్ర ప్రజల్లో అదోరకమైన నైరాశ్యం.. ఆదుకుంటారనుకున్న పాలకులు వారి స్వార్థం చూసుకున్నారు.. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు.. రైతుల పరిస్థితి మరీ దయనీయం.. చేతి వృత్తుల వారికి పూట గడవడమే గగనమైన దుస్థితి.. ఏలికలకు ఎన్నిమార్లు వినతులు సమర్పించినా బూడిదలో పోసిన పన్నీరే.. అన్న చందంగా మారింది.. తమ గోడు వినే వారెవ్వరూ లేరా? ఇక తమ జీవితాలు ఇంతేనా? భవిష్యత్‌ను తలుచుకుంటే కంటిమీద కునుకు రాని పరిస్థితి.. సరిగ్గా అదే సమయంలో నేనున్నానంటూ ప్రజల మధ్యకు వచ్చారు అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖరరెడ్డి. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ప్రజల మధ్య ఉండేందుకే ఇష్టపడిన ఆయన 'ప్రజా ప్రస్థానం' పేరుతో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి 2003 ఏప్రిల్ 9న పాదయాత్ర ప్రారంభించారు. 1,467 కిలోమీటర్ల మేర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సాగిన యాత్రలో ఎన్నో సమస్యలను దగ్గర నుంచి చూశారు.

# చూశారు..
# విన్నారు..
# చేశారు..

ప్రజలకు భరోసా ఇచ్చిన వైఎస్ ప్రజా ప్రస్థానం
అన్ని వర్గాల ప్రజల కడగండ్లను కళ్లారా చూసిన వైఎస్సార్
అందరి కష్టాలను మస్తిష్కంలో నిక్షిప్తం చేసుకున్న వైనం
సమస్యలు చెప్పకుని ఊరట పొందిన జనం
సీఎం కాగానే రూపుదిద్దుకున్న పథకాలు
జనరంజక పాలనకు శ్రీకారం

## చెరగని చిరునవ్వుతో భరోసా



మండుటెండలో పాదయాత్ర ప్రారంభించి ఒక్కో ఊళ్లో ప్రజల కష్టాలు వింటూ.. పాలకుల నిర్లక్ష్యపు వైఖరికి ఆనవాళ్లుగా మిగిలిన పంట పొలాలను పరిశీలిస్తూ.. అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ.. నేనున్నానంటూ వెన్నుతట్టి ధైర్యం చెబుతూ.. ముందుకు సాగారు. ప్రజల మధ్యే తింటూ.. వారి మధ్యే పడుకుంటూ అందరి ఇబ్బందులను కళ్లారా చూసి చలించిపోయారు. రైతులు పడుతున్న కష్టాలు చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందరి కష్టాలు, కన్నీళ్లు ఆయన మస్తిష్కంలో రికార్డయ్యాయి. ముఖ్యమంత్రి కాగానే ఏ వర్గం వారికి ఎలా న్యాయం చేయాలో డిజైన్ సిద్ధమైపోయింది.

– సాక్షి ప్రత్యేక ప్రతినిధి

# అన్నిటికీ మూలం.. ఆయనే

- వైఎస్సార్‌పై ఎన్నో పుస్తకాలు, పాటలు
- మహానేతతో తమ అనుభవాలను పంచుకున్న ప్రముఖులు
- సూపర్‌హిట్‌గా నిలిచిన వైఎస్సార్ బయోపిక్.. 'యాత్ర'







**సాక్షి, అమరావతి:** సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన జనరంజకులైన పాలకుల్ని, ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేసిన మహానుభావుల్ని వారు మరణించాక కూడా ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారు. భౌతికంగా ప్రజల మధ్య లేకపోయినా వారి గొప్పతనాన్ని స్మరించుకుంటూ పుస్తకాలు, సినిమాలు, షార్ట్‌ఫిల్మ్‌లు రావడం కొత్తేమీ కాదు. ఈ నేపథ్యంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలు తెలుగు ప్రజల జీవితాలతో ఎంతలా పెనవేసుకుపోయాయో, వాటితో ఎంతమంది జీవితాలు బాగుపడ్డాయో చెప్పనలవి కాదు. అందుకే కన్నుమూశాక కూడా ఆయన కీర్తిప్రతిష్టలు తెలుగు రాష్ట్రాల్లో మరే ఇతర నాయకుడికి లేనంతగా ఇనుమడించాయి.

**'యాత్ర' అపూర్వం..:** ప్రతిపక్ష నేతగా వైఎస్సార్ 1467 కిలోమీటర్ల మేర చేసిన పాదయాత్ర (ప్రజాప్రస్థానం) ఇతివృత్తంగా ప్రముఖ నటుడు మమ్ముట్టి కథానాయకుడిగా రూపొందిన 'యాత్ర' చిత్రం సంచలన విజయం సాధించింది. దేశ, విదేశాల్లో తెలుగు ప్రేక్షకుల నుంచి అపూర్వ ఆదరణ దక్కించుకుంది. వైఎస్సార్ మాటతప్పని, మడమ తిప్పని వ్యవహార శైలి, ప్రజల చిన్నచిన్న సమస్యలకే కరిగిపోయే ఆయన దయార్ద్ర హృదయం, ఆయన గుణగణాలను ప్రతిబింబించేలా తీసిన 'యాత్ర' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మాండంగా ఆదరించారు. 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అంటూ ఆ చిత్రంలో వైఎస్సార్ పాత్రలో జీవించిన మమ్ముట్టి పలికిన డైలాగ్ తెలుగునాట జనాల్లోకి చొచ్చుకుపోయింది. పాదయాత్ర చేపట్టడానికి దారితీసిన పరిస్థితులు, పాదయాత్ర వల్ల వైఎస్సార్‌లో వచ్చిన మార్పు, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతులకు మేలు చేసే పథకాలు ప్రవేశపెట్టడానికి కారణాలను ఈ సినిమా చక్కగా ప్రజల ముందు ఆవిష్కరించింది. 2019 సాధారణ ఎన్నికలకు ముందు విడుదలైన ఈ చిత్రం విజయదుందుభి మోగించింది. వైఎస్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ రాసిన 'వైఎస్సార్‌తో ఉండవల్లి అరుణ్‌కుమార్' అనే పుస్తకం ద్వారా ఆ మహానేత వ్యక్తిత్వాన్ని సామాన్య ప్రజలు మరింత ఎక్కువగా తెలుసుకునే అవకాశం కలిగింది. వైఎస్సార్ కన్నుమూశాక ఆయన గురించి పత్రికల్లో వివిధ ప్రముఖులు రాసిన వ్యాసాలను, ఆయనతో వారి అనుభవాలను సంకలనం చేసి వెలువడ్డ తొలి పుస్తకం.. 'జననేత'. మాజీ జర్నలిస్టు ఎల్.విజయకృష్ణారెడ్డి (ఎల్వీకే) ఆధ్వర్యంలో వచ్చిన ఈ పుస్తకాన్ని నాడు ఎంపీగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. వైఎస్సార్‌కు సన్నిహితుడైన షేక్ ఇమాం (కదలిక పత్రిక సంపాదకుడు) 'జనం చెక్కిన శిల్పం' పేరుతో రూపొందించిన వ్యాసాల సంపుటి పుస్తకం వైఎస్ వ్యక్తిత్వాన్ని మరింత లోతుగా ఆవిష్కరించింది. పేద, బడుగు వర్గాల సమస్యల పట్ల మహానేత వైఖరి, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయంపై ఆయన ఆసక్తి, అన్నిటి కంటే మించి.. పేదలకు విద్య వంటి అంశాలపై వైఎస్ ఆలోచనలు ఎలా ఉండేవో ఈ పుస్తకంలో ఇమాం చక్కగా వివరించారు. 'వైఎస్సార్.. ది మ్యాన్ ఆఫ్ ది పీపుల్ (ప్రజల మనిషి.. వైఎస్సార్)' పేరుతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రాణస్నేహితుడు, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు 150 ఫొటోలతో ఆకర్షణీయంగా ఒక పుస్తకాన్ని రూపొందించారు. 2011లో అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగం వైఎస్ పాలన, సంక్షేమంపై నిర్వహించిన సెమినార్‌కు దేశవ్యాప్తంగా ఎందరో విద్యావేత్తలు హాజరయ్యారు. రామగంగిరెడ్డి అనే అసిస్టెంట్ ప్రొఫెసర్ వైఎస్సార్ పాదయాత్రపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందడం గమనార్హం.

## 70 రోజులు వెంటిలేటర్ పైనే..

గుంటూరు జిల్లా కొత్తపేటకు చెందిన ఈశ్వరరెడ్డి, రమాదేవి దంపతులది నిరుపేద కుటుంబం. ఈశ్వరరెడ్డి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుమస్తాగా పనిచేస్తున్నారు. పెళ్లయ్యాక చాలాకాలంపాటు వీరికి పిల్లలు లేరు. 2008లో ఈశ్వరరెడ్డి భార్య గర్భం దాల్చింది. దీంతో ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేవు. అయితే.. ఈ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. రమాదేవికి 7వ నెలలోనే ప్రసవమై ఇద్దరు కవల ఆడ పిల్లలు పుట్టారు. ఒక్కో పాప కేవలం 900 గ్రాములు మాత్రమే బరువు ఉంది. ఆ చిన్నారుల బరువు చూసి వైద్యులు ఆశలు వదులుకోవాల్సిందేనన్నారు. వైద్యుల మాటలతో లేకలేక పుట్టిన చిన్నారులను చూసి తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారు. అదే సమయంలో ఆరోగ్యశ్రీ పథకం వచ్చింది. ఆ చిన్నారులను ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించుకోండని వైద్యులు చెప్పారు. దీంతో ఆ చిన్నపిల్లలిద్దరినీ వెంటిలేటర్‌పై గుంటూరులోని శ్రీరామచంద్ర చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో ఆ ఇద్దరినీ ఆస్పత్రిలో చేర్చుకున్నారు. పిల్లలిద్దరికీ 70 రోజులపాటు వెంటిలేటర్‌పైనే వైద్యమందించారు. సాధారణంగా వెంటిలేటర్‌పైన ఉంటే రోజుకు వేలల్లోనే ఖర్చవుతుంది. ఈ పరిస్థితుల్లో చిన్నారులిద్దరికీ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా నయాపైసా తీసుకోకుండా 70 రోజుల పాటు వైద్యమందించి వారి ప్రాణాలు కాపాడారు. ఆ చిన్నారులు మోహన దీప్తి, మోహనరూప ఇప్పుడు 5వ తరగతి చదువుతున్నారు. వైఎస్సార్ పుణ్యమాని ఇప్పుడు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. వైఎస్సార్ తమ కుటుంబంలో సంతోషం నింపారని దంపతులిద్దరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు పుట్టినప్పుడు వైద్యం చేయించడానికి డబ్బులు లేవని, ఆస్తులమ్ముకుని బతికించుకుందామన్నా ఆస్తులు లేవని నాటి సంఘటనను గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పిల్లలిద్దరినీ చూసినప్పుడు బాధ, భయమూ వెంటాడాయని వివరించారు. ఆ దేవుడే ఆరోగ్యశ్రీ రూపంలో తన పిల్లలకు ప్రాణభిక్ష పెట్టారని చెబుతున్నారు. 70 రోజులు ఆస్పత్రిలో ఉన్నా ఒక్క నయాపైసా అడగలేదని, మందుల నుంచి ఇంజక్షన్ల వరకూ అన్నింటికీ ఆరోగ్యశ్రీ వర్తించిందని, తమకు నిజమైన దైవం వైఎస్సారే అంటున్నారు.. ఆ దంపతులు.



## దేవుడు ఎక్కడో లేడు..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూపంలో దేవుడు ఉన్నారంటున్నారు.. విజయవాడకు చెందిన యార్లగడ్డ ఉదయశ్రీ. ఆమె తండ్రి శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తుండేవారు. ఉదయశ్రీతో పాటు ఆమె అన్న చలపతి కుమార్ 2008లో ఒకేసారి బీటెక్‌లో చేరారు. దీంతో ఇద్దరికీ ఫీజులు చెల్లించడం శ్రీనివాసరావుకి కష్టమైంది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్సార్ ఫీజురీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడంతో తాను, తన అన్న ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువు పూర్తి చేసుకోగలిగామని, లేదంటే చాలా కష్టాలు పడేవాళ్లమని నాటి విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ దయతో తాను ప్రస్తుతం బెంగళూరులోని ఇన్ఫోసిస్‌లో అసోసియేట్ కన్సల్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ ఏడాదికి రూ.9 లక్షల వేతనం తీసుకుంటున్నానని సంతోషం వ్యక్తం చేశారు. తన అన్న కూడా మైసూరులో మంచి ఉద్యోగం చేస్తున్నాడని చెప్పారు.



## వేడి వేడి టీ స్నేహం

వైఎస్‌కు శ్రమజీవులకు మించిన స్నేహితులు లేరు. అప్పట్లో ఆయన వ్యాపార నిమిత్తం కోడూరు నుంచి చెన్నైకి, చెన్నై నుంచి కోడూరుకి తరచూ వెళ్లి వస్తుండేవారు. సాధారణంగా ఆయన ప్రయాణాలు తెల్లవారుజాము నాలుగ్గంటలకు మొదలయ్యేవి. అంత ఉదయం బయలుదేరాక ఆయన తప్పకుండా ఆ దారిలో వచ్చే తిరువళ్లూరు అనే ఊరిలో ఒక చిన్న టీ–స్టాల్ దగ్గర ఆగేవారు. అక్కడే కాస్త టీ తాగి మళ్లీ ప్రయాణం కొనసాగించేవారు. టీ షాపు ఓనరుతో పిచ్చాపాటి మాట్లాడేవారు. వైఎస్ ఎవరో మొదట్లో ఆ టీ స్టాల్ నడిపే వ్యక్తికి తెలియదు. తెలుసుకున్న తర్వాత ఆ ఓనరు ఆనందానికి అవధుల్లేవు. అంతటి నాయకుడు తనతో కబుర్లు చెప్పడమా అని తబ్బిబ్బు అయ్యేవాడు. చాలా ఏళ్ల పాటు నడిచిన వేడి వేడి టీ స్నేహం అది.

## కనికరానికి మించిన రూల్ లేదు

వైఎస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి ప్రమాదంలో గాయపడిన నాలుగేళ్ల కోయ పిల్లాణ్ణి తీసుకొచ్చారు. కాలు విరిగి వేలాడుతోంది. మల్టిపుల్ సర్జరీస్ అవసరం. కాని నిరుపేదలైన తల్లిదండ్రుల దగ్గర ఉన్నది కేవలం 15,000 రూపాయలు. 'అవసరమైతే కాలు తీసేయండి డాక్టర్' అన్నారా తల్లిదండ్రులు కళ్లనీళ్లు పెట్టుకుంటూ. కానీ ఆ డాక్టర్ అలా చేయకుండా వ్యక్తిగత పూచీకత్తుపై హాస్పిటల్‌లో చెప్పి తానే ఖరీదైన మల్టిపుల్ సర్జరీలు చేశాడు. మరుసటి రోజు ఆ విషయాన్ని వైఎస్‌ను కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లాడు. ఆ సర్జరీ 'ఆరోగ్యశ్రీ' కిందకి రాదు. కానీ వైఎస్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా లక్షలు ఖర్చైన ఆ మల్టిపుల్ సర్జరీకి అనుమతి ఇచ్చారు.













## విద్యార్థి నుంచి సీఎం వరకు














